Thanjavur Sarasvati Mahal Series No. 69

ఉషాపరిణయము

USHAPARINAYAMU

Thanjavur Maharaja Serfoji's

SARASVATI MAHAL LIBRARY

THANJAVUR.

Thanjavur Sarasvati Mahal Series No. 69

ఉషాపరిణయము

(పద్యకావ్యము)

USHAPARINAYAMU

(PADYA KAVYA)

By

RANGAJAMMA

CRITICALLY EDITED WITH AN INTRODUCTION

By

Sri. **V. SUNDARA SARMA,**
Pandit (Retd.,), Sarasvati Mahal Library, Thanjavur.

Thanjavur Maharaja Serfoji's

SARASVATI MAHAL LIBRARY

THANJAVUR.

2007 Price : Rs. **90-00**

BIBLIOGRAPHICAL DATA

Title of the book	:	USHAPARINAYAMU
Editor	:	V. Sundara Sarma,
Publisher	:	Director, Sarasvati Mahal Library, Thanjavur - 613 009
Publication No.	.	69
Language	·	Telugu
Edition	:	II Edition
Date of Publication	:	June, 2007
Paper used`	:	T. N. P. L 18.6 kg.
Size of the book	:	21 x 14 cm
Printing type used	.	16 pt.
Number of pages	:	168
Number of copies	:	100
Printer	:	Saraśvati Mahal Libray Press
Binding	:	Card Board
Subject	:	Kavya
Price	:	Rs. 90-00

வெளியீட்டாளர் முகவுரை

சரசுவதி மகால் நூலகம் எண்ணற்ற பன்மொழி சுவடிகளைப் பாதுகாத்து பராமரித்து வருவதோடு அவற்றை நூல்களாக பதிப்பித்து அவை கூறும் மாட்சிமை கருத்தினை மக்களிடம் கொண்டு சேர்க்கும் நற்பணியினை ஆற்றிவருகின்றது. அவ்வகையில் **"உஷாபரிணயம்"** என்னும் இந்நூல் தெலுங்கு மொழித்துறையிலிருந்து புராணக் கதையின் அடிப்படையில் வெளிவருகின்றது.

தஞ்சையை ஆண்ட நாயக்க மன்னர்களில் ஒருவரான ஸ்ரீவிஜயராகவ நாயக்கரின் அவையை அலங்கரித்த புலவர் ரங்காஜம்மா என்பவரே உஷாபரிணயம் என்ற இந்நூலின் ஆசிரியராவார்.

பாணாசுரன் மகள் உஷாவிற்கும் ஸ்ரீகிருஷ்ணனின் புதல்வன் அநிருத்தனுக்கும் நடைபெறுகின்ற திருமணமே இந்நூலின் தோற்றத்தைக் குறித்த கருப்பொருளாகும்.

பாணன் என்பவன் அசுர குலத்தில் தோன்றியவன். அவன் சிறந்த சிவபக்தன். சிவபெருமானைக் குறித்து நற்றவமியற்றி ஆயிரங்கைகள் வரமாக பெற்றவன். இவனது மகள் உஷாவின் மீது மையல் கொண்டான் அநிருத்தன். இவளை கடத்திச் செல்கிறான். செய்தியறிந்த பாணாசுரன் அநிருத்தனை சிறைபடுத்துகிறான். இதனால் ஸ்ரீகிருஷ்ணனே போர்புரியவருகின்றான். போரில் பிரம்மதேவர் சமாதானம் செய்துவைக்க, உஷாவிற்கும் அநிருத்தனுக்கும் திருமணம் இனிதே நடந்தேறுகிறது.

இந்நூலின் முதற்பதிப்பு 1955 ஆம் ஆண்டு வெளிவந்துள்ளது. தற்பொழுது இந்நூல் இரண்டாம் பதிப்பாக வெளிவருகின்றது. இதன் பதிப்புப் பணியை தெலுங்குப் பண்டிதர் திரு. வி.சுந்தர சர்மா அவர்கள் விரிவான முன்னுரை, பொருளடக்கம், செய்யுள் முதற்குறிப்பகராதி ஆகியன தெலுங்கு மொழியில் அமைய செவ்வனே செய்திருக்கின்றார். அன்னாருக்கு எனது பாராட்டுக்கள்.

இந்நூல் வெளிவர நிதி உதவி நல்கிய நடுவண் அரசுக்கும், நிருவாக அலுவலர் மற்றும் வெளியீட்டு மேலாளர் (பொறுப்பு) திரு. சாமி. சிவஞானம் அவர்களுக்கும், இந்நூல் கணினி அச்சில் வெளிவர கணினிப் பிரிவில் பணிபுரியும் அனைவருக்கும் என் இனிய பாராட்டுதல்களைத் தெரிவித்துக்கொள்கிறேன்.

ந. முத்துக்கருப்பன்,
மாவட்ட ஆட்சித்தலைவர் (பொறுப்பு)
மற்றும் இயக்குநர்,
சரசுவதி மகால் நூலகம்.

தஞ்சாவூர்
22-6-2007

ఉపోద్ఘాతము

ఈతంజావూరు సరస్వతీమహల్ గ్రంథాలయమునుండి వెలువడు ఆంధ్రగ్రంథములలో నీయుషాపరిణయప్రబంధముకూడా నొకటి. నాయకరాజుల కాలములో సరస్వతీముఖాభివృద్ధిఁ జెందిన యాంధ్రభాషకు నిట్టిగ్రంథములే ప్రబల తార్కాణములు. వచనగ్రంథములు, ద్విపదకావ్యములు, ప్రబంధములు, యక్షగానములు, శతకములు, పదములు, కీర్తనలు మొదలగు నానావిభాగములలో నాకాలమునఁ బెక్కుభంగుల వెల్లివిరిసిన యాంధ్రవాఙ్మయ మాంధ్రవాఙ్మయచరిత్రమందును నట్లే తంజావూరుయందును దనకొక ప్రత్యేకస్థానమును సంపాదించుకొనినది. ముఖ్యముగా రఘునాథనాయకుని (1614-1633) కాలములోను నతని కుమారుఁడైన విజయరాఘవనాయకుని (1633-73) కాలములోను తంజావూరునం దాంధ్రభాష బహుముఖవికాసమును బడసినది. నాటితంజావూరుపరిస్థితి ప్రభువులనుకూడ కవిత్వమునకుఁ బ్రోత్సహించినది. కేవలకవితతో వారు తృప్తి నొందలేదు. కొన్ని రసవత్తరములగు గ్రంథములను సృష్టించి తమమాతృభాషాభిమానమును జక్కఁగ నిరూపించుకొని ధన్యులైరి. స్త్రీలుకూడ కవయిత్రులై తమసరసకవితచేఁ దమ ప్రభువులఁ దృప్తిపఱచి తత్కాలమున నాంధ్రభాషావికాసమునకుఁ దోడ్పడిరి. స్త్రీలలో రంగాజమ్మ, కృష్ణాజి (కృష్ణమాంబ) మొదలగువారు ముఖ్యురాండ్రు.

పై చెప్పిన విభాగములలో నప్రతిమానమైన తమకవితాచాతుర్యమును జాటుచు గ్రంథముల సృష్టించిన యప్పటికవులు తమగ్రంథములఁ గొన్నిటిని ననువాదరూపములుగను గొన్నింటిని స్వతంత్రగ్రంథములుగను వెలయించిరి. ప్రాయికముగా స్వతంత్రగ్రంథములకంటె ననువాదరూపములగు గ్రంథము లెక్కుడు. దీనఁ దత్కవులయొక్క సునిశితభాషాద్వయపారంగతత్వము సువ్యక్తమగుచున్నది. అనువాదరూపములగు గ్రంథములేయైనను స్వతంత్రగ్రంథముల కెంతమాత్రము తీసిపోక సకలవిధములఁ బరిపుష్టములై సరసమృదుమధురవచోనిగుంభితములై రసికజనమనోరంజకములై స్వతంత్రగ్రంథములకన్న నెక్కుడుగఁ గన్పట్టుచున్నవి. అట్టిగ్రంథములలో నీ యుషాపరిణయముకూడ నొకటి యగును. ఇయ్యది గీర్వాణభాషయందుఁ బ్రసిద్ధమైన వ్యాసకృతమగు హరివంశమందుఁ బ్రసిద్ధమైన యుషావృత్తము, ఈకథ మూలముగా స్వీకరింపఁబడి మహాప్రబంధమునకుఁ గల కొన్ని ముఖ్యలక్షణ

ములఁ జేర్పఁబడి యొక్క మనోహరకావ్యముగాఁ జేయఁబడినది. ఈ ప్రచురణమునకు మాతృకమైన తాళపత్రప్రతి యొక్కటియే యీ గ్రంథాలయమునఁ గన్పట్టుచున్నది. ఆప్రతియొక్క వివరములు సవివరణసూచీపత్రమందు (Descriptive catalogue of the Telugu Mss. in the T. M. S. S. M. Library, Tanjore) నిక్రిందరీతిని నున్నవి.

D. No. 140, M. No. 283.

S. 16×1½; L-110; 11.4,-5; G. 2200.

ఉషాపరిణయము (రంగాజమ్మ)

Beginning :— & End :— గ్రంథారంభము చక్కగ నున్నదిగాని గ్రంథాంతమునఁ గొంతభాగమును గ్రంథాంతగద్యయు లోపించినవి.

Subject :—ఉషాపరిణయము. దీన నుషానిరుద్ధుల వివాహము వర్ణింపఁబడెను.

Remarks :—అసమగ్రము. తప్పులులేవు. వ్రాతమంచిది. శైథిల్యముహెచ్చు. గ్రంథపాతమధికము. ఏతద్గ్రంథాంతమునఁ గొన్నిపత్రము లత్యంతజీర్ణములు. మూఁడాశ్వాసములుమాత్రము సమగ్రముగ నున్నవి. నాలవయాశ్వాసము కొంతవఱకు నున్నది. చక్కనికవిత్వము.

ఈ యుషాపరిణయ మైదాశ్వాసముల గ్రంథముగ నుండినదేమో! కాని మనకుఁ జతుర్థాశ్వాసముకూడ సంపూర్ణముగ దొరకుటలేదు. నాల్గవ యాశ్వాసమున బాణాసురయుద్ధము ప్రతిపాద్యము. అదియు సగముమాత్రమే దొరకుచున్నది, ఐదవ యాశ్వాసమున నుషానిరుద్ధుల వివాహము వర్ణింపఁబడియుండ నోపు. ఇట్టి రసవత్తరమగు కావ్య మసంపూర్ణముగ దొరకుట విచారింపఁ దగినది.

—: గ్రంథకర్త్రి - రంగాజమ్మ :—

ఈ యుషాపరిణయగ్రంథమును విరచించి యాంధ్రకవితాలోకమున నపూర్వమగు కీర్తి నార్జించిన కవయిత్రి రంగాజమ్మ. ఈమె పసుపులేటి వెంకటాద్రి కుమార్తె. తల్లిపేరు మంగమాంబ. ఈమె "మన్నారుదాసవిలాస" ప్రబంధము "ఉషాపరిణయము" 'మన్నారుదాసవిలాసనాటక' మను యక్షగానమును

రామాయణ, భారత, భాగవత సంగ్రహములు" మొదలగు గ్రంథములు విరచించినది. ఈమెచే రచయింపఁబడిన రామాయణ, భారత, భాగవత, గ్రంథములు దొరకుట లేదు. మన్నారుదాసవిలాసప్రబంధము, మన్నారుదాసవిలాసనాటకము నుషాపరిణయమున్ను దొరకుచున్నవి. అందు మన్నారుదాసవిలాసనాటకమను యక్షగానము- 1927-వ సంవత్సరమున కాకినాడ "ఆంధ్రసాహిత్యపరిషత్తు" వారిచే ప్రకటిత మయ్యెను. మన్నారుదాసవిలాసప్రబంధ మింకను ప్రకటింపఁబడలేదు. పైగ్రంథమునకు నీగ్రంథాలయమున రెండు ప్రతులు గలవు. ఒకటి తెలుఁగులిపియందును మఱియొకటి గ్రంథలిపియందును గలదు. రెండు నతిశిథిలములే. దొరికినంతవఱకు త్వరలో నద్దానిని ప్రచురించుట మిక్కిలి వాంఛనీయము. ఇఁక నీయుషాపరిణయ గ్రంథ మిప్పు డసంపూర్ణమైనప్పటికిని ప్రచురింప సంకల్పించినందులకు గ్రంథాలయాధికారులు శ్లాఘనీయులు.

ఈమె రచించిన రామాయణభారతభాగవతాదిగ్రంథములు దొరకకపోగా మిగిలిన నీమూఁడుగ్రంథములలో మన్నారుదాసవిలాసప్రబంధమును మొదట రచించినట్లీ యుషాపరిణయగ్రంథమునందే యాదిలోఁ గృత్యవతారికయందుఁ జెప్పఁబడి యున్నది.

> "మాధుర్యమునమించు 'మన్నారుదాసవి
> లాసప్రబంధంబు లలితఫణితి"

ఉషా - ప్ర - 6.

మన్నారుదాసవిలాసనాటకమందు "మన్నారుదాసవిలాసోషాపరిణయమహాప్రబంధ నిబంధన కృతలక్షణ" యని గ్రంథోపసంహారమునఁ దన్ను పేర్కొనుటచేతను మన్నారుదాసవిలాసనాటకముయొక్క ప్రస్తావమైన నీయుషాపరిణయమందు రాక పోవుటను బట్టియు నీయుషాపరిణయకృత్యనంతరమే మన్నారుదాసవిలాసనాటకము రచింపఁబడిన దని నిర్వివాదముగ నిశ్చయింపవచ్చును. ఈమెయొక్క కృతియగు మన్నారుదాసవిలాసప్రబంధమున నితరకృతుల ప్రస్తావ మాదిని గాని యంతమున గాని లేకుండుటనుబట్టి మన్నారుదాసవిలాసమే యీమెయొక్క యాదిమకృతి యనికూడ నిశ్చయింపవచ్చును. మన్నారుదాసవిలాసప్రబంధముయొక్క యవతారికను బరిశీలించినను గూడ పైవిషయము స్పష్టము కాఁగలదు. ఇదిగాక :—

> "గావించి మిగుల శృంగారంబు గప్పటఁ
> బదములు మృదురసాస్పదము లగుచు"

ఉషా - ప్ర - 6.

అని యుషాపరిణయాదిలోను, "శృంగారరసతరంగితపదకవిత్వమహనీయమతీ శ్యాత్రియుం" అని మూఁడు గ్రంథములలోను గ్రంథాంతగద్యలో స్వయముగాఁ జెప్పుకొనుటచేత నీమె శృంగారరసము నుట్టిపడు పదకవిత్వమందును గూడ యనన్యసామాన్యమైన సామర్థ్యముఁ గలది యని స్పష్టమగుచున్నది. కాని యీమెచే నిర్మింపఁబడిన పదములు "మన్నారుదాసవిలాసనాటకము"నఁ దక్క మఱెక్కడను గానరావు. ఈమె యష్ట భాషలలోనుఁ బ్రవీణురాలనుటకు పై గ్రంథములోని వివిధభాషాకవిత్వమే నిదర్శనమగును. ఈమె తంజాపురాధీశ్వరుఁడగు విజయరాఘవునిచేఁ గనకాభిషేకము చేయించుకొన్న యాంధ్రమహిళారత్నము. అసామాన్యమైన మేధాసంపత్తిఁ గలిగి రాజసభాదులలో మహావిద్వద్గోష్ఠిలో భళి యనఁదగు కవితాసంపత్తిఁగల మహాకవులకు గాని దుర్లభమైన కనకాభిషేకము నీమె పొందిన దన నీమె విజయరాఘవుని యాస్థానమున నెంతటి మాననీయమైన స్థానమును సంపాదించినదో వేరుగఁ జెప్ప నక్కఱలేదు. ఇట్టి గౌరవమును స్త్రీ లింతవఱకు బడసినట్లు వినియుండలేదు.

అనేకసందర్భములను బరిశీలింపఁగా విజయరాఘవనాయకుఁడు రంగాజమ్మపై మిక్కిలి యనురాగము గలవాఁడనియును నామెను నితరులకన్న నెక్కుడుగా నాదరించెననియును వ్యక్తమగుచున్నది. రఘునాథనాయకుని తర్వాత తంజాపురమున సమరశంకయే లేకుండఁ జాలకాలము నిర్భీకముగ రాజ్యమును బాలించినవాఁడు విజయరాఘవుఁడని చరిత్రకారులు నిశ్చయించియున్నారు. అట్టిపట్ల విజయరాఘవుఁడు కాలమునంతయు సరససాహిత్యగోష్ఠిలోను విశేషించి శృంగారవిలాసములలోఁ గడపుటకు నప్పటిపరిస్థితు లనుకూలముగ నుండినట్లును చరిత్రకారు లభిప్రాయపడుచున్నారు. రసికుఁడును విద్యత్కుఁడియును విశేషించి యత్యధికశృంగారప్రియుఁడును నగు నతఁడు సకలవిధముల నుత్తమశ్రేణిలో గణింపఁదగు స్త్రీరత్నము నాదరించుటలో వింతలేదు.

రంగాజమ్మయు సామాన్యురాలు కాదు. శృంగారరసము వెల్లువుకు పదకవిత్వములో దిట్ట. మృదుమధురవచోనిగుంభితములును, శృంగారరసతరంగితములు నగు కావ్యములు నిర్మించుటలో మేటి. విజయరాఘవుని కులగురువగు శ్రీ శ్రీనివాసతాతాచార్యులచే మన్ననఁబొందిన కవయిత్రి. ఇట్టి యాకర్షకములగు గుణాతిశయములఁ బడసిన వనితారత్నము రాజదృష్టి నాకర్షించుట సహజమే.

ఇచ్చట ముఖ్యముగా గమనింపవలసిన విషయ మొకటి గలదు. రంగాజమ్మ యొక గణిక యనియు నామెయందు విజరాఘవుఁ డత్యాదరాసక్తిఁ గలవాఁడనియు, నామెయు నేకచారిణీవ్రతము స్వీకరించి విజయరాఘవుని సేవించుచు వచ్చినదనియు

మానసీయులగు విమర్శకాగ్రేసరులు చాలమంది యభిప్రాయపడుచున్నారు. ఈ విషయమును సావధానముగఁ బరిశీలింపవలసియున్నది. రంగాజమ్మ గణిక యని నిరూపించుటకుఁ దగినయాధారములు మృగ్యములు. ప్రబంధమూలముగా మనకు దొరకు విషయములనుబట్టి నిర్ణయించుట సముంజసము కాఁగలదు. రంగాజమ్మయొక్క కృతిత్రయమందును విజయరాఘవుని దన భర్తగానే పేర్కొనుచున్నది. విశేషించి తన కడపటికృతియగు మన్నారుదాసవిలాసనాటకమునందు "హెచ్చుగా నచ్యుతవిజయరాఘవసార్వభౌమధర్మపత్నియై రంగుమీరు రంగాజమ్మ" అని తాను విజయరాఘవుని 'ధర్మపత్ని' యనియే చెప్పికొనుచున్నది. ప్రాణనాథుఁడు, భర్త, నాయకుఁడు, ప్రియుఁడు, ఇత్యాదిపదములచే విజయరాఘవుని పేర్కొనుచువచ్చిన యామె యతఁడు తన భర్తయను విషయమును నిశ్శంకముగఁ జెప్పఁదలఁచి "ధర్మపత్ని" యన్నది. పై పదములను గణిక తన ప్రియుని విషయమునఁ బ్రయోగింప వీలగును. కాని ధర్మపత్నీశబ్దము వారిద్దఱి వైవాహికసంబంధమును దెలుపుచున్నది. "రత్నహారీతు పార్థివః" (రాజ్యమునందలి శ్రేష్ఠ రత్నముల సంగ్రహించువాఁడు పార్థివుఁడు, నీమె స్త్రీరత్నము.) "రాజానో బహువల్లభాః" (అనేకపత్నులఁ గలవారు రాజులు.) అను సూక్తుల ననుసరించి యీ రంగాజమ్మ విజయరాఘవుని ధర్మపత్నిగానే యెందుల కుండరాదు? రంగాజమ్మ గణిక యనుటకు నీ క్రింది పద్య ముదహరింపఁబడుచున్నది.

ఉ. ఏవనితల్ మముం దలఁప నేమిపనో? తమ రాదువారుగా
రో? కలపించు నేర్పులుఁగరో? తము కాఁగిటిలోన నుండఁగా
రావదేమిరా? విజయరాఘవ! యంచిలు దూరి బల్మి చేఁ
దీవరకత్తెనై యిటుల తీసుకవచ్చితి నా తలోదరీ!

విజయరాఘవుఁ డెల్లప్పుడును నీరంగాజమ్మతోఁ గ్రీడించుచుండుట గాంచి యాతని పట్టమహిషి యాగ్రమున నొకదూతీమూలముగా నిష్ఠురోక్తిగర్భితమైన వార్తను బంపెనట. అద్దానికి బదులుగా రంగాజమ్మ పై పద్యమును బంపె నని చెప్పఁబడుచున్నది.

పై పద్యమును రచించినది రంగాజమ్మయే యనుట కాధారములేవి? వేరెవరైనను రచించియుండరాదా? ఎందఱో స్త్రీరత్నములు కవయిత్రులుగా నాస్థానమున నుండలేదా! అట్లు రంగాజమ్మయే రచించియుండెనను యుండెవచ్చు ననుకొన్నను నద్దానివలన నామె గణికాత్వము నిరూపితమగునా! అట్లామెయే రచించి నట్లంగీకరించినను కూడ నావిని సవతులమధ్య నిష్ఠురోక్తులుగ భావింపరాదా!

ఇట్లు ప్రాబంధికమార్గము సమీచీనమై సవ్యముగా స్పష్టముగా నుండగా నసామాన్యకవితాసంపత్తిగలిగి విదుషీమణియు కవయిత్రియునగు రంగాజమ్మ వేశ్య యని యామెకు గణికాత్వము నంటగట్టుట సాహసమే యగును. ప్రాబంధికదృష్టిని (చారిత్రముగ నెట్లున్నను) విద్వత్కవియు సరసుఁడును సంగీతసాహిత్యప్రియుఁడును కవియు కవిజనాశ్రయుఁడును నుత్తమనాయకుఁడును నగు విజయరాఘవనాయకుని వేశ్యాలోలునిగాఁ జేయుటయు వైపరీత్యమే. ఆస్థానకవియుఁ గులగురువును నగు శ్రీ శ్రీనివాసతాతాచార్యులవంటివా రాస్థానమున నుండ రంగాజమ్మ గణికయే యైనచో "ధర్మపత్ని" శబ్దమును ప్రయోగించి కావ్యమును రచింప నూరకుందురా!

ఉషాపరిణయోపోద్ఘాతమునఁ గృతికర్తృవంశవర్ణనారంభమున శ్రీ శ్రీనివాస తాతాచార్యులు చెప్పినట్లీపద్యము గూడ గలదు:—

క. <u>నీపతి</u> మన్నరుదాసుఁడు
గోపాలుఁడు కనుక నితఁడు కోర్కులు హెచ్చన్
జేపట్టి మనుప నెలకొను
నాపలుకుల నెలఁత నీముఖాంబుజసీమన్.

—: మన్నారుదాసవిలాసప్రబంధము (ప్రథమాశ్వాసము) :—

క. చతురాస్యుం డనఁదగు <u>నీ</u>
<u>పతి</u> యిటు నిను గారవించి బహుమతి మీరన్
కృతి రచియింపు మనన్ భా
రతికిన్ బ్రతివత్తువమ్మ రంగాజమ్మా!

ఆస్థానకవియుఁ బండితుఁడు కులగురువు నగు నీయనయే రంగాజమ్మను జూచి "నీపతి మన్నరుదాసుఁ"డని ప్రయోగించుటయు గమనార్హము. మఱియు నొకవేశ్య తంజాపురాధీశ్వరుఁడైన విజయరాఘవసార్వభౌమునిధర్మపత్ని యని చెప్పుచు నొకగ్రంథమును వ్రాయుచుండ సభాస్థలిలో నున్న పండితులు నూరకుందురా! కాబట్టి యీవిషయము దీర్ఘముగా విచారింపవలసియున్నది. చరిత్రలో సార్వభౌముని పట్టమహిషియొక్క పేరుమాత్రమే పేర్కొనఁబడుట సంప్రదాయము. అతని కెందఱైనను భార్య లుండవచ్చును, కాని వారందఱును పట్టమహిషులు కారుగదా! ఆరీతిగనే విజయరాఘవసార్వభౌమునకు నెందఱో ధర్మపత్ను లుండ

వచ్చెను. పట్టమహిషి [1]"రాజగోపాలాంబిక". పత్నులలో నొకతె రంగాజమ్మ. ఈమె సరసమధురకావ్యనిర్మాణచతుర యగు కవయిత్రి కాబట్టి నీయంశమును గ్రంథమూలమునఁ జెప్పుట కొకయవకాశ మామెకు దొరికినది. అట్టి యవకాశ మును సద్వినియోగపఱచుకొన్న దీ రంగాజమ్మ. పైవిధముగ నిర్ణయించుటకే అధికములైన యాధారము లుండ వేరువిధముగా నిర్ణయించుట సమంజసమగునా! అను విషయమును సహృదయులు సావధానముగఁ బరిశీలింపవలసియున్నది.

—: కృతిభర్త - విజయరాఘవనాయకుఁడు :—

ఇతఁడు తంజాపురరాజ్యము నతులితకీర్తివైభవములతోఁ బాలించిన యాంధ్ర నాయకరాజులలో నొకఁడు. రఘునాథనాయకుని (1614-1633) కుమారుఁడు. విజయరాఘవనాయకుఁడును (1633-1673) తనతండ్రివలెనే కవి, కవిజనాశ్రయుఁడు, విష్ణుభక్తుఁడు, వైష్ణవాభిమాని. ఈతని యిష్టదైవము తంజాపుర మండలములోని 'మన్నారుగుడి' క్షేత్రమునఁ బ్రసిద్ధిఁజెందిన రాజగోపాలస్వామి. ఆ దైవ యనుగ్రహముచే నితఁడు కలిగినందున నీతనికి మన్నారుదాసుఁ డనికూడ మరియొక పేరు ప్రసిద్ధి కెక్కిన దని చెప్పుదురు. తంజాపురము నెక్కుడుకాలము పరిపాలించిన యాంధ్ర నాయకరాజులలో నచ్యుతనాయకుఁడు (1561-1614) మొదటివాఁడు. ఇతఁడు 44 సంవత్సరములు తంజాపురమును బాలించినట్లు తెలియుచున్నది. ఇతఁడు విజయ రాఘవుని పితామహుఁడు. రఘునాథనాయకుని తండ్రి. రెండవవాఁడు విజయరాఘవ నాయకుఁడు. (1633-1673) ఇతఁడు 40 సంవత్సరములు నిరర్గళముగఁ దంజాపుర మును బాలించెను.

ఇతని సారస్వతాభిమానమునకుఁ బ్రత్యక్షనిదర్శనములుగా నితనిచే నిర్మింపఁ బడిన పెక్కు గ్రంథములు వెలుఁగుచున్నవి. ముఖ్యముగా "రఘునాథనాయకాభ్యుదయము" రఘునాథాభ్యుదయ"మను ద్విపద యక్షగాన ప్రబంధములను విరచించి కీర్తిఁగాంచినవాఁడు. కామరుసు వెంకటపతిసోమయాజి, కోనేటి దీక్షితచంద్రుఁడు,

---

1. హేమాబ్జనాయికాస్వయంవర ''మను గ్రంథమందు మన్నారుదేవుఁడు తనతల్లి పేరు 'రాజగోపాలాంబిక'యని పేర్కొనియున్నాఁడు. "విజయరాఘవ భూపాలకప్రియపుత్రుండును, రాజగోపాలాంబికాగర్భజలధికువలయమిత్రుఁడును" చూ :— హేమాబ్జనాయికాస్వయంవరము (D. No. 674- M. No. 675.)

చెంగల్వ కాళకవి, పురుషోత్తమదీక్షితుఁడు, మొదలగు కవిప్రకాండు లీతని యాస్థానము నలంకరించిరి. పరంపరాగతకులగురువు పండితాగ్రణి యగు శతక్రతు శ్రీనివాస తాతాచార్యులు విజయరాఘవుని దన తనయునిగానే భావించి యతని సకలవిధయోగక్షేమములయందును శ్రద్ధఁ జూపుచుండిరి. "సాహిత్యరాయ పెంజేర"మను బిరుదందెను బడసిన విజయరాఘవుని పార్శ్వమున ప్రకాశించు శారదాధ్వజ మితని వైదుష్యమును గవితానైపుణ్యమును గవిపండితపక్షపాతిత్వమును దిగంతములకు వ్యాపింపఁ జేయుచుండెను. ఇతని కాలమున యక్షగానములు, ప్రబంధములు, ద్విపదకావ్యములు, పదములు పెక్కు విలసిల్లినవి.

ఇట్లనేకవిధముల నాంధ్రసారస్వతాభివృద్ధిని ప్రధానలక్ష్యముగాఁ గొని వివిధ రంగములఁ గృషిసల్పుచు నాంధ్రకవుల కవయిత్రుల నాదరించిన విజయరాఘవ నాయకుఁ డాంధ్రులకుఁ జిరస్మరణీయుఁడు. ఇతని కాలము స్వర్ణయుగమన నొప్పును. అనితరసాధారణప్రజ్ఞాశాలియై కవిపండితసమాజకల్పవృక్షమై బహు గ్రంథకర్తయు బహుగ్రంథభర్తయు నగు విజయరాఘవనాయకుని కీర్తి వేనోళ్లఁ బొగడఁ దగినది. చెంగల్వ కాళకవి తన కృతిభర్తయగు విజయరాఘవుని సాధారణముగఁ జక్రవర్తిని వర్ణించురీతిగ న్యూనాధిక్యములు లేకుండునట్లుగ నభివర్ణించి తన కవితా పటిమను జూపెను.

కాని యీ యుషాపరిణయ గ్రంథకర్త్రియగు రంగాజమ్మ తనకును దనకృతికిని భర్తయగు విజయరాఘవుని వర్ణించు సందర్భమున కొంచ మత్యధికముగనే చెప్పిన ట్లొప్పుకొనక తప్పదు. వాస్తవపరిస్థితిని కొంచమధికముగాఁ జేసి విజయరాఘవుఁడు శ్రీకృష్ణుని యవతారమే యని నిరూపించుటకుఁ బ్రయత్నించినది. ఈ పద్ధతిని దన కృతిత్రయమందును విడువక యనుసరించినది. అందును మఱియొకవిశేష మేమన, మూఁడు గ్రంథములందునఁగూడ పై విషయముఁ దాను చెప్పినట్లుకాక కులగురువగు శత క్రతు శ్రీనివాస తాతాచార్యులు చెప్పినట్లు గ్రథింపఁబడియుండుట. అందుచేత నందఱకిని నై విషయమునఁ బ్రామాణికబుద్ధి యేర్పడుటకు నధికమగు నవకాశమున్నది కదా! భూపతిని దైవాంశసంభూతునిగ భావించుటయు నారీతిగ వర్ణించుటయు సకలసమ్మత ములే. కాని యద్దాని నత్యధికముగాఁ జేసిన నసహజముగా నుండదా! రంగాజమ్మ యొక్క కృతిత్రయమునుండి పై భాగములుమాత్ర మీక్రింద నివ్వఁబడియున్నవి.

—: మన్నారుదాసవిలాసము (ప్రబంధము) ప్రథమాశ్వాసము :—

ఉ. అమ్మనుజాధినాథుని ప్రియాంగనలై యలరారు చెంజి ల
క్ష్మమ్మ కళావతీసతియు నాత్మజరత్నముఁ గాంచ నెంచి చెం
గమ్మను రాజగోపహరి నర్థిఁ దలంపుచుఁ జాల నెమ్మదిన్
బమ్మిన వేడ్క సల్పిరి తపంబులు దానములున్ వ్రతంబులున్.

సీ. శ్రీరఘునాథధాత్రీతలాధీశ్వరుఁ
డా సతులను గూడి యనుదినంబు
సకలధర్మంబులు సలుపుచు నొకనాఁడు
నామతీర్థంబున నంతరమున
భాసురలీలఁ బద్మాసనాసీనుఁడై
హృదయపంకజమునఁ గుదురుగాఁగ
శ్రీరాజగోపాలశౌరిఁ జెంగమలేశు
వేడ్కతో భావింప వెన్నుఁ డలరి

గీ. యెదుట సన్నిధిసేసి నీకిత్తు వరము
వేఁడు మన సంతసంబున విజయమహిమ
నీ మహీమండలం బెల్ల నేలఁజాలు
తనయు మాకిమ్ము దేవకీతనయ! యనిన.

క. మెచ్చితిమి నీదుకోర్కికి
నచ్చుతరఘునాథభూప! యటులనె నీకున్
మచ్చిక తనయుండనై ధర
నచ్చుగ నీసాధ్విగర్భమం దుదయింతున్.

గీ. తీవి విజయాఢ్యు సుతుని వేఁడితివి గనుక
లీల మము రాఘవునిగఁ గొల్చితివి గనుక
విజయరాఘవనామంబు వెలయఁ దాల్చి
చెలఁగి వెయ్యేండ్లు పుడమి రక్షింపుచుండు.

* * *

సీ. శ్రీతాతయార్యదేశికవర్య ! యేము మీ
మహితోపదేశక్రమమున నేఁడు
నేమంబుమీరంగ నామతీర్థంబయి
చెలువమన్నారు నంచితవిహారు
రాజీవదళనేత్రు రమణీయతరగాత్రు
మంజులలాటు సన్మణికిరీటు
వేత్రహస్తుని సర్వవిబుధప్రశస్తుని
మదిలోన భావింప నెదుటు నతఁడు

గీ. వలసి వలసిన వరములు వేఁడు మనినఁ
బొంగి విజయాఖ్యుఁడైన సుపుత్రు వేఁడ
మమ్ము రాఘవునిం గొల్చు మహిమవలన
విజయరాఘవుఁ డన నుద్భవించు ననియె.

* * *

చ. హితమతియైన యచ్యుతనరేంద్రుని శ్రీరఘునాథనేత క
ర్యుతివ కళావతీసతికి నాహవవైరినుదాపహారియై
సుతుఁ డుదయించె సర్వగుణశోభితుఁ డాశ్రితపారిజాత మ
ప్రతిమబలాఢ్యుఁ డీ విజయరాఘవశౌరి జయానుసారియై.

—: మన్నారుదాసవిలాసము (ప్రబంధము) చతుర్థాశ్వాసము :—

వ. అని పలికిన యాచార్యవర్యునకు సంతసంబున నింతు లిట్లనిరి.

సీ. వినవయ్య యాచార్య ! విన్నవించెద మేము
విన్నకార్యం బెల్ల విశదముగను
రాజచంద్రుండను రాజవర్యునిపుత్రి
ధరఁ గాంతిమతి యనఁ దనరుదాని
ప్రాణపదంబైన భామ యొక్కతె వచ్చి
గజనిమ్మపండ్లు చేకానుక యొసఁగి
యేకాంతమునఁ బల్కె నితనితో నొకమాట
చాల సంతసమందె సకియ కప్పుడు

గీ. సమ్మతి లొసంగినాఁ డట చెమ్మి మీర
నేమి కార్యంబొ ! తెలియదు స్వామి యిప్ప
డిట్టి దొడ్డరహస్యంబు నేమి యనుచుఁ
దెలియ నడుగుఁడు మీరింకఁ దేటగాను.

క. అని పలుకు చెలులమాటలు
విని నవ్వుచు మనసులోన వేడుక మీరన్
దన శ్రీహస్తముచేతను
దనయుని చెమ్మను నిమిరి తగ నిట్లనియెన్.

సీ. ధర నుతింపఁగఁ దగు ధైర్యగుణంబున
మేరువు గెల్చిన మేటి వీవు
ఘనులు మెచ్చఁగఁ దగు గాంభీర్యమహిమను
రత్నాకరుని గెల్చు రాజ వీవు
బుధులు రాఘవుఁ డన భుజపరాక్రమమున
బామదజ్ఞుని గెల్చు జాణ వీవు
పొగడంగఁ దరమైన బుద్ధిచాతురిచేత
ఫణిపతి గెల్చిన ప్రౌఢ వీవె

గీ. ఇట్టి గుణములచే మఱి యెంచి చూడ
నీకు సాటియైన వార లీలోకమునను
నృపతు లెవ్వరు రఘునాథనృపకుమార !
యతులవిమలకరాంక ! విజయరాఘవశశాంక !

క. తెలిసితిమి నీదుకోరికఁ
గలఁకటు వలదింక మేలు గలుగు స్నేహన్
గలికిని వలచిన హేతువుఁ
దెలిపెద వినవయ్య తేటతెల్లమి గాఁగన్

క. ద్వాపరయుగమునఁ జంద్రుఁడు
గోపాలుని చెంతఁ జేరి కోర్కులు మీరన్
శ్రీపతి ! రవిశశిలోచన !
తాపసహృదయాబ్జమిత్ర ! దానవశత్రా !

ఉ. తామరసాప్తపుత్రి యయి ధారుణి మీరు కళిందకన్యకన్
స్వామి వివాహమాట విని చాలముదం బొనఁగూడె నెమ్మదిన్
ప్రేమ మదీయపుత్రికను పెండ్లయి యిప్పుడు వేడ్కమీరఁగా
మామన పాలకింపుచు సుఖంబుగఁ జూడుము రెండుకన్నులున్.

సీ. అన విని గోపాలుఁ డాచంద్రుఁ గనుఁగొని
పలికె నిట్లనుచును భావమలర
నీముద్దుచెల్లెలి నేను పెండ్లాడఁగాఁ
గోద లయ్యెను నీదుకూఁతు రిపుడు
కలియుగంబునఁ జాలఘనుఁడైన రఘునాథ
భూపాలవరునకుఁ బొడిమి యేను
విజయరాఘవుఁడనై విఖ్యాతిమీరెద
దక్షిణద్వారకాస్థలిని నీవు

గీ. రాజచంద్రుఁ డనందగు రాజవయిన
నపుడు నీకన్యఁ బెండ్లాడి యందముగను
సంతసం బొనరించెద సరగ ననియె
గాన విను మింక విజయరాఘవనృపాల!

గీ. నీవు శ్రీరాజగోపాలదేవుఁ డవల
చంద్రుఁడే యెంచ నారాజచంద్రనృపతి
ఘనత నారాజసుతయైన కాంతిమతిని
పెండ్లిసేసెద నే నీకుఁ బ్రేమమీర.

—: మన్నారుదాసవిలాసనాటకము (యక్షగానము) :—

వ. అని యానతిచ్చిన శ్రీనివాసతాతయాచార్యులతో నాటకచకచ లేమను
చున్నారు.

—: ముఖారి—ఆది—దరువు :—

ఏకాంతయోకాని యేకాంత మొకటి
యీకాంతునకుఁ దెల్పె నిందఱుఁ జూడ.

వ. అనిన విని దరహాసవదనుండై గురురాయపట్టభద్రుండు వితతనయుండగు తనతనయుని మేను మస్తరింపుచుఁ గుస్తరించిన నాయస్తోకప్రభావుండగు విజయరాఘవసార్వభౌముండు శుభకరంబైన గురుకరవిమర్శనంబునఁ గలఁక దీఱి తెలివిఁ జెంది మందమందముగ డెందంబున నానందంబు గందళింప నాతిరుమలవంశనందనునికి వందనంబాచరించి యేమియు మందలించలేక యున్నచందంబుఁ జూచి ధీచాతురి మెఱయు నాచార్యు లేమనుచున్నారు.

ఆచార్యులు చదివే ద్విపద :—

మన్నారుదాస ! నీమనసు నేఁ గంటి
విన్నఁదనం బింక విడువుము నీవు
కలికిపై వలచిన కారణం బేమి
తెలిపెద విను తేటతెల్లమిగాను
ద్వాపరయుగమున వచ్చి చంద్రుఁడు
గోపాలుచెంతకుఁ గుతుకంబుమీఱ
రవిశశినేత్ర ! శ్రీరమణీకళత్ర !
వివరింతు వినుము నావిన్నపం బొకటి
తరణికుమారియై తగు కళిందజను
బరిణయంబైన యప్పగిదిని నాడు
చిన్నికోమార్తెను జేకొని రెండు
కన్నులు సరిగానె కనుఁగొనవయ్య
అన విని గోపాలుఁ డాచంద్రుఁ జూచి
సెనరున నిట్లనె నీదుచెల్లెలిని
వేడుకతో మేము పెండ్లాడ వేస
గోద లయ్యెను నీదుకూతురు మాకుఁ
గలియుగంబున యశోగరిమచే ధరణిఁ
బొలుపొంద రఘునాథభూనాథమణికి
విజయరాఘవుఁ డన విఖ్యాతిఁ గాంచి
ప్రజ లెల్లఁ గొనియాడఁ బ్రభవింతు నపుడు
తనరెడు దక్షిణద్వారకాస్థలిని
జనియింపుదువు రాజచంద్రుండ వనఁగ

నపుడు నీకన్నియు నమరఁ జెంగ్లాడి
యపరిమితశ్రీల నలరింతు ననియెఁ
గావున విజయరాఘవ ! వత్స ! నీవె
భావింపగాను గోపాలదేవుఁడవు
చంద్రుండె యారాజచంద్రుండు గాన
సాంద్రమోదమున నాజననాథసుతను
వలివలమేల్మంతి యానఁదగు కాంతి
మతిఁ బెండ్లిసేసెద మనుజేంద్ర ! నీకు.

—: ఉషాపరిణయము (ప్రథమాశ్వాసము) :—

క. అల యచ్యుతభూవిభునకు
వలఘుయశఃస్ఫూర్తి మూర్తిమాంబకు సుతుఁడై
వెలసెఁ రఘునాథమహీ
తలపతి రఘునాథుఁ డితఁడె తప్ప దనంగన్. (9)

సీ. తనర నారఘునాథధరణీశ్వరుఁడు చెంజి
లక్ష్మమ్మ యల్ల కిరాఁ తెమ్మ
పట్టంపురాణులై ప్రబలి సేవ యొనర్పఁ
గులమెల్ల వెలయించు కొమరుఁ వలసి
దానధర్మంబులఁ దపములు సలుపుచుఁ
గస్తూరికృష్ణుని ఘనతి వేఁడ
నల చెంజలక్ష్మమ్మకలలోనఁ గస్తూరి
కృష్ణుఁ డిట్లనెఁ బూర్వవృత్తి మొకటి

గీ. నీవు తొల్లను దేవకీదేవి వరయు
సాటిలేని కళావతీసతి యశోద
యల్ల వసుదేవనందులయాత్మ లివటు
నెగడె నచ్యుతరఘునాథనృపతి యనఁగ. (10)

సీ. అల వసుదేవున కాత్మసంభవుఁడనై
మందలోఁ బెరుగంగ నందు నింట
దపములుఁ జేసి యేఁ దనయునిఁ గాంచితి
బాలలీల యశోదభాగ్య మయ్యె

నని తలంపుచు నుంటి నటుఁగాన నిప్పుడే
    నొగిఁ గళావత్యంబ యుదరమందు
నుదయించు సంతోష మొదవంగ నీవును
    ఘనతఁ బుత్రస్వీకృతిని నొసర్చి

గీ. విజయరాఘవుఁ డను పేర వెలయఁజేసి
నన్ను బోషించి యిపుడు నానంద మొందు
మనుచుఁ బల్కంగ మేల్కని హర్షమంది
వెలయ లక్ష్మమ్మ విభునకు విన్నవించె. (11)

వ. అట్లుదయించిన మహామహుండుగావున.

పై నుదాహృతభాగములలో శ్రీకృష్ణుఁడే విజయరాఘవనాయకుఁడని నిరూపించుట కనుకూలముగఁ గథల నల్లి తనసరసమృదుమధురకవితాచార్యము ప్రకాశింప నందముగఁ బైవిషయమును గ్రంథస్థముగఁ జేయఁగల్గినది. విజయరాఘవుఁ డన్నతో తన్ను శ్రీరాజగోపాలస్వామియొక్క పుత్రుఁడుగనే పేర్కొని గ్రంథస్థముగఁ జేసి యున్నాఁడు-చూడుఁడు "విప్రనారాయణచరిత్ర" :—

"తలారి :— స్వామి! యీతూరుపుతేరిదాఁక హలకులిశరేఖలు గలిగిన యడుగుల జాడ కన్పించుచున్నది గాని మానుసులు నడచిన యడుగులు కానరాదయ్యా!

అధికారి :— అటువంటియడుగులు గోపాలునికిని విజయరాఘవభూపాలునికే గాని యితరులకు లేవు గదిరా! చోరునియడుగు లెత్తమంటె నవనీతచోరునియడుగులున్ను యతనికుమారుని యడుగులున్ను కంటి నంటా వచ్చేవు. మాకన్నా నీవే భాగ్యశాలివిరా!

—: రఘునాథనాయకాభ్యుదయము :—

(విజయరాఘవునిస్వప్నమున శ్రీరాజగోపాలస్వామి సాక్షాత్కరించి గ్రంథరచనకుఁ బ్రోత్సహించు సందర్భము.)

"విజయరాఘవ! వత్స! వినుము మామాట
భజియింపుచును మమ్ముఁ బ్రతివత్సరంబు

నిర్భరభక్తితో నీవు హిరణ్య
గర్భదానంబులు గావించు వేళ
నగరోర్ధ్వఫలకమోహనచిత్రరూప
విధముఁ గైకొని యేము వేడ్కతో నిలిచి
యాగర్భమందు నీ వావిర్భవింప
బాగుగా నిన్ను జేపట్టి మాపట్టి
వని యెంచి మాతల్లి యరుణాబ్జవల్లి
చనుబాలు గ్రోలించి చాల లాలించి
తొలుదొత్త నీమేని దురితంబు లెల్లఁ
దొలఁగించి రాజ్యంబు ధ్రువముగా నొసఁగి
సొంపుగ నిను దయఁ జూచు పురాణ
దంపతులము నీకుఁ దల్లిదండ్రులము

* * * *

నీరచనకు మెచ్చి నీకు దీర్ఘాయు
రారోగ్యభాగ్యంబు లపు డొసంగితిమి
ధీచతురత మించ ద్విపదకావ్యంబు
నీచేత నందుకో నేఁడు వచ్చితిమి
మాయవతారమై మహి నుదయించి
మీయయ్యరై ధైర్యమేరువై మించి
యఘటనఘటనాసమర్థుఁడై వెలయు
రఘునాథమేదినీరమణుని చర్య
ధీశాలలము మించ ద్విపదఁ గావించి
మా కంకితము సేసి మనుము వేయేండ్లు"

పై గ్రంథభాగమువలె "రఘునాథాభ్యుదయ" మను యక్షగానమునఁ గూడ వచ్చుచున్నవి. పైరెండు గ్రంథములును విజయరాఘవనాయకవిరచితములే. పైవిధముగా వీరిలేఖిని ప్రసరించినందుల కపరిమితభక్త్యావేశపరవశతయే కారణముగాఁ జెప్ప నొప్పును. పైవిషయము లెట్లున్నను కవిసమాజభోజభూజానియుఁ గవియునైన విజయరాఘవనాయకుఁడును సరసమృదుమధురకవితాచాతుర్యసర్య యగు రంగాజమ్మయు నాంధ్రసారస్వతలోకమునకు నిత్యస్మరణీయు లనుటలో సంశయములేదు.

—: విజయరాఘవుని కృతులు :—

ఇతనిచే రచియింపఁబడిన ప్రహ్లాదచరిత్రమను (M. 692 D. 541) యక్షగానమందలి యుపోద్ఘాతమున నితని గ్రంథములను వివరించు సీసమాలికలోఁ బెక్కు గ్రంథముల నితఁడు నిర్మించినట్లు పేర్కొనఁబడియున్నది.

ఆసీసమాలికానుసారముగాఁ బరిశీలించిన నితఁ డించుమించుగా నేఁబదికృతుల నిర్మించినట్లు తెలియఁగలదు. కాని యందనేకకృతులు లభ్యములగుట లేదు. ఇంతవరకు దొరకినవాటిలోఁ జాల ముఖ్యములగు నమూల్యగ్రంథములు కొన్ని గలవు. వాటిలో నొకటి "శ్రీమద్వేదాంతదేశికులు విరచించిన "పాదుకాసహస్రము"నకుఁ దెనుఁగుసేత. ఇయ్యది ద్విపదఛందోనిబద్ధమైనది. ఇతని గ్రంథములు దొరికినంతవఱకు ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారిచేఁ బ్రచురింపఁబడిన సూచీపత్రములోఁ బేర్కొనఁబడియున్నవి. (The Descriptive, catalogue of the Telugu manuscripts in the T. M. S. S. M. Library, Tanjore.) సమీపమున విజయరాఘవనాయక విరచితమైన (M. 596) "కృష్ణవిలాస" మనెడి యక్షగానము కనుఁగొనఁబడినది పైగ్రంథ మాంధ్రవిశ్వకళాపరిషత్తువారి సూచీపత్రమునఁ బేర్కొనఁబడి యుండలేదు. ఇట్లే యతని యితరకృతులు కూడ దొరకవచ్చునని నానమ్మకము.

—: గ్రంథరచనాకాలము :—

రఘునాథనాయకుని (1614-1638) తర్వాత 1633 న విజయరాఘవనాయకుఁడు తంజాపురాంధ్రరాజ్యసింహాసన మధిష్ఠించెను. అప్పటికి రఘునాథనాయకుని యాస్థానమున నుండిన కులగురువగు శ్రీకుమారతాతాచార్యు లున్నట్లే తెలియుచున్నది. ఆయనను తాతాచార్యులనే వ్యవహరించుచు వచ్చినట్లు గ్రంథసాహాయ్యమునఁ దెలియుచున్నది. రఘునాథనాయకాభ్యుదయాది గ్రంథములలోఁ గులగురువుగాఁ బేర్కొనఁబడిన తాతాచార్యు లీకుమారతాతయాచార్యులే. తరువాత కొంత కాలమునకు గాని శతక్రతు శ్రీనివాస తాతాచార్యు లాస్థానపండితపదవికిని కులగురుపదవికిని రాలేదని స్పష్టమగుచున్నది. పైపదవుల వహించుటమాత్రముకాక శ్రీనివాసతాతాచార్యులు విజయరాఘవునితో నత్యంతము సన్నిహితులుగఁ గూడ మెలఁగుచు నతని కుటుంబవిషయములలోఁ గూడ నత్యంతశ్రద్ధఁ జూపుచువచ్చినట్లును తెలియుచున్నది. శ్రీనివాసతాతాచార్యులును విజయరాఘవనాయకుఁడును పితాపుత్రులవలె మెలఁగుచుండిరట.

—: మన్నారుదాసవిలాసము (ప్రబంధము) :—

క. అని పలుకు చెలులమాటలు
విని నవ్వుచు మనసులోన వేడుకమీరఁగ
దనశ్రీహస్తముచేతను
దనయుని నెమ్మోము నిమిరి తగ నిట్లనియెన్."

—: మన్నారుదాసవిలాసనాటకము (యక్షగానము) :—

వ. అనిన విని దరహాసవదనుండై గురురాయపట్టభద్రుండు వినతనయుండగు తన తనయుని మేను హస్తరింపుచుఁ గుస్తరించిన నాయస్తోకప్రభావుండగు విజయ రాఘవసార్వభౌముండు"

ఇట్లు విజయరాఘవనాయకునితో నింత దగ్గఱి సంబంధ మేర్పడుటకు శ్రీకుమార తాతాచార్యుల తర్వాత కొంతకాలము పట్టియుండును. విజయరాఘవుఁడు సింహాసన మధిష్ఠించిన 1633 కు తర్వాత 10, 15, సంవత్సరములకు గాని యట్టి పరిస్థితు లేర్పడుట కవకాశములేదు. తాతాచార్యులని ప్రసిద్ధిఁ జెందిన శ్రీకుమారతాతయా చార్యులు రఘునాథనాయకాభ్యుదయాదులలోఁ బేర్కొనఁబడియుండుటను బట్టి పై గ్రంథరచనాకాలమునకు శ్రీనివాసతాతాచార్యు లాపదవిలో లేరని స్పష్టమగుచున్నది. కాబట్టి విజయరాఘవనాయకుఁడు పట్టాభిషిక్తుఁడైన 1633 కు తర్వాత శ్రీనివాస తాతాచార్యు లుచ్చస్థితియం దుండియుండును. అట్టి శతక్రతు శ్రీనివాసతాతా చార్యులఁ దనకృతిత్రయములో నెక్కుడుగ రంగాజమ్మ పేర్కొనుటచేత నీమె కృతిత్రయమును 1645 - 1655 కాలములో నిర్మించియుండునని యూహింప వచ్చును.

—: గ్రంథాంతరములు :—

ఉషాపరిణయ మను యితివృత్తమును జాలమంది కవులు తమతమ కృతుల యందుఁ బ్రధానవస్తువుగాఁ గొని యనేకరచనల పాగించియున్నారు. కొందఱు భారతమునుండియుఁ గొందఱు భాగవతమునుండియుఁ గథను సంగ్రహించిరి ప్రసిద్ధమును సరసమధురకథాసందర్భములను గలిగియుండుటచే నీ యితివృత్తము కవుల నందఱి నాకర్షించుట సహజమే. అట్లు లభించు గ్రంథము లన్నిటిలోను నీరంగాజమ్మ కృతియగు నుషాపరిణయమే ప్రాచీన మగుచేమో యని తోఁచెడిని.

పై యితివృత్తమునుగల గ్రంథము లీక్రింద దొరికినంతవఱకు నివ్వఁబడియునవి :-

1. Descriptive catalogue of Telugu Mss; in G. O. M. Library, Madras. Vol. II. Prabandhas No 376 — అనిరుద్ధచరిత్ర-కనుపర్తి అబ్బయామాత్యుఁడు.
2. ,, ,, No 377 ,, ,,
3. ,, ,, No 427 ఉషాపరిణయము - రామెర్ల అంకభూపాలుఁడు.
4. ,, ,, No 428 ,, ,,
5. ,, ,, No 429 ,, ,,

పై యైదు గ్రంథములు నుషానిరుద్ధుల వివాహమును బ్రధానకథావస్తువుగాఁ గొన్న యైదాశ్వాసముల ప్రబంధములు :-

6. ,, Vol. IV — ఉషాకల్యాణము-తాళ్లపాక తిరువేంగళనాథుఁడు. (ద్విపదకావ్యము)
7. ,, Vol. VIII — ఉషాపరిణయము - విరిపారి నృసింహరాజా. (యక్షగానము)
8. ,, R. 477*a* — ఉషాపరిణయము - నడిమింటి రామజోగి
ఉషానిరుద్ధుల పరిణయమును బ్రధానముగాఁ గలిగిన దీగ్రంథము. సీసవికారమనఁదగు పదరూపమున నున్నది.
9. ,, R. 745*a* — ఉషాపరిణయము - చెన్నయ (యక్షగానము)
10. D. 743 / M. 316 — ఉషాపరిణయము (కర్తపేరు తెలియుటలేదు) (యక్షగానము)
11. D. 140 / M. 283 — ఉషాపరిణయము - రంగాజమ్మ (ప్రబంధము)

పైనఁ జేర్కొనఁబడిన గ్రంథములలోఁ గడపటి రెండు (10-11) గ్రంథములు తక్క తక్కిన గ్రంథములు మదరాసు ప్రభుత్వపు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమున నున్నవి. కడపటి రెండును తంజావూరు సరస్వతీమహాల్ గ్రంథాలయమున నున్నవి.

—: పరిష్కరణము :—

ఈ తంజావూరు సరస్వతీమహాల్ గ్రంథాలయమునందలి యాంధ్రవిభాగమునఁ గల (D. 140) M. 283, సంఖ్యఁ గల ఉషాపరిణయగ్రంథముయొక్క యేకైక తాళపత్రప్రతియే యీ పరిష్కరణమునకు మాతృక. లిపి శుద్ధముగను నధికముగఁ బ్రామాదికములు లేకుండుట పరిష్కరణమునకుఁ గొంత సహాయకారిగా నుండినది. అందందుఁ గొద్దిగ గ్రంథపాతములు సాధ్యపడినంతవఱకు కుండలీకరణము (బ్రాకెట్సు) లచేఁ బూరింపఁబడినవి. వీలైనంతవఱకు నష్టమైన గ్రంథభాగములు కూడ నట్లే పూరింపఁబడినవి. అచ్చటచ్చట గ్రంథములోఁ బొసఁగనిచోట్ల మాతృకాపాఠము దిద్దఁబడి యథామాతృకపాఠములు క్రింద (foot note) నివ్వఁబడియున్నవి. మాతృకలో నచ్చటచ్చట లేఖకప్రామాదికములు కూడ లేకపోలేదు. అవికూడ వీలైనంతవఱకు దిద్దఁబడియున్నవి. అయినను నీ రసవత్తరమగు కావ్యఖండమును బరిష్కరించుటలోఁ గొన్ని స్ఖాలిత్యము లేర్పడియుండవచ్చును. వాటిని విజ్ఞులు మన్నింపఁ బ్రార్థన. ఈ యుత్తమగ్రంథమును బ్రచురించ నిశ్చయించి తత్పరిష్కరణ భారము నాయందుంచి యాంధ్రసారస్వతమునకు నీయల్పీయమైన సేవయైనఁ జేయుటకు సదవకాశము నొసఁగిన సరస్వతీమహాల్ గ్రంథాలయకార్యనిర్వాహకసంఘ కార్యదర్శి యగు శ్రీయుత S. గోపాలన్, B. A; B. L; గారికి నా మనఃపూర్వకాభివందనములు. వీలైనంతవఱకు ప్రెస్ కాపీని నిర్దుష్టముగను శుద్ధముగను వ్రాయుటయందు చిరంజీవి N. విశ్వనాథము చూపిన శ్రద్ధ ముఖ్యముగాఁ జేర్కొనదగినది.

సకాలములో శుద్ధముగను నిర్దుష్టముగను ముద్రణము సాగించిన 'రత్నం' ప్రెస్ వారికి ధన్యవాదము లర్పించుచు నింతటితో విరమించుచున్నాను.

శుభమస్తు.

సరస్వతీమహాల్
గ్రంథాలయము, తంజావూరు.
మన్మథ చైత్ర శుక్ల ప్రతిపత్.
25-3-1955

విశలదేవుని సుందరశర్మ

శ్రీః.

విషయసూచిక

ప్రథమాశ్వాసము

విషయము	పుట సంఖ్య
ఇష్టదేవతాస్తుతి - కృత్యవతారిక	... 1
సుకవిస్తుతి - కుకవినింద	... 2
కృతిభర్త - విజయరాఘవనాయకుఁడు	... ,,
కృతిభర్తృవంశము	... 5
కృతిభర్తృ జన్మప్రకారము	... 6
షష్ఠ్యంతాలు	... 7
కథా ప్రారంభము	... 8
శంకరవరబలముచే బాణాసురుండు గర్వించియుండుట	... 9
బాణుఁడు శంకరునివద్ద సమరమును కోరుట	... ,,
ఉత్పాతములఁగని బాణుఁడు జంకకుండుట	... 10
బాణాసురుని పుత్రి యుష	... ,,
ఉష శృంగారవనమునఁ బార్వతిఁ గని వరమును బడయుట	... 11
పార్వతీవరానుసారముగ నుష కలఁ గనుట	... 13
కలఁగని మేల్కొన్న యుష కలఁగఁగాఁ జిత్రరేఖ సమాశ్వాసపఱచుట	... 15
ఉష స్వప్నవృత్తాంతమును చిత్రరేఖకు దెల్పి వగచుట	... 16
చెలులు బాణపుత్రికి ధైర్యము చెప్పుట	... 17
చిత్రరేఖ పార్వతీవరమును జ్ఞప్తికిఁ దెచ్చుట	... 18
ఉష తాను కలను జూచిన కాంతుని దెమ్మని చిత్రరేఖతో ననుట	... 19
చిత్రరేఖ చిత్రపటములు వ్రాసి తెచ్చుటకై యరుగుట	... 20

ఉష విరహతాపము ... 21

విరహభరముచే తపించుచున్న యుషాకన్యఁ జూచి చెలులు తాపకారణము నడుగుట ... 24

చెలులకుఁ దనతాపకారణముఁ దెలిపి వారితోఁగలసి యుష శృంగారవనమునకు మన్మథు నారాధించుటకై చనుట ... 25

ద్వితీయాశ్వాసము

ఉషాకన్య చెలులతోఁగూడి యుద్యానవనమున విహరించుట - వనకేళి జలకేళి ... 27

మన్మథారాధనము ... 34

సూర్యాస్తమయ చంద్రోదయ వర్ణనములు ... 37

మన్మథుఁడు ఉషపై దాడి వెడలుట, మాన్మథ వికారవర్ణన ... 38

ఉషాకన్యకు చెలులు శైత్యోపచారములఁ జేయుట ... 40

ఉషాకన్యయొక్క మాన్మథప్రలాపములు ... 42

ఉష మదనుని మదనబలముల నిందించుట ... 45

సూర్యోదయవర్ణనము ... 47

ఉష చిత్రరేఖరాకకై యెదురుచూచుట, చిత్రరేఖ పటముల వ్రాసి తెచ్చుట ... ,,

చిత్రరేఖ చిత్రపటములందలి నాయకుల వర్ణించుట ... 49

ఉష కలలోఁగలసిన కాంతుని గనుఁగొనుట ... 53

ఉష యనిరుద్ధుని దోడితెమ్మని చిత్రరేఖను వేఁడుట ... 54

చిత్రరేఖ యనిరుద్ధుని దెచ్చుటకై ద్వారకాపురి కేగుట ... 56

చిత్రరేఖ నారదమునీంద్రుని గాంచి యతనికి సకల వృత్తాంతముల నెఱింగించి తదనుమతిని బడయుట ... 57

చిత్రరేఖ యనిరుద్ధుని దోడ్కొని చనుట ... 60

అనిరుద్ధుని దోడ్కొని వచ్చుటకై చనిన చిత్రరేఖ రాకయున్నందులకు నుష చింతించుట ... 62

చిత్రరేఖ యనిరుద్ధుని నుషవద్దికి జేర్చుట ... 64

తృతీయాశ్వాసము

చిత్రరేఖ యనిరుద్ధుని వర్ణించుట ... 68

అనిరుద్ధుఁడు కలఁగని మేల్కని యాశ్చర్యపడుట ... 69

ఉషానిరుద్ధులు పరస్పరసౌందర్యము గని పరవశులగుట ... 71

మన్మథుఁ డుషానిరుద్ధుల మోహపరవశులఁ జేయుట ... 75

అనిరుద్ధుఁడు చిత్రరేఖను వివరముగ నడుగుట, చిత్రరేఖ యనిరుద్ధునికి సకలము చెప్పుట ... 76

అనిరుద్ధుఁ డుషను గాంధర్వమున వివాహమాడుట, సంభోగశృంగారము ... 78

విప్రలంభశృంగారము ... 81

ప్రభాతమున నుషానిరుద్ధులఁ జూచి చెలులు సంతసించుట ... 85

అంతఃపురపు కావలివారు ఉషానిరుద్ధులుండు విధమును గని యచ్చెరువంది బాణుని కెఱుకపఱచుట ... 87

కోపావిష్టుండగు బాణాసురుని యాజ్ఞచే దైత్యు లనిరుద్ధుని బంధింపనేగుట ... 90

దైత్యబలములఁ జూచి యుష కలఁగఁగా ననిరుద్ధుఁడు ధైర్యము చెప్పుట ... ,,

అనిరుద్ధుని పరాక్రమమునకుఁ దాళలేక దైత్యులు బాణాసురునికడకుఁ జేరుట ... 92

బాణుఁ డంతర్హితుఁడై పన్నగాస్త్రములచే ననిరుద్ధుని బంధించుట ... 93

బాణాసురుఁ డనిరుద్ధుని జంప నాజ్ఞాపింపఁగాఁ గుంభాండుండు వారించుట ... 99

అనిరుద్ధుఁడు దుఃఖితయగు నుషాకన్యను సమాశ్వాసపఱచి దుర్గాస్తవమున గతబంధనుండగుట ... 100

ద్వారకాపురమున స్త్రీ లనిరుద్ధుని మేల్కొల్పఁ జనుట, అంతఃపుర స్త్రీ లనిరుద్ధుని గాన కెల్లెడల వెదకి తుదకు శ్రీకృష్ణున కెఱుకపఱచుట ... 101

శ్రీకృష్ణుఁ డాస్థానమును జేరి సకలపరివారములను రప్పించి యనిరుద్ధుఁడు కానరాకుండుటను దెల్పుట ... 107

నారదుఁడు శ్రీకృష్ణునికి ననిరుద్ధుని వృత్తాంతమును బాణాసురుని బలమును దెలుపుట ... 110

చతుర్థాశ్వాసము

శ్రీకృష్ణుఁడు సపరివారముగా బాణునితో యుద్ధమునకుఁ జనుట ... 114

ఖగవాహనారూఢుండై గగనమార్గమున నేగు శ్రీకృష్ణుని చారణులు స్తుతించుట... 117

శ్రీకృష్ణుఁడు బలదేవాదులతో శోణపురిసమీపమునకుఁ జేరుట ... 118

శ్రీకృష్ణుఁడు శంభుబలములగు పావకులతోఁ బోరుట ... 120

అంగిరుని గూల్చి శ్రీకృష్ణుఁడు బాణపురమునుఁ బ్రవేశించుట ... 122

శంభుబలములు శ్రీకృష్ణాదుల నెదుర్కొనుట ... 123

యుద్ధముఁజేయ బలభద్రాదుల వేర్వేరుచోట్ల శ్రీకృష్ణుఁడు నియోగించుట ... 125

ఘోరయుద్ధమున శంభుసైన్యము పరాజయము నొందుట ... ,,

మహేశ్వరశక్తిపీడితుఁడగు బలదేవుఁడు శ్రీకృష్ణునివలన తద్విముక్తిఁ జెందుట ... 127

శ్రీకృష్ణుఁడు మహేశ్వరశక్తితో యుద్ధముచేసి జయించలేక ప్రతిశక్తిని నిర్మించుట, రౌద్రవైష్ణవశక్తుల యుద్ధము ... 128

శ్రీ రాజగోపాలాయనమః

ఉషాపరిణయము

(పద్యకావ్యము)

ప్రథమాశ్వాసము

—: ఇష్టదేవతాస్తుతి :—

కృత్యవతారిక.

ఉ. శ్రీ విజయరాయురున్నతులచే నలరించెడుఁ గొల్చువారలన్
దీవిభవంబుమీర నని తెల్పుచు హేమవసిన్ జెలంగు రా
జీవదళాయతాక్షుఁడగు చెంగమలేశుఁడు మన్నారు గో
త్రావిబుధేంద్రునిన్ విజయరాఘవచంద్రుని బ్రోచుగావుతన్. 1

శా. సారోదారకటాక్షవీక్షణసుధాసారంబు తోరంబుగా
భూరి క్షేమ మొసంగఁగా నెపుడు నంభోజాతగర్భాదులన్
శ్రీరంజిల్లఁగఁ జేయుచున్ జెలఁగు మాచెంగమ్మ యిద్ధాత్రిపై
సారెన్ మన్నరుదాసభూవిభుని వాత్సల్యంబునన్ బ్రోవుతన్. 2

సీ. సంతసంబమర ననంతునిఁ గొనియాడి
గరుడునిఁ బూజించి ఘనతమీర
సేనాధినాయకు సేవించి భక్తిని
బన్నిద్దరాళ్వార్లఁ బ్రస్తుతించి

వేదాంతదేశికు వేడ్కతో భజియించి
వ్యాసవాల్మీకుల వరుసఁ బొగడి
చెలఁగి శతక్రతు శ్రీనివాసాభిఖ్య
తాతయాచార్యులఁ దలఁచి మదిని

గీ. వేదసంఘంబు మూర్తిభవించినట్టు
లఖిలయాగంబు లొనరించి యవనియందుఁ
జెలువుమీఱు శతక్రతు శ్రీనివాస
తాతగురువర్యునకును వందన మొనర్తు. ౩

—: సుకవిస్తుతి — కుకవినింద :—

క. సకలసభామధ్యంబులఁ
బ్రకటంబుగ విబుధు లెల్ల భళి యనఁదగు నా
సుకవుల సన్నుతిసేయుచుఁ
గుకవుల నిరసింతు మిగులఁ గుశలతమీఱఁగ. 4

వ. అని యిష్టదేవతానమస్కారంబును సుకవిపురస్కారంబునుఁ గుకవి తిరస్కారంబునుఁ గావించి యేనొక్క ప్రబంధంబు రచియించెద నని తలంచుసమయంబున.

—: కృతిభర్త — విజయరాఘవనాయకుఁడు :—

సీ. శ్రీరాజగోపాలసేవామహిమచేత
నేరాజు ధర నెల్ల నేలుచుండుఁ
బరమతంబుల నెల్ల నిరసించి యేమేటి
వైష్ణవమతమె శాశ్వతముఁ జేసె

బాల్యంబునందునే పగతుర నిర్జించి
　　యేనేల కీర్తుల నెనఁగఁ గాంచెఁ
బదియాఱు దానముల్ ప్రణుతింప నేదాత
　　యవనీసురల కిచ్చె నాదరించి

గీ. యాతఁ డచ్చుతభూపవంశాబ్ధిచంద్రుఁ
డధికగాంభీర్యధైర్యశౌర్యాతిసాంద్రుఁ
డవనిఁ దంజాపురాధీశుఁ డనఁగఁ బరఁగు
విజయరాఘవమేదినీవిభువరుండు. 5

వ. మఱియును సత్యభాషాహరిశ్చంద్రుండును సత్కృపారామచంద్రుండును సంగరంగకిరీటియును సకలవిద్యాచాతుర్యపేటియును దానరాధేయుండును ధరణీజనవినుతభాగధేయుండును రామానుజమతసిద్ధాంతస్థాపనాచార్యుండును రాజగోపాలనిత్యకైంకర్యధురంధుర్యుండునుఁ జతుర్వేది శతక్రతు శ్రీనివాసాచార్యచరణసరసిజసేవానిష్ఠాగరిష్ఠుండును చతురుదధివేష్టితసర్వంసహాపాలకశ్రేష్ఠుండును సామంతరాజమణికిరీటరంజితపాదాంభోజుండును సరససాహిత్యకళాభోజుండును రఘునాథనృపాలనందనుండును రచితకళావత్యంబికానయనానందుండును నగు నవ్విజయరాఘవదేవేంద్రుండు రామణీయకవిరచితరాజరాజసభావిజయంబగు రాజగోపాలవిజయంబునందు నతులితవిలాసవతులైన కులసతులును విబుధసన్నుతమతియగు విజయవెంకటపతియును, మహితప్రభావుండగు మన్నారుదేవుండును తతయశోధనుండగు తాతఘనుండును రంగద్గుణవిలాసుండగు చెంగమలదాసుండును మొదలగు నిఖిలజనమిత్రులైన పుత్రులను నిరుపమచరిత్రపవిత్రులైన పౌత్రులును నిరవద్యరూపరేఖాకనకపుత్రికలైన పుత్రికలును నింపు వొలయఁ దామరతంపరలై విందియుండఁ జెంగట శృంగారవతులు

రంగురక్తులుమీర సంగీతమేళంబుగావింప నగ్రభాగంబున నాచా ర్యాగ్రేసరుండగు శతక్రతు శ్రీనివాసాచార్యుండు కృతదురిత భంగంబగు హరివంశకథాప్రసంగంబుఁ గావింప నింపుమీఱ నేనును శృంగారరసంబులఁ జెన్నుమీఱు మన్నారుదాసవిలా సంబు వినుపించుచున్న సమయంబున.

సీ. వెంకటేంద్రునిపుత్రి! వినుతసద్గుణధాత్రి!
ఘనయశోరాజి! రంగాజి! వినుము
మాధుర్యమున మించు "మన్నారుదాసవి
లాస ప్రబంధంబు" లలితఫణితిఁ
గావించి మిగులశృంగారంబు గన్పట్టఁ
బదములు మృదురసాస్పదము లగుచు
రాణింప రచియించి "రామాయణంబు"ను
"భాగవతంబు"ను "భారతంబు"

గీ. సంగ్రహంబున రచియించి సరసరీతి
మమ్ము మెప్పించితివి చాల నెమ్మదనరఁ
బరఁగ హరివంశమున "నుషాపరిణయకథఁ"
దెనుఁగుఁ గావింపు మిఁక నీవు తేటఁగాఁగ. 6

వ. అని సబహుమానంబుగాఁ దాంబూలజాంబూనదాంబరమాల్యా భరణంబు లొసంగిన నేనును బరమానందంబుఁ జెందుచుఁ బతి యును గతియునుఁ గులదైవంబునునైన నీదుపాదారవిందంబులు డెందంబున సేవింపుచున్న తనకు మీరానతిచ్చు కథాసంవిధా నంబు సర్వంబును నవగతంబగు గావున నట్లన రచియించెద, పంజర శుకంబు మంజువాక్ఫణితిరంజిల్లం బలికినఁ దత్పోషకుండు సంతో షించు తెఱంగున మదీయవచనకుసుమార్చనంబంగీకరించి నన్ను

కటాక్షింపుఁడని విన్నవించిన లాలించి యాచార్య చరణారవిందంబులకు వందనంబుఁ గావించి యమ్మహామహునియనుజ్ఞం గైకొమ్మనుటయు నట్లన సేవించిన దీవించి గురురాజపట్టభద్రుం డిట్లనియె.

—: కృతభర్తృ వంశము :—

క. సీపతి మన్నరుదాసుఁడు
గోపాలుఁడు కనుక నితఁడు కోర్కెలు హెచ్చన్
జేపట్టి మనుప నెలకొను
నాపలుకుల నెలఁత! నీ ముఖాంబుజసీమన్. 7

వ. అని మఱియును.

సీ. తనరెడు మన్నరుదాసవిలాసంబు
నమర సేవొనరించు నప్పుడేను
విజయరాఘవమహీవిభుని వంశావళి
వినుపించితిమి కదా! విశదముగను
కీర్తులుమీరిన కృష్ణభూపాలుండు
నయశాలి యగు తిమ్మనాయకుండు
దివ్యతేజముగల తిమ్మప్పనాయుండు
శ్రీనిధియైనట్టి చెవ్వనృపతి

గీ. చెలఁగి శ్రీరంగమున రామసేతువునను
బొగడ బహువిధకైంకర్యముల నొనర్చి
యచ్యుతాళ్వారు లితఁడన నవని వెలయు
నచ్యుత విభుఁడు నలరిరి యతిశయమున. 8

క. అల యచ్యుతభూవిభునకు
నలఘుయశఃస్ఫూర్తి మూర్తిమాంబకు సుతుఁడై
వెలసెన్ రఘునాథమహీ
తలపతి రఘునాథుఁ డితఁడె తప్పదనంగన్. 9

—: కృతభర్తృ జన్మప్రకారము :—

సీ. తనర నారఘునాథధరణీశ్వరుఁడు చెంజి
లక్ష్మమ్మ యల్ల కళావతెమ్మ
పట్టంపురాణులై ప్రబలి సేవయొనర్పఁ
గులమెల్ల వెలయించు కొడుకు వలసి
దానధర్మంబులుఁ దపములు సలుపుచుఁ
గస్తూరికృష్ణుని ఘనత వేఁడ
నల చెంజిలక్ష్మమ్మకలలోనఁ గస్తూరి
కృష్ణుఁ డిట్లనెఁ బూర్వవృత్త మొకటి

గీ. నీవు తొల్తను దేవకీదేవి వరయ
సాటిలేని కళావతీసతి యశోద
యల్ల వసుదేవనందులయాత్మ లిచట
నెగడె నచ్యుతరఘునాథనృపతి యనఁగ. 10

సీ. అల వసుదేవున కాత్మసంభవుఁడనై
మందలోఁ బెరుఁగంగ నందునింటఁ
దపములుఁ జేసి యేఁ దనయునిఁ గాంచితి
బాలలీల యశోద భాగ్యమయ్యె
నని తలంపుచు నుంటి వటుఁగాన నిప్పుడే
నొగిఁ గళావత్యంబయుదరమందు
నుదయింతు సంతోష మొదవంగ నీవును
ఘనతఁ బుత్రస్వీకృతిని నొనర్చి

గీ. విజయరాఘవుఁ డనుపేర వెలయఁజేసి
నన్ను బోషించి యిపుడు నానంద మొందు
మనుచుఁ బల్కంగ మేల్కని హర్షమంది
వెలయ లక్ష్మమ్మ విభునకు విన్నవించె. 11

వ. అట్లుదయించిన మహామహుండుగావున.

ఉ. నిస్తులసద్గుణావళులనిర్మితవాసన నిండ దిక్కులన్
స్వస్తి యొనర్చుచున్ సుజనసంతతి కెల్లను మాటిమాటికిన్
గస్తురికృష్ణుఁ డీతఁడన గౌరవమందుచు ధాత్రిలోపలన్
బ్రస్తుతి కెక్కు నీవిజయరాఘవచంద్రున కిమ్ము నీకృతిన్. 12

వ. అని యానతిచ్చి యాచార్యశేఖరుండు ప్రబంధారంభంబున కనుజ్ఞనిచ్చెఁ గావున.

—: షష్ఠ్యంతాలు :—

క. అమితకళాభోజునకును
గమలాప్తసమానబాహుఘనతేజునకున్
సమరాగ్రబిడౌజునకును
రమణీజనకామనోహరమనోజునకున్. 13

క. చెంగమలావరకరుణా
పాంగవిలోకనసమాగతైశ్వర్యునకున్
సంగరరంగోద్ధతరిపు
భంగప్రదమాననీయబలధుర్యునకున్. 14

క. దారుణశాత్రవవసుధనో
దారునకుఁ గుమారతాతయాచార్యపదా
ధారునకు విశ్రుతయశో
ధారునకున్ సరససత్కథాధారునకున్. 15

క. కనకతులాపూరుషముఖ
వినుతమహాదానకలితవిద్వత్తతికిన్
ఘనశబ్దార్థనిగుంభన
జనితబుధానందసకలసన్నుతకృతికిన్. 16

క. కనకక్షితిధరధృతికిని
జనకపదాంభోజభజనసంభృతమతికిఁ
ఘనవితరణరతికి బుధా
వనకృతికిఁ విజయరాఘవక్ష్మాపతికిఁ. 17

వ. అంకితంబుగా నే నొనర్పంబూనిన యుషాపరిణయంబను మహా
ప్రబంధరాజంబునకుం గథాసంవిధానం బెట్టిదనిన,

—: కథా ప్రారంభము :—

క. జనమేజయుజనపాలుఁడు
విని పీనులవిందుగాఁగ వెన్నునికథలఁ
దనివొందక వైశంపా
యనునకు నిట్లనియె మఱియు నాదర మొప్పఁ. 18

సీ. కృష్ణునిమనమఁడై కీర్తులవెలసిన
యనిరుద్ధుఁ డెట్టు ? లయ్యసురపుత్రి
యగు నుషాకన్యక నంతఃపురంబున
వరియించెఁ బ్రబలుఁడై వచ్చినట్టి
బాణుండు శౌరితో బవరంబు గావించి
ప్రాణంబుతో నెట్లు పారిపోయె ?
మును మాకు సంక్షేపమున నెఱింగించితి
విస్తరంబుగఁ దెల్పు వేడ్కఁబొడమ

గీ. ననుచు వేఁడిన భరతవంశాగ్రణికిని
సావధానంబుగా విను జనవరేణ్య !
వినికిచేసెద సర్వంబు వీనులలర
ననుచు నవ్వ్యాసశిష్యుఁ డిట్లనియె నపుడు. 19

—: శంకరవరబలముచే బాణాసురుండు గర్వించియుండుట :—

వ. ఓ వైష్ణవాగ్రేసర! బలితనూభవుఁడగు బాణాసురుండొక్కనాఁడు సకలవిలాసంబులుమీర షణ్ముఖుండే తేర నతని వైభవంబుఁ జూచి మెచ్చి యచ్చెరుపడి తానును భద్రంబుగా రుద్రు నారాధించి యతనికుమారుండ నయ్యెద నని మదినెంచి తీవ్రంబగు తపంబు సేయ, నంతఁ గొంతకాలంబునకు పార్వతీసమేతుండై ముక్కంటి యక్కడికి వచ్చిన నయ్యసురవరుండు బహువిధంబుల స్తుతియింప నా భర్గుండు ప్రసన్నుండై, ఓయి బలినందన! హెచ్చైన నీ తపంబునకు మెచ్చితిమి నీవు కోరినట్లు నిక్కుమారునకు సోదరుండవై సకలవైభవంబుల సాటిలేనిమేటివై శోణితపురంబునకు నాయకుండవు గమ్మను నీ వాకిలిఁ గాచియుండెద నని వరంబు లొసంగిన.

—: బాణుఁడు శంకరునివద్ద సమరమును కోరుట :—

క. వరగర్వంబున బాణుఁడు
గరిమన్ దిక్పతుల గెలిచి కదనములోనన్
సరిలేరు తనకు నిపు డని
పురహరునిం జేరఁబోయి పొంగుచుఁ బలికెన్. 20

ఉ. శంకర! దేవదానవుల సంగరమందు ననేకభంగులన్
బింక మడంచితిన్ గనక భీతిలి చెంతలఁజేర రిప్పు మా
కింకిట వేయిచేతులకు నేమి? ప్రయోజన మెంచి చూడఁగాఁ
బొంకముమీర నొక్క యని భోగివిభూషణ! కల్గఁజేయవే. 21

క. అని పల్క నవ్వి రుద్రుఁడు
విను బలిసుత! నీదుడాలు విఱిగిన యపుడే
ఘనమగు కయ్యము కలుగును
మనమున నాలోచించ కిపుడు మగుడుము వేడ్కన్. 22

వ. అని యిట్లు రుద్రుండు పలికిన బాణాసురుండు సంతసంబున మగుడి వచ్చి యంతిపురంబునఁ గొలువుండుసమయంబునఁ గుంభాండుం డను మంత్రివరుండు బలినందనుం గనుంగొని యో స్వామి! మీకు నింతసంతోషంబు గలుగుటకుఁ గారణం బేమి! యని యడిగిన నమ్మంత్రివరునకు నా దైత్యవరుం డిట్లనియె.

—: ఉత్పాతములఁ గని బాణుఁడు జంకకుండుట :—

సీ. వినవోయి కుంభాండ! వివరంబుగాఁగ నే
ఫాలలోచనుఁ జేరి భక్తి మీర
జగడంబు వేఁడంగ సమ్మతి నతఁడును
జాలు ధరిత్రిని వ్రాలునపుడె
కయ్యంబు గల దని నెయ్యంబుతోఁ బల్కె
ననిన బాణునిమాట కతఁడు వెఱచి
శంకరుకడ కేఁగి సమరంబు వేఁడంగ
బలితనూభవ! నీకుఁ బాడి యగునె!

గీ. యనిన వేళనే యతనిదా లవనిఁ బడిన
మించు నుత్పాతములు కనుపించ మఱియు
నడ్డసేయక వాఁడును సంతసమున
నింతులును దాను సుఖగోష్ఠి నెసఁగుచుండె. 28

—: బాణాసురుని పుత్రి యుష :—

వ. అంత.

సీ. పార్వతీవరమున బాణాసురేంద్రున
కల యుషాకన్యక యవతరించి
దాదులు పోషింపఁ దనరెడు వేడ్కఁ జే
శశిరేఖకైవడిఁ జాలఁ బ్రబలి

పరఁగ గుజ్జెనగూళ్లు వండి నెచ్చెలులతోఁ
బేర్వేర బొమ్మలపెండ్లి సేయు
వెన్నెలబైటను గన్నియలుం దాను
మొనయుచు డాఁగిలి మూఁతలాడు

గీ. నింతులను గూడి బంగరుబంతులాడు
బాలికలతోడ నారామకేళి సల్పుఁ
జదువు మృదుకోకిలాలాపసరణిమీఱ
వీణె వాయించుఁ జెవులకు విందుగాఁగ. 24

వ. అంత.

సీ. మోముదామరమీఁద ముద్దుగుల్కుచు వ్రాలు
గండుమీ లనఁగను గన్ను లమరె
సౌందర్యనదిలోనఁ జక్కఁగా విహరించు
చక్రవాకము లనఁ జన్ను లమరెఁ
దళుకొత్తు బాహులతాయుగ్మమున నొప్పు
చిగురుటాకు లనంగఁ జేతు లమరె
నాభివల్మీకంబునను వెలువడి వచ్చు
చిలువనా నూఁగారు చెలువ మమరె

గీ. హెుటుసి తొలఁగని తొలకరి మెఱపనంగ
మిగుల సొబగైన కాంతిచే మేనుఁదీవ
కలితలావణ్యచారుశృంగారగరిమఁ
గలిగి చెలువొందు నల యుషాకన్య కపుడు. 25

—: ఉష శృంగారవనమునఁ బార్వతిఁ గని వరమును బడయుట :—

వ. ఇవ్విధంబున నివ్వటిలుజవ్వనంబున వర్తిల్లుచు నా జవ్వని యొక్కనాఁడు.

సీ. పల్లవంబులమించు పదముల రతనంపు
టందియల్ ఘల్లు ఘల్లనుచు మ్రోయ
ఘననితంబములందుఁ దనరారు బంగారు
మొలనూలిఘంటలు మురువుఁ జూప
శృంగారములమీఱు కెంగేలుదమ్ముల
నీలంపుగాజులు చాల మొరయఁ
దపనీయమయరత్నతాటంకములు మంచి
నిద్దంపుచెక్కిళ్ల నిగ్గులీన

గీ. సదులఁ బెనఁగొని పాలిండ్లు సారెఁ గులుకఁ
గాను లసియాడ మదహంసగతులు మెఱయ
వనితలును దాను శృంగారవనముఁ జేరె
భాన మిగురింప నల యుషాభాను యపుడు. 26

క. ముక్కంటి గౌరి యవ్వని
మిక్కిలిఁ బ్రేమంబుమీర మెఱయంగా నా
మక్కువఁ గని యుష తనమది
నక్కట ! యిట్లుండవలదె ! యనుచుఁ దలంపన్. 27

చ. అల యుషఁ జూచి గౌరి వదనాంబురుహంబున మందహాసముల్
జెలఁగఁగ మమ్ముఁ జూచి యిటు చింతిలనేఁటికి? నిట్టిభాగ్యముల్
గలుగును నీకు నింక ననఁ గల్గునో ! యెన్నటికంచు సిగ్గునం
బలుకఁగ మోము వంచు నల భామినిఁ గన్గొని పల్కె నీగతిన్.

సీ. జలజాక్షి ! వినుము వైశాఖమాసమునందు
భాసురంబగు శుక్లపక్షమునను
రహిమించు ద్వాదశీరాత్రి నీకలలోన
నెవ్వఁడు పొందు నిన్నాలమి నతఁడె

పతియగు నీకని భావంబురంజిల్లఁ
        బార్వతి పలికిన పలుకులకును
హర్షించి యెంతయు నాత్మలో నుప్పొంగి
        గౌరికి మ్రొక్కుచుఁ గౌరవమున

గీ. బంతిఁ గూర్చుండి యంతట బాగుమీర
రమణులును దాను వనభోజనము నొనర్చి
పరఁగ బాణాసురునిముద్దుపట్టి యపుడు
నిజనివాసంబుఁ జేరెను నెమ్మితోడ. 29

వ. అంత.

క. సురగరుడయక్షరాక్షస
వరకన్యలు చేరి కొలువ వైభవమమరన్
దొరతనముమీరి యెంతయు
సరసిజముఖ యుండెఁ జాలసంతస మెసఁగన్. 30

—: పార్వతి వరానుసారముగ నుష కలఁ గనుట :—

క. కులగిరికన్యక పల్కిన
చెలువున వైశాఖమాససితపక్షమునం
దలరెడు ద్వాదశిరాత్రిని
జలజేక్షణ నిదురబోవుసమయమునందున్. 31

సీ. చంద్రికనిరసించుసరణిచే రాణించు
        చిరునవ్వు మోమునఁ జెలఁగువాఁడు
తామరరేకులఁ దానెంత లేదను
        నెఱ్ఱదకన్నులుఁగల్గి వెలయువాఁడు

తులకించుపొందుపండులఛాయఁ దెగడెడు
మురువుచేమించు కెమ్మోవివాఁడు
పాంచజన్యముతోడఁ బ్రతివచ్చు ననవచ్చు
కలితరేఖలఁబొల్చు గళమువాఁడు

గీ. ఉరము బంగరుతల్పన నొప్పువాఁడు
భోగిభోగాభభుజములఁ బొలుచువాఁడు
లలితగజరాజగమనంబుఁ గలుగువాఁడు
కనకములమించునిరసించు కాంతివాఁడు. 32

సీ. సంపంగిపువ్వులు సరసత సిగఁ జుట్టి
బురుసారుమాల్గట్టి పొంకమమర
నర్ధచంద్రునిసొంపు నదలించు నుదుటను
దీరుగాఁ దిలకంబు దిద్ది వేడ్క
శ్రీకారములమించు చెలువంబుఁ గల్గిన
వీనులఁ జౌకట్లు వెలయ నుంచి
బటువుముత్తియముల బాగుగాఁ గూర్చిన
కంటసరుల్ దాల్చి ఘనతమీరఁ

గీ. దనర నురమున వజ్రాలతాళి వైచి
హస్తములఁ గెంపులకడియా లలరఁ బూని
వసుధ జీరాడు చుంగులవన్నెఁ గాంచు
మేటి కనకాంబరమువలె వాటుదనర. 33

క. బంగరుమంచముమీఁదను
సంగతిఁ గూర్చుండి మిగులసరసత్వముచే
నంగనఁ దగ రారమ్మని
శృంగారరసంబుమీఱ చెలువంబమరన్. 34

సీ. గంధంబు మైఁ బూసి కౌఁగిటం జేర్చుచుఁ
గస్తూరి దిద్దుచు గారవించి
సంతసంబునఁ జేరి చక్కెరమోవివాని
బటువుగుబ్బలు జీరి బాగుమీర
కళరవంబులుఁ జేసి కళలంటి సొక్కించి
చెక్కిలి నొక్కుచుఁ జెలువమమరఁ
దొడలపై నుంచుక తొయ్యలి రమ్మని
పుక్కిటి విడెమిచ్చి బుజ్జగించి

గీ. చాలఁ జనవిచ్చి మిక్కిలి సరసముగను
గొప్ప దువ్వుచు విరిసరుల్ గూర్చి వేడ్కఁ
దేటమాటల లాలించి తేనె లొలుక
రతులఁ దేలించెఁ గలలోన రమణుఁ డొకఁడు. 35

—: కలఁగని మేల్కొన్న యుష కలఁగఁగాఁ జిత్రరేఖ
సమాశ్వాస పరచుట :—

చ. కలఁ గని మేలుకాంచి తనకంఠము సంటిన గోటిజీరలుఁ
బలుచనిమోవిపై మిగుల బాగుగ నుంచినయట్టి కెంపులుం
గులుకు మెఱుంగు గబ్బివలిగుబ్బల నించిన గంధసారముల్
బలుమరుఁ జూచి సోద్యపడి భావములోనఁ గలంకఁ జెందఁగన్.

వ. అచ్చటికి నెచ్చెలియగు చిత్రరేఖవచ్చి మాన్య యగునుషాకన్యం జూచి యిట్లనియె.

సీ. అక్కరో! నీవేల? యాత్మలోఁ గలఁగెదు
వేగంబ తెల్పవే వివరముగను
సకలదిక్పతులను సమరంబులో గెల్చి
సరిలేకయుండ నీజనకుఁ డెప్పుడు

నైరావతము నెక్కి నాయింద్రుఁ డెప్పుడు
చెప్పినయుడిగంబు సేయుచుండ
ఫాలలోచనుఁడును బ్రమథులతోఁగూడి
గొల్లమై వాకిటం గొల్చియుండ

గీ. నొనర నంతఃపురంబున నున్న నీకు
నింత భయమేమిటికి ? వచ్చె నిందువదన!
భావ మిది యని పల్కవే పద్మగంధి!
చెలియ నాకన్న నాప్తులే చెలులు నీకు ? 37

—: ఉష స్వప్నవృత్తాంతమును చిత్రరేఖకు తెల్పి వగచుట :—

వ. అని పల్కిన చిత్రరేఖనుం జూచి యుష యిట్లనియె.

సీ. మొలక నవ్వులవాఁడు కలువలచెలికాని
మురువుఁగైకొను ముద్దుమోమువాఁడు
వెడఁదకన్నులవాఁడు వేదండతుండాభఁ
గొమరొందు బాహుకాండములవాఁడు
చిన్నిప్రాయమువాఁడు చిగురుకైదువజోదు
రీతినొప్పెడు రూపరేఖవాఁడు
నిద్దంపుజిగివాఁడు నీలమేఘములీల
రహియించు చికురభారంబువాఁడు

గీ. కలితశృంగారలక్షణగరిమవాఁడు
చెలువుఁ డొక్కండు ననుఁ జేరి చెలువుమీఱి
కౌఁగిటను జేర్చి మోవాని కంతుకేళిఁ
గలయ నంతట మేల్కంటిఁ గలువకంటి! 38

క. కలలోఁ జేసిన చిహ్నలు
తలపఁగఁ బ్రత్యక్ష మాని తా మేల్కనినన్
నెలకొనియున్నది యిపుడును
బలుకుదు నేమనుచు నీకుఁ బద్మదళాక్షి ! 39

సీ. తండ్రిదగ్గఱఁ బోయి తలిరాకుఁబోఁడిరో !
యేగతి ? నిల్తునే యెవ్వమీరఁ
గన్నె ! యిదేమని కన్నతల్లడిగిన
నుత్తరం బేమిత్తు ? నువిద ! యిపుడు
నన్నదమ్ములు చూచి యాత్మ సంశయమంద
నేమని ? తెల్పుదు నిందువదన !
బంధువర్గము లెల్ల భావించి పరికింప
మఱిఁ గెటువలె నేతు ? మచ్చకంటి !

గీ. కులసతులముపాల నెటువలె నిలుతునమ్మ !
యట్టి బలివంశమునఁ బుట్టినట్టి తనకు
వనిత ! రావచ్చునా యపవాద మిట్లు
జగతి సరివారిలో నెట్లు సంచరింతు ? 40

—: చెలులు బాణపుత్రికి ధైర్యము చెప్పుట :—

క. ఇటు వగచిన యువఁ గనుఁగొని
కటకటనుచుఁ జెలులు చాలఁ గళవళపడుచున్
గుటిలాలక మదికప్పుడు
దిటవు గలుగఁ బలికి రిట్లు తేటపడంగన్. 41

మ. వినవమ్మా ! దనుజేంద్రపుత్రి ! వలదే వేమారుఁ జింతింపఁగా
నెనయ స్త్రీచరితంబు లేమెఱుఁగమా యేకార్యముల్ జేసినన్
దవరన్ మంచివె కాని కాని వగునే ధర్మంబు నీసొమ్మగున్
వనజాక్షీ ! కలలోని సంగమమునన్ బాపంబు రానేర్చునే. 42

వ. అని మఱియు నిట్లనిరి.

సీ. కడు మనోవాక్కాయకర్మంబులందుఁ దా
నెవ్వండు కలుషంబులే యొనర్చు
నది పాపమగుఁ గాని యతివరో! నీకును
గల పురుషునిఁ గూడఁ గలుష మగునె
సత్కులంబందును సరసత జన్మించి
రూపరేఖలచేత రూఢి కెక్కి
నలుగు రౌనన మంచినడకఁ గల్గిన నీకు
నీవిచారం బేల? యిందువదన!

గీ. యనుచు నూఱడఁబల్కఁగ నతివలెల్ల
మదివిచారంబు మానని మగువకడకుఁ
జేరి కుంభాండపుత్రి యాచిత్రరేఖ
పలికె నిట్లని యాయింతిభావ మలర. 43

—: చిత్రరేఖ పార్వతి వరమును జ్ఞప్తికిఁ దెచ్చుట :—

సీ. వనజాక్షి! యుద్యానవనములోపల నాఁడు
పార్వతి పలికిన పలుకులెల్ల
మఱచితిగాఁబోలు! మక్కువమీఱంగ
నే వివరించెద నిపుడు వినుము
శుకవాణి! వైశాఖశుక్లపక్షంబున
నలువొందు ద్వాదశినాఁటిరాత్రి
కలఁగూడు పురుషుండె కాంతుఁడౌ ననియును
నతఁడును శౌర్యాఢ్యుఁ డౌనటంచుఁ

గీ. బలికెఁ గదవమ్మ! నీతోడఁ బంతమలర
గౌరిపలుకేల తప్పును? కలఁకమాని
సంతసంబున నుండుము సకియ! యనినఁ
జిత్రరేఖకు నిట్లనెఁ జెలువ యపుడు. 44

—: ఉష తాను కలను జూచిన కాంతుని జెప్పుమని చిత్రరేఖతో ననుట :—

చ. మఱచిన కార్యమియ్యెడను మానిని! నీవు తలంపఁజేసితోఁ
బరగఁగ నాఁడు గౌరి తగఁ బల్కినరీతిని గంటి స్వప్నమున్
దరుణిరో! యింక సేయఁదగు తక్కిన కార్యమదేమి యన్న భా
నురగతి నిన్న నేఁ గలను జూచినచెల్వుని జూపవే సఖీ! 45

క. అని పల్కిన చెలిమాటలు
విని భావమునందుఁ జాలవేడుకమీఱన్
వనజాక్షిఁ జూచి ప్రేమం
బెనయఁగఁ గుంభాండపుత్రి యిట్లని పలికెన్. 46

సీ. కమలదళాక్షి! నీకలలోన వచ్చిన
పురుషుఁ డేకులమునం బుట్టినాఁడొ!
పరికింప నెటువంటిబలిమిఁ గల్గినవాఁడొ!
యెటువంటికీర్తిచే నెనయువాఁడొ!
రూఢిచే నెటువంటిరూపుఁ గల్గినవాఁడొ!
కనుపట్టు నెటువంటికాంతివాఁడొ!
తెలియంగ నెటువంటిదేశమేలెడువాఁడొ!
యేవిలాసముచేత నెసఁగువాఁడొ!

గీ. యొక్క గుఱుతైన నాతోడ నువిద! నీవు
తెలుపకుండిన నెటువలెఁ దెలియవచ్చు?
చోరుఁడై యంతిపురమును జొచ్చివచ్చి
మగువ! నినుఁ గూడు నతఁడు సామాన్యుఁ డగునె! 47

క. బలిసుతుఁ డేలెడు నీపురి
బలవైరియుఁ జేరవెఱచు బాణాసురునిన్
గెలువఁగఁ జాలిన పురుషుఁడు
గలుగుట నీభాగ్యవశము కంజదళాక్షీ! 48

ఉ. గౌరియనుగ్రహంబునను గల్గెను నీ కిటువంటిభాగ్యముల్
నీరజనేత్ర! తామసము నీ వొనరింపఁగ నేల? వేగమే
యూరును పేరునున్ దెలిసి యొద్దిక సేయుద మెల్లకార్యముల్
శ్రీరమణుండు నీతలంపుఁ జేకుఱ సేయును నేటరేపటన్. 49

వ. అని పల్కిన.

క. మఱుకాఁకలచే మిక్కిలిఁ
బరవశమై చాలభ్రమసి భామామణి! నా
వరుఁ దోడితెచ్చి చూపుము
పరఁగన్ సరివారలెల్లఁ బ్రస్తుతిసేయన్. 50

వ. అని మఱియును,

చ. మలయజగంధి యెంతయును మాటికి మాటికి వెచ్చనూర్చుచున్
బలుమఱుఁ దాను గన్నకల భావములోపల నెంచిచూచుచున్
వలపులవింటివాఁడు కడువాఁడిశరంబుల నేయ సోలుచున్
నెలఁతుక చిత్రరేఖఁ గని నెమ్మిని నిట్లని పల్కెఁ గ్రమ్మరన్. 51

క. కలలోఁ జూచిన పురుషుని
నెలఁతుక! యిటుదెచ్చి కూర్చు నెనరున ననుచున్
బలుమఱు నీగతిఁ బల్కిన
జలజాక్షికిఁ జిత్రరేఖ సరసత ననియెన్. 52

—: చిత్రరేఖ చిత్రపటముల వ్రాసి దెచ్చుటకై యరుగుట: —

సీ. ఉవిదరో! వినవమ్మ! యూరుపేరెఱుఁగక
యేరీతిఁ దేవచ్చు? నిటకు నతని
నయినను నానేర్పు నాయుపాయంబునఁ
జిత్రపటంబునం జెలువుమెఱయఁ

త్రిజగంబులందును దేజంబుచేతను
బలపరాక్రమములఁ బ్రబలునట్టి
గీర్వాణదానవకిన్నరగంధర్వ
వసుమతీనాథుల వ్రాసి తెత్తు

గీ. సప్తదినములలోనను సరవిమీర
నపుడు నీభర్త వీఁడని యంటివేని
యతని దోడ్తెచ్చి నినుఁగూర్తు ననుచుఁ బల్కి
పటము వ్రాయంగఁ జనియెను బద్మగంధి. 53

—: ఉష విరహతాపము :—

వ. అంత.

క. కటకట ! సప్తదినంబులు
నెటువలె నేఁ గడపు దాన నీవిరహాబ్ధిన్
దిటముగఁ బల్కిన నెచ్చెలి
పట మెప్పుడు తెచ్చుననుచు భామామణియున్. 54

సీ. చెక్కిటఁ జేయిడి చింతచే మిక్కిలిఁ
గంతునిబారికిఁ గలఁగుచుండు
నిట్టూర్పువుచ్చుచు నెమ్మితో నెంతయుఁ
దుమ్మెదమ్రోఁతకుఁ దూలుచుండు
వసుమతి బొటవ్రేల వ్రాయుచున్ బ్రేమచేఁ
గోయిలరవళికిఁ గుందుచుండు
నివ్వెఱఁగందుచు నెనరుతో నెంతయు
శుకముపల్కులకును సొలుచుండుఁ

గీ. బరఁగ నలుదిక్కులను జూచి భ్రమయుచుండు
నెపుడు పతిఁ జూతు నేనని యెంచుచుండుఁ
దనరఁ దనలోనె కాంతుని దలఁచుచుండు
మనసుఁ బ్రియునిమీఁదనే నిల్పి మఱఁగియుండు. 55

సీ. తనర నేఁ జేసిన తపములు ఫలియింపఁ
జెలఁగి నాథుని సేవఁ జేయవలదె
కడుమించు నామదికాంక్షలు చేకూరఁ
జెలువుని కౌఁగిటఁ జేర్పవలదె
తమిమీర నామేనితాపంబు చల్లారఁ
బ్రాణవల్లభుని మోవానవలదె
ముదముతోడుత నాదు ముచ్చటదీరంగ
ననశయ్యఁ బ్రియునిఁ బైకొనఁగవలదె

గీ. యనుచుఁ జింతించు మాటికి నౌర యంచుఁ
దలఁచుఁ దలయూఁచుఁ దనలోనఁ దత్తఱించుఁ
జిమ్మిరేఁగినవలపులఁ జిక్కి మిగుల
విరహపరితాపభరమునఁ దరుణి యపుడు. 56

మ. మకరాంకాకృతి నాథుఁడొక్కరుఁడు ప్రేమన్ జేరఁగావచ్చి మ
చ్చికమీరన్ మరుకేళిఁగూడి కలలోఁ జెన్నొంద లాలించుచో
నకటా! యేఁటికి మేలుకొంటి నిఁక నే నారాజకందర్పుతో
రకమాఁకూటమిఁ గూడు టెన్నఁడో! మదిన్ రంజిల్లుటింకెన్నఁడో!

సీ. ఏనోము నోఁచెనో! యెలమితో రమణుండు
చేపట్టి లాలించు చిగురుఁబోఁడి
యేపూజఁ జేసెనో! యెచ్చినతమి నాథుఁ
బైకొని క్రీడించుభాసురాంగి

ఏమేలొనర్చెనో! యేప్రొద్దుఁ బ్రాణేశు
కౌఁగిట మెలఁగెడు కంబుకంఠి
యేపుణ్య మొనరించెనో! పేర్మి వల్లభుఁ
బొలయల్క నదలించు పుష్పగంధి

గీ. యెంతభాగ్యంబుఁ జేసెనో! యెపుడు విభుని
మనసురా సేవయొనరించు మచ్చకంటి
యెట్టి వేలుపుఁ గొల్చెనో! యేకరీతి
వరుఁడు చనవిచ్చి మన్నించు వన్నెలాఁడి. 58

వ. అని మఱియును.

సీ. కాంతుండు కన్నులఁ గట్టినయట్లైన
నోరి! రారా! యని చేరఁబిలుచుఁ
బ్రేమతో రమణుండు పిల్చినయట్లైన
నెనరుతో నేమిరా! యనుచుఁ బలుకుఁ
బ్రియముతో నాథుండు పెదవానినట్లైన
నొకవింత సీత్కృతు లొనరఁజేయుఁ
జెలువుండు గళరవంబులుఁ జేసినట్లైన
వీనులవిందుగా వినుచుఁ జొక్కు

గీ. మోడిఁ గైకొన్న యట్లైనఁ గోడెకాఁడు
చాల వలచితి సొలసితిఁ గేళినేలు
వేడుకలుమీఱ నన్నంచు వేఁడుకొనును
గాంత మరుమాయచేత విభ్రాంత యగుచు. 59

సీ. పెంచిన చిల్కను బ్రియముతో రమ్మని
పద్యముల్ చెప్పదు పద్మగంధి
రాయంచగములను రమణుఁ జేరఁగఁబిల్చి
నడుపులు నేర్చు దానళినేత్రి

నెమ్మిగుంపుల నెల్ల నెమ్మితో రమ్మని
యాడింపఁగా నెంచ దలఁచుఁబోణి
శారిక రమ్మని చనవిచ్చి మిక్కిలి
మాటలాడింప దామందయాన

గీ. ప్రియముమీఱంగ బొమ్మల పెండ్లి జేసి
కొమరుఁగుల్కంగ గుజ్జెనగూళ్లు వండి
పడఁతులకుఁ బెట్ట నొల్ల దప్పంకజాక్షి
విరహభారంబు చేతను గరఁగి మిగుల. 60

—: విరహభరముచే తపించుచున్న యుషాకన్యఁజూచి
చెలులు తాపకారణము నడుగుట :—

క. నెలకొను విరహముచేతను
గలఁగుచు నీగతిని జాలఁ గళవళపడు నా
పొలఁతుకఁ గని యొక నెచ్చెలి
పలికెన్ నెచ్చెలులఁ జూచి భావములర్పన్. 61

సీ. చెలులార! కంటిరా చెలువ యున్న తెఱంగుఁ
బలువగలై తోఁచె భావమునను
గులమున కింతయుఁ గొదవ వచ్చె నటంచుఁ
గుందియున్న తెఱంగొ! కుందరదన
కలలోనఁ గలసినకాంతునిఁ దలఁచుచు
విరహాన నున్నదో! వెలఁది యిపుడు
బుద్ధిచాతురిచేతఁ బొలఁతుక లందఱు
నిశ్చయింపుఁడు వేఁగ నేర్పుమీఱ

గీ. నసురనాథుండు వినెనేని యాగ్రహించు
నిందుల కుపాయ మేమింక నింతులార!
యనిన వారలలో నొక్క యలరుఁబోణి
నెమ్మి నిట్లని పల్కెను నిశ్చయించి. 62

క. తరమిడి తనలో నవ్వుచుఁ
గరఁగుచు నలుదిక్కు జూచి కళవళపడు నీ
కరిరాజగమనఁ జూచిన
మరుకాఁకయె సిద్ధమనుచు మగువలతోడన్. 63

గీ. పలికి మనమొల్ల నిప్పు డీపడఁతిఁ జేరి
తెలియ నడుగుద మింకను దేటపడఁగ
ననుచు నాలోచన యొనర్చి యందముగను
బలికి రిట్లని యుమఁ జూచి భావమలర. 64

సీ. ఇంతఁ జింతింపంగ నేలనే ? యోలనాగ !
పలుకవే మాతోడఁ బద్మగంధి !
యెంతకార్యంబైన నే మిందఱముఁ గల్గఁ
గలఁగ నేటికి ? నీకుఁ గలువకంటి !
కలలోనఁ బతిఁగూడఁ గులమువారలకెల్లఁ
గొఱవంచు నున్నావొ కుందరదన !
యానాథుఁ బలుమఱు నాత్మలోఁ దలఁపుచు
విరహాన నున్నావొ సరసిజాక్షి !

గీ. తెలియఁబల్కుము వేగమే తేటగాఁగ
ననుచుఁ బల్కువయస్యలయాననములఁ
జూచి యెంతయు సిగ్గుతో నుదతి యపుడు
మనసు డాఁచంగ నేరక యనియె నిట్లు. 65

—: చెలులకుఁ దనతాపకారణముఁ దెలిపి వారితోఁగలసి యుమ శృంగారవనమునకు మన్మథు నారాధించుటకై చనుట :—

ఉ. ముచ్చటమీఱ నాకలను మోహముతోడుతఁ గూడునాథుఁడే
యచ్చెరువొంద నాయెదుట నందముగుల్కఁగ నున్నయట్లుగా
నిచ్చటఁ జొచ్చెఁ గన్నులకు నేమని ! తెల్పుదు నిట్టిమోహముల్
వచ్చినదింటిజోడు పెదబారికి నేగతి నింకఁ దాళుదున్. 66

వ. అని మఱియు నిట్లనియె.

సీ. అల్ల కుంభాండుని యాత్మజయైనట్టి
చిత్రరేఖ యిపుడు చెలువుమీఱఁ
ద్రిజగంబులను గల్గు తేజోనిధుల నెల్ల
సప్తదినంబుల సరసరీతి
వ్రాసి తెచ్చెద నని వన్నెమీఱఁగఁ బల్కి
పటముఁ దే నరిగెను బంతమలరఁ
దుంటవిల్తుఁడు వాఁడితూపుల నేయంగ
గడియ యొక్కయుగంబుగాఁగఁ దోఁచెఁ

గీ. ప్రాణసఖులార! నాదైన భావ మిపుడు
మీరు దాఁచక తెల్పితి మించె వలపు
చేర నెప్పుడు వచ్చునో! చిత్రరేఖ
తలఁపు లెప్పటికి నీడేర్చు దైవమింక. 67

వ. అని పల్కిన యుషాకన్యకు మాన్యలగు నెచ్చెలు లిట్లనిరి.

క. కలఁగకు నెమ్మదిలోపల
పొలఁతీ! యిందున్నఁ బొద్దు పోవున మనకున్
బొలుపగు శృంగారవనిన్
వలరాయని గొల్త మనిరి వాంఛిత మమరన్. 68

క. ఫణిరాజహార చింతా
మణి కామగవీ సురద్రుమ శ్రీఖండ
తుణాధిప శరదభ్ర
ప్రణుతయశస్సాంద్ర! విజయరాఘవచంద్రా! 69

ఉ. శౌరిపదాబ్జసేవనవిచక్షణ! శ్రీరమణీయవీక్షణా!
వైరిజనాధికస్మయనివారణ! సంభృతమత్తవారణా!
సారసలోచనాప్రసవసాయక! సజ్జనభాగ్యదాయకా!
సారయశోవిభూషితదిశాముఖ! వైష్ణవరక్షణోన్ముఖా! 70

క. వారాశిపరీతక్ష్మా
ధార ! భుజాదండవిమతదళనోద్దండా !
శ్రీరామాయణసంతత
పారాయణ ! సరసహృదయ ! పండితసదయా ! 71

గద్య. ఇది శ్రీరాజగోపాలకరుణాకటాక్షవీక్షణానుక్షణప్రవర్ధమానసార సారస్వతధురీణయు విచిత్రతరపత్రికాళతలిఖితవాచికార్థావగాహన ప్రవీణయు తత్ప్రతిపత్రికాళతస్వహస్తలేఖనప్రశస్తకీర్తియు శృంగారరసతరంగితపదకవిత్వమహనీయమతిస్ఫూర్తియు అతులితాష్టభాషాకవితాసర్వంకషమనీషావిశేషశారదయు రాజనీతి విద్యావిశారదయు విజయరాఘవమహీపాలవిరచితకనకాభిషేకయు విద్వత్కవిజనస్తవనీయవివేకయు మన్నారుదాసవిలాసనామ మహాప్రబంధనిబంధనకృతలక్షణయు మహనీయరామాయణ భాగవతభారతకథాసంగ్రహణవిచక్షణయు పసుపులేటి వెంకటాద్రి బహుజన్మతపఃఫలంబును మంగమాంబాగర్భశుక్తిముక్తాఫలంబును రంగద్గుణకదంబయును నగు రంగాజమ్మ వచనరచనాచమత్కృతిఁ జెన్నుమీఱు ఉషాపరిణయంబను మహాప్రబంధంబునందుఁ బ్రథమాశ్వాసము.

—: శ్రీ రాజగోపాలాయనమః :—

శ్రీ రాజగోపాలాయనమః

ఉషాపరిణయము

(పద్యకావ్యము)

ద్వితీయాశ్వాసము

—: ఉషాకన్య చెలులతోఁగూడి యుద్యానవనమున విహరించుట :—

వనకేళి — జలకేళి

శ్రీజయనిత్యనివాసా !
భూజనపాలనవదాన్య ! భూజమహోద
గ్రాజిధనంజయ ! దశది
గ్రాజితగుణహారి ! విజయరాఘవశౌరీ ! 1

వ. అవధరింపుము.

క. అని పలుకు చెలులపలుకులు
విని కన్నియ సస్మితింప వెడ్కలు మదిలోఁ
దనరఁగఁ దమతమయుడిగము
లనువొందఁగఁ జేయఁ బూని రాచెలు లంతన్. 2

సీ. పణఁతి యొక్కతె చేరి బంగారుపావాలుఁ
బదములఁ గీలించె బాగుమీరఁ
జెలియ యొక్కతె చేరి శృంగారమమరంగఁ
గైదండ నొసఁగెను ఘనతమెఱయ

సకియ యొక్కతె చేరి సరిగంచుపనిచీర
నెఱిఁ జక్కఁగాఁ దిద్దె నీటుగుల్కఁ
గొమ్మ యొక్కతె చేరి కొనగోళ్లచేతను
గురులు నున్నగ దువ్వెఁ గొమరుమించ

గీ. నతివ యొక్కతె పనిహార్వ హారిగఁ బట్టెఁ
బొలఁతి యొక్కతె యడపంబుఁ బొసఁగఁ బట్టె
సుదతి యొక్కతె కపురంపుసురఁటి విసరె
రమణి యొక్కతె వింజామరంబుఁ బూనె. 3

వ. మఱియును.

సీ. దండె తంబుఱ స్వరమండలంబుర బాబు
వేటుగజ్జలు ముఖవీణె డక్క
చెంగు కామాచి యుపాంగంబు కిన్నెర
వీణె తాళంబు(ను) బిల్లఁగోవి
చిటితాళము రమయు శేషనాదంబు కా
వణ హస్తమును జంద్రవలయములును
మురజంబు నావజంబును మొదలుగఁగల్గు
కమనీయవాద్యముల్ గరిమఁ దాల్చి

గీ. రంగురక్తులు గులుకంగ రాజముఖులు
ముంగలను జేరి త్రిభువనమోహనముగఁ
జెలఁగి సంగీతమేళంబుఁ జేసి కొలువ
వేడుకలుమీర నెంతయు విభవమలర. 4

సీ. పదపద్మములచాయ పాఱినయెడలను
బఱచినచెంగావి బాగుమీర
నెమ్మనికాంతులు నిండినదిశలను
బంగారుసునుపుఁబూఁత రంగుగుల్కఁ

కలికి లేఁజూపులు గలిగిన బయిటను
కలువతోరణముల చెలువు వెలయ
నటికొప్పు బలుకప్పు నిగ్గుదోఁచిన చోట్ల
నీలముల్ వెదచల్లు నీటుదనర

గీ. బాణనందనయైనట్టి పద్మగంధి
మందయానలు కొలువంగ నందముగను
మనసు నాథునిపై నిల్పి మచ్చికలర
వన్నెమీరిన యుద్యానవనముఁ జేరె. 5

వ. అప్పుడు.

క. రామా! రమ్మని చెలు లా
రామంబునుఁ జూపఁదలఁచి రమణీయవచ
శ్శ్రీమెరయఁ బలికె నీగతిఁ
గోమలికిని బొద్దుఁబుచ్చు కోరికతోడన్. 6

సీ. పరిమళంబులు నించు పసిఁడికైవడి మించె
సంపెఁగల్ జూచితే సరసిజాక్షి!
పంచబాణునికీర్తి పగిది రాణించెను
బొండుమల్లెలుఁ జూడు పువ్వుఁబోణి!
వనలక్ష్మిమౌక్తికవరహార మన మీరెఁ
బొన్నమొగ్గలుఁ జూడు పువ్వుగంధి!
యొప్పారె ధరసేసకొప్పు చందంబున
సేవంతులన్ను జూడు చిగురుఁబోణి!

గీ. మాధవునికొలువుకూటాలమాడ్కిఁ దనరెఁ
గన్న! చూడుము పుష్పాడిదిన్నెలిచట
ననుచుఁ జెలి నెచ్చరించుచు హర్షమునను
వనవిహారంబునకుఁ బూని వనజముఖులు. 7

రగడ. జలజాక్షి! చూచితే సరవిఁ గనకములిందుఁ
దొలఁగె నళులెల్లను దూరముగ నిటులిందుఁ
జెలియతోఁ బలుమాఱు సేయకుము వాదులను
వెలయాల! కైకొనుము వేగ విరవాదులను
గలకంఠి! నేమున్న గైకొంటిఁ జిగురాకు
వలదు నాతో వట్టివాదు ఘనమగు రాకు
కొమ్మ! యీవిరిబంతిఁ గొనఁగ నాచెలితరమె
తుమ్మెదలు ఝుంకృతులఁ దొలఁగ నదిగో తరమె
సుదతిరో! వింతాయెఁ జూడు మిట నీడలను
మదనుని హజారములమాడ్కి దగె నీడలను
బోఁటిరో! మకరందముల మీఱె నిదె పొగడ
చెలరేఁగి పలుమాఱుఁ జెల్లదే యికఁ బొగడ
హరిణాక్షి! పరికింపు మచటికింశుకములను
మెఱుఁగారు విరుల నామెతసేసె శుకములను
పారిజాతముఁ జూచి పరువెత్తె-మున్నయది
మారు నేలగో లిచట మలసి పిక ముస్నయది
కంతునకు నర్పింప గమనజితవేదండ
వింతగాఁ గూర్చెదను వేగ యీవే దండ
నలరుగుత్తివి దాని నదట యిమ్మనికేల
కెలననున్నవి విరుల్ గిల్లుమీవె నికేల
నగువారిఁ జూడు మెన్నదు గాన మీవింత
చిగురాకునకు రాపుసేతురా నీవింత
కోరి నేఁ దెచ్చితిని గోరంటవాసనను
నార! నే నెటులిత్తు నడిగె దీవాసనను
నదిర! దవ్వుగఁ బోయి యరికట్టె నిది రాఁగ

సొదురుగా విరిసరుల కింతి యుత్తటి రాఁగ
మల్లెమొగ్గలు మీరె మరునిశరగోల లన
నెల్లడలఁ దనచాయ లెనయ నిదిగో లలన
బింబోష్ఠి! యేనె తగఁ బెంచి తిటు సాలమును
డంబైనయట్టి నీడల నీరసాలమును
నెంతదూరము చనియె నిందుకే యీ తేమ
కంతుపూజకు నన్నఁ గనకములె యీ లేమ
వేడుకలు నించె నిట వెలఁది నారంగములు
నాడగా గుంపులై యలరె సారంగములు
అవుర! బంగరుచాయ నమరె జంబీరములు
యువతి! నీకుచము లెనయునె వట్టిబీరములు
గురువెందగుత్తిఁ గైకొను మేల? జగడంబు
పరికింపు వీనికిని బ్రతియగునె పగడంబు
చాలు నిక ననలనుచు సరసోక్తులను బెనుచు
బాళి మీరఁగఁ జాల బాణనందన ప్రోల. 8

క. వనకేళి సల్పి యీగతి
నెనసిన తమమేనిబడలికెంతయుఁ దీర్పఁ
దనరెడు తామరకొలనికి
వనజేక్షణఁ దోడుకొనుచు వచ్చిరి వేడ్కన్. 9

సీ. తావులవెదచల్లు తామరవిరి యను
ముద్దులుగుల్కు నెమ్మోముదనర
డాలుఁ గల్గినయట్టి వాలుగమీలను
కడుసోగలై మించుకన్ను లమర
మక్కువగనుపట్టు జక్కవ లనియెడు
కొమరుమీరిన గబ్బిగుబ్బ లలర
నొమ్మిగాఁ జెలువొందు తుమ్మెదగుంపను
కప్పుమీరిన గొప్పకొప్పు మెఱయ

గీ. హంసగమనంబులను గతు లతిశయిల్ల
దరఁగ లనియెడు బాహులఁ దనరఁ జాఁచి
సరసి యనియెడి చెలికత్తె సంభ్రమమున
బాణతనయ నెదుర్కొనె భావమలర. 10

క. ఒకరొకరిచేయి గుచ్చుక
పకపక నవ్వుచును మిగులఁ బంతము మీరన్
వికచాబ్జనయన లయ్యెడ
నకలంకంబైన సరసి నాడుచు వేడ్కన్. 11

సీ. ఈఁత యిక్కడను లేదింతిరో! రమ్మని
చేరంగఁ బిల్చెను జెలియ యొకతె
చిమ్మనగోవులఁ జిమ్మెద వేగమ్మ
యొడ్డించుకొమ్మనె నువిద యొకతె
నేర్పున నీఁదెద నేలఁత! యిచ్చోటను
దను జూడుమని పల్కెఁ దరుణి యొకతె
కలువపువ్వులఁ గోసి కలికి! నీకిచ్చెద
వెన్నంటిరమ్మనె వెలఁది యొకతె

గీ. మాటిమాటికి జాఱుడుఁబీఁట లెక్కి
సారసాక్షులు కొందఱు జాతి సారె
నొండొరులమీఁద జలములు నిండుకొనఁగ
జల్లులాడిరి సరసిలో సరసముగను. 12

సీ. ఒప్పైనకురులకు నోడిపోయినయట్లు
తుమ్మెదగుంపులు తొలఁగఁజారె
స్తనయుగ్మములకును సరిరామనెడులీలఁ
జక్రవాకంబులు సరగ నెగసె

గమనంబులకుఁ గుంది కడ నుండుకై వడి
నంచలు పార్శ్వాల నడఁగియుండెఁ
గనుదోయితోఁ సాటిఁ గాంచలేమనురీతి
జలములలోఁ దాఁచె సారె మీలు

గీ. కొమరుమీరు కరేణువుల్ కొలను జొచ్చి
మించువేడుకతో విహరించునట్లు
బాణనందనఁ గూడి యప్పద్మముఖులు
సరసిలోపల జలకేళి సల్పునపుడు. 13

క. ఇవ్విధమున విహరించిన
జవ్వను లందఱును గూడి సంతసమమరన్
బువ్వుంబోణినిఁ దోడుక
నవ్వుచు గట్టెక్కివచ్చి నైపుణిమీరన్. 14

ఉ. బొమ్మలపట్టుకోకలను బొంకముమీరఁగఁ గట్టి మేలిసౌ
సొమ్ములు మేనఁ దాల్చి కడుసొంపమరన్ జడలల్లి వింతగా
నెమ్మిని గీఱునామములు నీటుగ దిద్దుచుఁ దీవమేనులన్
గమ్మజవాదివాసనలు ఘుమ్మనిమీర నలంది వేడుకన్. 15

—: మన్మథారాధనము :—

క. బటువగు మామిడికిందను
కుటిలాలకమదిని మించుకోర్కెలు వెలయన్
స్ఫుటముగ మదనునిభావముఁ
బటమున లిఖయించి తెచ్చి ప్రముదముమీరన్. 16

క. పుష్పాదిని దిన్నెఁదీర్చుచు
నొప్పుగ మృగనాభి నలికి యొదవిన వేడ్కన్
గప్పురపుముగ్గు లిడుచును
దెప్పలుగాఁ దమ్మివిరులఁ దెచ్చుచు మఱియున్. 17

సీ. ప్రతిలేని రతనాలపళ్లెంబులోపల
గందంబు కుంకుమ కస్తురియును
బసిఁడియక్షతలను బండ్లు టెంకాయలు
పన్నీరుచెంబులు బాగుమీఱ
కపురంపుబాగాలు కలువపూబంతులు
మొగిలిరేకులు మంచి మొల్లవిరులు
కురువేరు దవనంబు గొజ్జంగసరులను
బొండుమల్లెసరాలు పొన్నపువులు

గీ. మొదలుగాఁగల వస్తువుల్ ముదముమీఱఁ
దెచ్చి ముందఱ సవరించి తేజమమరఁ
బచ్చవిల్తుని నచ్చటఁ బరఁగ నిలిపి
బాణనందనఁ దోడ్తెచ్చి బాగుమీఱ. 18

సీ. ధ్యానంబు నారాయణాత్మసంభవునకు
నావాహనంబు రత్యాప్తునకును
సింహాసనంబు రాచిల్కతేజీరౌతు
కర్ఘ్యంబు వారిచరాంకునకును
బువ్వులదుప్పటి పూవింటిజోదుకు
గంధంబు మలయాశుగప్రభువునకు
నలరుదండలు కుసుమాకరసఖునకు
ధూపంబు భూరిప్రతాపునకును

గీ. దీప మఖిలానురాగప్రదీపనకును
సరసనైవేద్య మిదె యిక్షుచాపధరున
కనుచు వివిధోపచారము లాచరించి
యయ్యుషాకన్య మొక్కించి యందముగను. 19

సీ. అఖిలజగన్మయుండైనట్టి హరియును
శ్రీసతి నెదనుంచెఁ జెలువముగను
సకలంబు సృజియింపఁజాలిన బ్రహ్మయు
వాణిని నెలకొల్పె వదనసీమ
నతిరౌద్రుఁడై యుండునట్టి ముక్కంటియు
సామేన నుంచెను సతినిఁ బ్రేమ
నల పరాశరమౌనియంతటివాఁడును
మత్స్యగంధినిఁ గూడె మమతచేత

గీ. నితరు లన నెంత నీదాడి కెంచిచూడ
నీకు నెన మెవ్వరయ్య త్రిలోకములను
బాల మెటువలెఁ దాళు? నీబాణములకు
కన్నెఁ గావుము మదన! నీకరుణచేత. 20

వ. అని సన్నుతించి యక్కన్నియచేత మొక్కించిన.

క. కుతుకము మీరఁగ నామదిఁ
జతురతఁ గలఁ గలసినట్టి సరసగుణాఢ్యున్
బతి సేయు మనుచుఁ గోమలి
రతిరాజును వేఁడుకొనియె రంజిలుభక్తిన్. 21

వ. అంత,

—: సూర్యాస్తమయ చంద్రోదయవర్ణనములు :—

క. అరుదగు తనసతినామముఁ
దిరముగ ధరియించునట్టి తెఱవకు నింకన్
బరితాపం బడరాదని
ఖరకరుఁ డస్తాద్రిఁ జేరెఁ గనికరమొప్పన్. 22

మ. కమలంబుల్ ముకుళించె భృంగములఝుంకారంబు తోరంబుగాఁ
గుముదశ్రేణులయందు మించె ఖగముల్ గూడుల్ వడిం జేరె సం
తమసంబుల్ దిశలందుఁ జేరెఁ గడువంతన్ గుందెఁ జక్రావళుల్
కమనీయద్యుతిఁ జెందెఁ దారకలు నాకాశంబునం దీరుగన్. 23

సీ. చీకటు లనియెడు సింధురశ్రేణులఁ
జెండాడవచ్చిన సింహ మనఁగ
నమరులు సాధియింపఁ గల క్షీరవారిధి
వెలువడి కనుపట్టు వెన్న యనఁగఁ
బూర్వదిక్కనునట్టి తొయ్యలి ధరియించు
మురువైన ముంగరముత్తె మనఁగ
వెలిదీవిలో నున్న వెన్నునిసన్నిధిఁ
బట్టిన బలుపగల్వత్తి యనఁగ

గీ. వెలయుఁగఁ జకోరములకెల్ల విందుఁ జేసి
కువలయామోద మొనరించి కొమరుమీరఁ
గూడియుండెడి విటులకుఁ గోర్కె హెచ్చఁ
జంద్రుఁ డుదయించె సత్కాంతిసాంద్రుఁ డగుచు. 24

వ. అట్టి సమయంబున.

—: మన్మథుఁడు ఉషపై దాడివెడలుట, మాన్మథవికారవర్ణన :—

క. బల్లిదుఁడై మొల నరవిరి
చల్లడమున్ జివురుదట్టి సవరించి తగన్
మల్లెవిరిబొమిడికం బిడి
మొల్లజిరాఁ దొడిగి మిగుల మోదముతోడన్. 25

సీ. చెలరేఁగి మోఁదేఁటిమొలగోలుమూఁకలు
దులదుల మునుమున్న దుసుకు లిడఁగ
దండిమై రాయంచదండి బారానెంట
మెండుగా నల్లడ నిండి నడవ
నిరువంకలను జేరి గోరం మున్నీలు
బలుబింకములతోడఁ బ్రబలి కొలువ
గుంపుగూడుక గండుగోయిల మూస్టీలు
వెన్నానికై మదోద్వృత్తి కాఁగఁ

గీ. జిలుఁత తెమ్మెర దళవాయి సరసఁ జెలఁగఁ
దేజమునఁ రంగ రాచిల్క తేజి నెక్కి
తమ్మిదోదుమ్మిఁ గలువకేదెమ్ముఁ బూని
తలిరువిలుకాఁడు బోటిపై దాడివెడలె. 26

ఉ. పాయనిభీతిఁ బాంథులకు ధగ్గున గుండెలు బెగ్గడిల్లఁగాఁ
గోయిల లంటి వెంట జని కోయని యార్వఁగ దంటతుంటవిల్
రాయఁలు తుమ్మికై దువ రఘారాయన దూయుచు దొమ్మి కొమ్మపై
ధేయఁసి కల్కిరాచిలుక తేజిని నూఁకె మువాళ మొప్పఁగన్. 27

క. ఆయెడ వలరాయఁడు బలు
రాయిడికెందమ్మి జిగికరాచూరులచే
నాయమ్ములు గాయమ్ములు
సేయన్ మదిరాక్షి బెగడెఁ జిత్తములోనన్. 28

క. కలఁ గలసిన యాలచెలువుని
చెలువముఁ దమి నెంచ నెంచఁ జిత్తములోనన్
వెలివిసరె సత్వసంభవ
లలితవికారంబు లపుడు లజ్జావతికిన్. 29

చ. సరసిజపత్త్రనేత్ర కలచందము డెందములోనఁ బూని ప
ల్మరు మరుచూలి యేలినక్రమంబు గణించ మరుండు నించఁగా
గరులకుఁ గాఁడి వాఁడి సరికట్టిన కల్వలకోరిచాలు మే
ల్మురువున రూపుమైపులకముల్ మెఱసెన్ మొగసెన్ ద్విరేఫముల్.

చ. సలలితమైన చందనముచాయను మాయఁగఁ జేసి కప్రపుం
బలుకుల తళ్కుపూఁత నగుఁబాటొనరింపుచు గబ్బిగుబ్బలన్
నెలకొను సిబ్బెపున్ మెఱుఁగునీటును మాటు ననంగపాండిమం
బలవడె నింతిమేనఁ గుసుమాయుధకీర్తిసమానమూర్తియై. 31

సీ. మించుమొగ్గలను రాణించు తీవియ నీస
డించు చెల్వంబు వరించ నెంచి
డంబుముత్తెపుచెక్కడంబుడాల్ మరుని బె
త్తంబునేల్ మెఱుఁగుమొత్తంబుఁ దాల్చి
యొసపరిమించు చే నెసఁగు తొల్కరివిప్పుఁ
బసిఁడిగేదఁగిరేకు మిసమిఁ దెగడి
చిలుపసీలును బొందు నిలుపఁబోలు మెఱుంగు
మలపుఁ జాలు తెఱంగుఁ దెలుపమీఱి

గీ. మెఱయు చిరుచెమట నీన మేన చాన
యుల్లసిలువల్లభుని నెద నుండునట్లు
డాలువాలుగదార పూలకోలలేటు
నాఁటి సాత్వికభావంబు తేటపఱుప. 33

గీ. వనజముఖ యాఱ ! యబలయయ్యును జగత్ప్ర
సిద్ధు ననిరుద్ధుఁ దనలోఁ నిరుద్ధుఁజేయు
బద్ధవైరంబు మరున కాభ్రమరకచకు
దానిచే నమ్యె సుతునకై పూనుకొనరె ! 33

చ. కనుఁదెఱఁగొప్పియున్ గనదు గాంచు గణించఁగఁ బారవశ్యమున్
వినుతికి నెక్కు నామధురవృత్తి వహించియు మాటలాడదో
మునుకొని యెట్టివారలకు మోహమొనర్చును గాఁక కిమ్మగున్
గనుఁగొన భేద మాకలువకంటికి మారునితుంటవింటికిన్. 34

క. కలకల నవ్వుచునుండున్
బలుమాఱును దిశలుఁ జూచు భ్రమయుచునుండున్
నిలిచినచోటను నిలువదు
కలకంటికి విరహమెంత ఘనమో ! యకటా ! 35

—: ఉషాకన్యకు చెలులు శైత్యోపచారములఁ జేయుట :—

వ. ఇవ్విధంబున,

క. మరుకాఁకల భ్రమనొందుచుఁ
బరువడి నుసురసురుమనుచు భామిని మదిలోఁ
వరునిన్ దలఁపుచు నుండఁగ
వెరగందుచు నొక్కసకియ వెలఁదుల కనియెన్. 36

సీ. అతివ ! దాఁగిలిముచ్చులాట లాడుద మన్న
సమ్మతించ దొకింతఁ జంద్రవదన
చెండుగోరింతము చెలియ ! రమ్మని పిల్వఁ
గనువిచ్చి చూడదు కలువకంటి

గుజగుజరేకుల కొమ్మ ! యాడుద మన్న
    మోమెత్తి చూడదు ముద్దుగుమ్మ
పగడసాల మనము పడఁతి ! యాడుద మన్నఁ
    బలుకదు మనతోను బద్మనయన

గీ. యతివ ! చదరంగ మాడుద మనుచుఁ బిల్వ
నించుకైనను సంగీకరించదయ్యె
ననినఁ దమలోన వగచుచు నతివఁ జేరి
మరునితాపంబుఁ జల్లార్చుమనసుతోడ. 37

సీ. బాణనందన కష్ఠ పణఁతు లందఱుఁ గూడి
    శైత్యోపచారముల్ సలుపఁగోరి
చిగురాకుపాన్పుపైఁ జెలియ నొయ్యన నుంచి
    పూలదుప్పటి మేనఁ బొసఁగఁ గప్పి
కపురంపువాసనల్ ఘుమ్మన వాసించు
    చలువగందముఁ బూసి చెలువుమెఱయఁ
బన్నీటఁ దడసిన పావడ చేతను
    మొగమునఁ దడియొత్తి మోదమమరఁ

గీ. గలువపూవులబంతులఁ గన్నుదోయి
మాటిమాటికి నొత్తుచు మమతమీరఁ
బూలసురఁటుల విసరుచుఁ బొంకముగను
మరునితాపంబుఁ జల్లార్ప మగువకపుడు. 38

సీ. చెలువుమీరినయట్టి చిగురాకుపానుపు
    చిగురువిల్తుని వాఁడిచిలుకులయ్యెఁ
బొసగంగఁ గప్పిన పువ్వులదుప్పటి
    పంచబాణుని బాణపంక్తులయ్యెఁ

గన్నుల హత్తించు కలువపువ్వులబంతి
వలరాజుమొలనున్న వంకి యయ్యెఁ
దనువున నించిన తామరతూఁడులు
కుసుమసాయకు నీలకొజ్జులయ్యెఁ

గీ. జెలులు గావించు నుపచారములె తలంప
మనసిజుని సాధనంబులై మనసులోనఁ
దోఁచుచుండంగ విరహంబుఁ దోయలేక
నేమిసేయుదు ? నెట్లోర్తు ? నేనటంచు. 39

—: ఉషాకన్యయొక్క మాన్మథప్రలాపములు :—

క. కలఁగుచు నుండెడు వేళను
గలలోపలఁ గలసినట్టి కాంతుండెదుటన్
నిలిచిన యటువలెఁ దోఁపఁగ
బలుమఱు నెచ్చెలులతోడ భ్రమయుచుఁ బలికెన్. 40

సీ. అంతఃపురంబున కళుకక వచ్చిన
దిట్టను జూడరే తెఱవలార !
తనమానధనమెల్ల మునుగైకొనినయట్టి
చోరునిఁ జూపరే సుదతులార !
పలుమాఱు మోవాని పలుగంటిజేసిన
జాటును జూడరే బోటులార !
చెక్కిలిఁ గొనగోర జీరలుజేసిన
యీధూర్తుఁ జూడరే యింతులార !

గీ. తొడలపైనుంచి పుక్కిటివిడె మొసంగి
కళల సొక్కించి మిక్కిలి గారవించి
కంతుకేళిని ననుఁగూడు రంతుకాఁడు
యెదుట నున్నాఁడు జూడరే ముదితలార ! 41

సీ. జూటుకాఁడగు వీఁడు జాఱఁగిపోవక యుండఁ
దోయజాక్షిరో ! తల్పు మూయవమ్మ
కన్నగాఁడగు వీఁడు కదలిపోవక యుండఁ
బడఁతి ! సందిట గుచ్చి పట్టవమ్మ
వంచకుండగు వీఁడు వదలిపోవక యుండఁ
జంచలేక్షణ ! యడ్డగించవమ్మ
దిట్టయైతగు వీఁడు తేలిపోవకయుండ
నతివ ! పేరేమని యడుగవమ్మ

గీ. సారిది నల పోతుటేఁగకుఁ జొరఁగరాని
యిచ్చటికి నేటి కీవేళ వచ్చెతనుచు
మంచిమాటలచే వీనిమనసు తెలఁపుఁ
గలువకంటిరో ! తేటగాఁ దెలియవమ్మ. 42

వ. అని మఱియు నిట్లనియె.

సీ. కన్నెపాయముదానఁ గదిసి నామోవిని
బలుగంటిసేతురా ! భయము లేక
యాటపాయముదాన నగడుగాఁ జన్నులఁ
గొనగోరులుంతురా ! కొంకు లేక
ముద్దరాలను నేను ముద్దుచెక్కిలి నొక్కి
జీరలు సేతురా ! చింత లేక
గోలను గాఁగిట గుచ్చి నీసరిపెన
గురుతులు నింతురా ! సరకు లేక

గీ. బాలికామణినైయైన నాపాన్పుఁ జేరి
పచ్చవిల్తుని కేళిని మచ్చువగల
వేగుదనుకను నన్నుఁగూడి వింతగాఁగ
గాసిసేతురే ! నీవింత కరుణలేక. 43

సీ. పుక్కిటివిడె మిచ్చి బుజ్జగించిన నీకు
మోవియ్యనైతినా మోహనాంగ!
కదిసి ప్రేమను నన్ను కౌఁగలించిన నిన్ను
గుబ్బల నొత్తనా కోడెకాఁడ!
చెక్కిలి నొక్కినఁ జెలరేఁగి సందిట
నెలవంక లుంచనా నీటుకాఁడ!
సమరతులను నన్ను సారె నీవలయించ
నుపరతి సేయనా వోరి జాణ!

గీ. నేరమేమిర? నామీఁదఁ జేరి యింత
తామసించిన నేనింత తాళఁగలనె
కౌఁగిలియ్యర నాసామి! కరుణమీర
భావజున కొప్పగింతురా! ప్రాణనాథ! 44

సీ. అల చకోరము వెన్నెలతిన కిచ్చినయట్లు
మోవి యొసంగరా మోహనాంగ!
చెలువతోఁ గోకిల చెలఁగి పల్కినయట్లు
మాటాడరా వేగ నీటుకాఁడ!
హంస తామరతూఁడు సబల కిచ్చినరీతి
మణుపులు గోటికీర మన్నెరాయ!
జక్కవ వెంటితో జతఁగూడి నటువలె
రతి నేలరా నన్ను రంతుకాఁడ!

గీ. ననయు వాసనయును గూడి తనరినట్టు
లొప్పుమీరిన యీచల్వచప్పరమున
నమరు చౌసీతివగలచే సనఁగి పెనఁగి
కోర్కె లీడేర్చరా నేడు కోడెకాఁడ! 45

సీ. పొలఁతి యెవ్వతె చేరి బుద్ధులు చెప్పెనో !
పలుమాఱు నేఁ బిల్వ బలుక వేమి ?
పూఁబోణి యెవ్వతె బోధించెరా నీకు
ప్రేమఁ గౌఁగిటఁ జేర్చి పెనఁగవేమి ?
లేమ యెవ్వతె దయలేకుండఁ జేసెనో !
తియ్యని కెమ్మోవి నియ్యవేమి ?
చెలియ యెవ్వతె నీదుచిత్తంబుఁ గలఁచెనో !
చెక్కిలిఁ బ్రేమతో నొక్కవేమి ?

గీ. యెవ్వతె మరులుఁ బుట్టించె నెసఁగ నీకు
నెయ్యమమరంగ నను జేరఁదీయ వేమి ?
భావజాకార ! నీకైన భావ మేమి ?
తెలియఁబల్కర నీవింకఁ దేటగాఁగ. 46

—: ఉష మదనుని మదనబలముల నిందించుట :—

సీ. ప్రేమతోఁ జక్కెరఁబెట్టి లాలించిన
చిలుకలే వెగటుగాఁ బలుకసాగె
నామెలదోఁటలోననె వృద్ధిబొందిన
యళులె ఝుంకృతుల నన్నలుకసేసె
నటనగుల్కంగ నేనడపించు నంచలే
ప్రతికూలగతులయ్యె భావమునకుఁ
బూఁటబూఁటకు నీళ్ళఁ బోసి పోషించిన
లతికలే మదనమ్ములపొదు లయ్యెఁ

గీ. పాములకుఁ బాలు బోసినపగిది వీటి
నెంత పెంచినఁ గనికర మింత లేక
పంత మలరంగ నేఁ డల పంచబాణుఁ
గూడి యారార ! నామీఁద దాడివచ్చె. 47

వ. అని యాదనుజరాజపుత్రి వనజవైరిం జూచి యిట్లనియె.

క. క్షీరాంబుధి జనియింపుచు
శ్రీరమణికి నన్న వగుచు జెలఁగిన నీకుఁ
గ్రూరమగు సెకలు జల్లుట
నాహుద్రునిశిరసుఁ జేరు నావగను సుమీ! 48

వ. అని పల్కిన యనంతరంబ యాబాణపుత్రి పంచబాణు నుద్దేశించి.

క. చలికరువలినెచ్చెలివై
యెలమిఁ హరితనయుఁ డనఁగ నిల నెగడిన యో
కలువలచెలి మేనల్లుఁడ!
చెలువల నిటులెంచ నీకుఁ జెల్లునె మదనా! 49

గీ. బాణునకు నోడి చనిన గీర్వాణులెల్ల
మకరకేతన! నిను వేఁడ మచ్చరించి
చెలఁగి నామీఁద దాడివచ్చిన విధంబె
తెలిసె లేకున్న నీకింత ద్వేషమేల? 50

క. అని మదను మదనబలముల
మనమున నిందించి మగువ మాటికి దూఱన్
విని నెచ్చెలు లందఱు నా
దనుజాధిపపుత్రిఁ జూచి తగ ననిరెలమిన్. 51

క. అల చిత్రరేఖ మనతోఁ
దెలిపిన యటువంటి సప్తదినములు గడచెన్
దెలతెలవాఱఁగవచ్చెన్
గల్లఁగను మిదె పటముఁ దెచ్చుఁ గమలదళాక్షీ! 52

—: సూర్యోదయవర్ణనము :—

వ. అని నెచ్చెలు లచ్చెలువ నూఱడించు సమయంబున.

చ. పలుమఱు గాఁక నింపుచును బాణతనూభవ నింత యేఁచఁగా
బలితనయుండు వేగ తనపై నిఁక నెక్కుడ దాడివచ్చునో!
చలమున నంచు వెల్లనగు చందురుచందముఁ జూచి మాటికిన్
నెలయఁగ నవ్వినట్లు లరవిందములుల్ వికసించె నత్తరిన్. 53

చ. ఎనయఁగ నాయెడన్ దిరిగి యీదనుజుల్ భయపెట్టులోకముల్
మనుమని బ్రోవఁగా దనుజమర్దనుఁ డీకడ వచ్చి నిచ్చలున్
దనుజులకెవ్వసంగితని దండనసేయునొ యంచు జాతెనా
చనియెను రాత్రి యంతటనుజక్కనసూరుఁడుదోఁచెఁ దూర్పునన్.

చ. పురమున సాయకాసురుఁడు భూరిబలంబున లెక్కసేయకే
హరివరశౌర్యుఁడైయలరు నయ్యనిరుద్ధుని నడ్డగించినన్
దురుసగు వేయిబాహువులుఁ ద్రుంచు మటంచును బంప వచ్చునా
హరికరచక్రమో యనఁగ నంబుజమిత్రుఁడు తోఁచె నంతటన్.

—: ఉష చిత్రరేఖరాకకై యెదురుచూచుట, చిత్రరేఖ పటముల
వ్రాసి తెచ్చుట :—

వ. ఇట్లు సూర్యోదయంబైన యనంతరంబ యాయుషాకన్నియు
నొప్పుమీరు నొక్కచలువచప్పరంబందుఁ గప్పురపుగంధులుఁ
దానును గొలువై యుండి చిత్రరేఖరాక కెదురుచూచుచు
నెచ్చెలులతోడ నిట్లనియె.

సీ. అల విభునామంబు నన్వయక్రమమును
నెన్నఁడు నే విన నిందువదన!
వాని వయోరూపవరవైభవంబులుఁ
జూడ నెన్నడు నేను శోభనాంగి!

తలఁపున నొకనాఁడు తలఁచని ప్రియుఁడేల!
కలలోన వచ్చెనే కంబుకంఠి !
కలఁగన్నవారికిఁ గాఁకలు రెట్టింప
వలపులు బుట్టునా వెన్నెలాఁడి !

గీ. యిట్టివిరహాంబునిధి దాఁట నేది తేప ?
చిత్రరేఖయు రాదాయెఁ జెలిమిమీర
నేమిసేయుదు దాఁపెవ్వ రింకఁ దనకు ?
నిమిష మేఁడయి తోఁచెను నీరజాక్షి ! 56

వ. అని యుషాకన్య పారంబులేని విరహాభారంబున సచ్చెలులతోడ ముచ్చటలాడుచు నుండె, నంతకుమున్న యక్కడ.

సీ. రాణించు లత్తుకరసమును సంకును
హాళఁది కాటుక పచ్చయాదియైన
వన్నియలను బైఁడిగిన్నియలను నించి
బాగుగా ఘటియించు పటమునందు
సొరిది బంతులుగాఁగ సూత్రముల్ హావణించి
జోకగాఁ గప్పున రేకఁదీర్చి
యమర నయ్యయెడలందు వన్నెలు నించి
యమరదైత్యాదిభావములు వెలయ

గీ. వారివారికి నగునలంకారములను
వారివారికిఁ దగునట్టి వస్త్రమాల్య
ములును గనుపట్టునట్లు నేర్పున లిఖించెఁ
జిత్రతరలేఖయైన యాచిత్రరేఖ. 57

వ. ఇవ్విధంబున.

సీ. ఆసఖీమణి సప్తవాసరములలోన
        నట్లన గీర్వాణయుతవరుల
దనుజముఖ్యులను గంధర్వకిన్నరులను
        మహిని బ్రసిద్ధులౌ మనుజపతుల
భావంబుమీర గొప్పపటంబునను వ్రాసి
        యాపటంబును గొంచు నతిజవమున
నెప్పుడెప్పుడటంచు నెదురుచూచుచు మదిఁ
        గలఁగుచుండెడు నుషాకన్యఁ జేరి

గీ. తాను దెచ్చినపటము ముందఱను నిల్పి
కన్నె! కను మిప్పటంబున నున్నవారి
వన్నెమీరు సురాసురకిన్నరోర
గప్రముఖులైన సౌందర్యఖనుల ఘనుల. 58

క. వీరల నందఱఁ గనుఁగొని
కోరికలను నిన్ను బ్రేమఁ గూడిన పురుషుఁ
నీరజముఖ! యెఱిఁగించినఁ
జేరువకుఁ దోడి తెత్తుఁ జెలువుగ నతనిఁ. 59

—: చిత్రరేఖ చిత్రపటములందలి నాయకుల వర్ణించుట :—

వ. అని పలికి తదనంతరంబ చిత్రరేఖ యిట్లని వివరింపఁ దొణంగె.

సీ. పరికింపు కృతనేత్రపర్వులై వెలయు సు
        పర్వులు వీర లోపద్మగంధి!
తమిఁ జూడు రుచిరగాంధర్వులై చెలఁగు గం
        ధర్వులు వీర లోతలిరుఁబోఁణి!

వీక్షింపు సురలోకరక్షణదక్షులౌ
యక్షులు వీర లోయలరుఁబోణి!
కనుఁగొను మహితభంజనసద్విచారణల్
చారణుల్ వీర లోసరసిజాక్షి!

గీ. పన్నగేంద్రులు వీర లోపక్ష్మలాక్షి!
కిన్నరులు వీర లోరాజకీరవాణి!
సిద్ధవరులు వీరలు మణిస్నిగ్ధవేణి!
సాధ్యవర్యులు వీర లోసన్నుతాంగి! 60

వ. అని మఱియును,

సీ. అద్రిసముత్తుంగభద్రవారణసము
న్నిద్రసైన్యుఁ డితఁడు మద్రవిభుఁడు
బాలామనోహారనాళీకశరరూప
లాలితుండితఁడు పాంచాలవిభుఁడు
ధాటీసముద్భూతఘోటీకృతారాతి
పాటనుండితఁడు కర్ణాటవిభుఁడు
దారుణపరవీరదారణకరవాల
ధౌరేయుఁ డితఁడు సౌవీరవిభుఁడు

గీ. భోటకాంభోజమగధభూభుజులు వీర
లంగవంగకళింగనాయకులు వీరు
చోళనేపాళకేరళమాళవాది
రాజకులముఖ్యనృపులు వీరలు మృగాక్షి! 61

గీ. పుణ్యవంతుఁడు మిగుల దాక్షిణ్యశాలి
సత్యవాది శుభావహస్తుత్యకీర్తి
రాజకులభూషణుండు ధర్మజుఁ డితండు
సారసోదరసోదరచారుగాత్రి! 62

క. భూరిబలరూపవిద్యా
ధౌరేయుఁడు భీమనిజగదాక్రాసితగాం
ధారేయుఁ డితఁడు భీముఁడు
దారయశోధనుఁడు వికచతామరసాక్షీ! 63

క. గాండీవధరుఁడు సద్గుణ
మండితదిఙ్మండలుండు మత్తారిశిరః
ఖండనపండితుఁ డితఁడా
ఖండలసుతుఁ డర్జునుండు కమలదళాక్షీ! 64

గీ. ఆశ్వినేయకుమారుల నధికయశుల
నంగనాజనమోహనానంగసముల
నఖిలభువనప్రసిద్ధుల నమితబలుల
నకులసహదేవులను జూడు నళిననేత్రి! 65

సీ. సకలసంపదలచే జగతిలో వెలసిన
రాజరాజితఁడో రాజవదన!
శౌర్యఖడ్గంబుల గరిమఁగాంచినయట్టి
యువరాజితండు నీలోత్పలాక్షి!
దానకీర్తులచేత ధరలోన నెగడిన
కర్ణుఁ డితఁడు సుమ్ము కంబుకంఠి!
సకలమాయోపాయచాతుర్యమున మించు
శకుని యీతఁడు సుమ్ము చారుగాత్రి!

గీ. సింధుకోసలజాంగలసింహసాళ్వ
గౌడకాశ్మీరలాటకేకయవిదర్భ
కుంతికుంతలసౌరాష్ట్రకుకురనిమధ
నాయకులు వీర లోహరిణాయతాక్షి! 66

క. హాలాసేవనసంతత
హేలాలహరీవిహారి హీరహిమాంశీ
[1]హేలాంకరసితగాత్రుఁడు
నీలాంబరుఁ డితఁడు నీలనీరదచికురా! 67

సీ. కరుణారసోత్తుంగశరణాయితాపాంగ
వీక్షణుం డఖిలైకరక్షణుండు
శరణాగతత్రాణకరణాదరధురీణ
చరణాంబుజుండు శ్రీకరభుజుండు
తరుణారుణకిరీటభరణార్తరుచికూట
భాసురుండు పరాజితాసురుండు
[2]తరుణార్తజనతాపహరణాదరదురాప
కీర్తనుండు శుభప్రవర్తనుండు

గీ. పావనుండు భయార్తద్విపావనుండు
మాధవుండు బుధారామమాధవుండు
శ్రీధరుండు నవాంబుదశ్రీధరుండు
రాజగోపాలుఁ డీతఁ డో రాజవదన! 68

సీ. హృదయలక్ష్యవిభేదిమృదుసురభిళబాణు
నారీమనోహరణప్రవీణుఁ
బాకారినీలప్రపంచవంచకవర్ణు
లలితకళాజాలలబ్ధవర్ణు
నిక్షుకోదండశోభలక్షితనిజబాహుఁ
జారువల్లనరాజకీరవాహు
శుకపికశారికానికురుంబపరివారు
నంబుధివరతనయాకుమారు

1. లాంఛకర. 2. తరుణార్ధ.

గీ. సురభిసారథ్యశోభితసురభిపవన
రథనియోజితమకరవరధ్వజాగ్ర
విధుతివేపితవిభ్రాంతవిరహిజాతుఁ
జిత్తజాతు విలోకించు చిగురుఁబోణి! 69

—: ఉష కలలోఁగలసిన కాంతుని గనుఁగొనుట :—

వ. అనుచు వారివారి కులగుణస్థానపౌరుషంబులఁ దెలియఁబలుకుచుఁ జూపుతరి నయ్యుషాకన్యక సావధానంబుగా వినుచుఁ గ్రమంబున నవలోకింపుచు వచ్చివచ్చి తదనంతరంబ నిజమనోనయనానంద కరుండై ప్రకాశించు ననిరుద్ధు నభివీక్షించి సముత్ఫుల్లలోచనాంబుజయై విచిత్రతరనిజచిత్రరేఖయగు చిత్రరేఖం గనుంగొని.

క. ఈతనికులమును గుణము స
మాతతనిజబాహువిక్రమక్రమమును నీ
చాతుర్యమమరఁ బల్కుచుఁ
జేతోమోదంబుఁ గలుగఁ జేయుము చెలియా! 70

వ. అనినఁ జిత్రరేఖ యిట్లనియె.

సీ. ఏదేవుఁ డఖిలానురేశ్వరస్తవనీయ
మహనీయపాదాబ్జమహిమశాలి
యేదేవుఁ డవినీతహృదయభూరినిశాట
పటలభేదనబాహుపటిమశాలి
యేదేవుఁ డుజ్జ్వలహేమాచలోత్తుంగ
శృంగశృంగారకిరీటశాలి
యేదేవుఁ డబ్జసుహృత్కోటిభాస్వర
శుభనిజదేహవిస్ఫూర్తిశాలి

గీ. యట్టిశౌరికి మనుమండు దారబలుఁడు
పంచబాణాత్మభవుఁడు శోభనగుణప్ర
[1]సిద్ధుఁ డతివిక్రమకళాసమృద్ధుఁ డీతఁ
డవని ననిరుద్ధుఁ డనఁ గడు నతిశయిల్లు. 71

—: ఉష యనిరుద్ధుని దోడితెమ్మని చిత్రరేఖను వేఁడుట :—

వ. అనినఁ జిత్రరేఖకు నుషాకన్య యిట్లనియె.

క. మానిని! యీతఁడు వోనా
మానధనముఁ గొల్లలాడి మక్కువమీరం
గా ననుఁ గూడిన ప్రియుఁ డను
మాన మొకింతయును లేదు మది నూహింపన్. 72

ఆ.వె. అనుచు దనుజపుత్రి యాచిత్రరేఖతో
మనముఁ దెలియఁబల్కి మఱియు ననియెఁ
జెలియ! యింకఁ దామసించిన నెటులోర్తు
వేగ తోడితెమ్ము విభుని నిటకు. 73

వ. అనినఁ జిత్రరేఖ చిఱునవ్వుతో నయ్యుషాకన్యఁ జూచి యిట్లనియె.

ఉ. ఎవ్వరు? మెత్తు రీపలుకు లేణవిలోచన! చూడ నెంతయున్
దవ్వుల దుర్గమంబయిన తావున నుండెడువాని నొక్కనిన్
బువ్వులవిల్తుకేళిఁ గల మోదముమీరఁగఁ గూడి యాక్రియన్
నెవ్వగఁ జెంది యాపురుషు నీవిటఁ దెమ్మనిపల్కఁ దొప్పగన్. 74

వ. అని మఱియును.

---

1. సిద్ధుఁ డతివిక్రమకళాసమృద్ధుఁ డతఁడ
వని ననిరుద్ధుఁ డనఁగ గడు నతిశయిల్లు

సీ. అనిరుద్ధు నిటకుఁ దోడ్కొనివచ్చు టదియెంత
సులభంబుగాఁగను బలికెదమ్మ!
వనజాక్షి! యిటకుఁ బదినొకండువేల యో
జనములదవ్వెట్లు చనుదునమ్మ?
చని ద్వారకను జేరినను రక్షకు లుండ
నంతిపురం బెట్లు గాంతునమ్మ?
కాంచిన నచ్చటికామినుల్ గననెట్లు?
నీవిభుచెంగట నిలుతునమ్మ!

గీ. యింతయత్నంబు సేసి నే నిచటి కతనిఁ
దెచ్చినను బాణుఁ డెఱిఁగిన మచ్చరించు
శౌరి శోణితపురమును జేరవచ్చు
నతని గెల్వ నెవ్వరికి శక్యంబుగాదు. 75

గీ. అట్లుగావున నన్ను నిన్నసురవిభుని
నీవు రక్షింపఁ దలఁచిన నిట్టితలఁపుఁ
జెలియ! యిప్పుడు నాతోడఁ జెప్పవలదు
సాహ(సము)సేయఁ బాడియే చంద్రవదన! 76

వ. అనిన దానవకన్య వియోగజనితవేదానానితాంతదోదూయమానమానసయై కనురెప్పలం జిప్పిలు బాష్పకణంబు లనఘుంబుల నెగఁజిమ్ముచు దిట్టతనంబు వీడి యగ్గలంబుగ నిట్టూర్పువుచ్చుచు డగ్గుత్తికతోఁ జిత్రరేఖం జూచి యిట్లనియె.

క. మనమలరఁగ నీవల్లభు
వనితా! తోడ్కొనుచువత్తు వగవకు మని ప
ల్కిన నీవె మగుడ నివు డి
ట్లని పలికితి వింక నేమి? యనఁ గలదు చెలీ! 77

వ. అని మఱియును.

ఉ. పున్నమనాఁటిచందురునిఁబోలిన నాథుని నెమ్మొగంబు హ
ర్షోన్నతిఁ జూచికాని సరసోక్తులుఁ బల్కుచు వానిఁ గౌఁగిటన్
జెన్ను వహించికాని బహుచిత్రగతిన్ గుసుమాస్త్రకేళికన్
మన్ననఁ గాంచికాని యిఁక మానిని! ప్రాణము నిల్పనేర్తునే. 78

గీ. వేయిమాటలు నింకేల వెలఁది! నీవు
కావలె నటన్నఁ గార్యంబు కాకపోదు
నాదుప్రాణంబు నిలువుచందంబయేని
ప్రాణవిభుఁ దోడి తెమ్ము శీఘ్రంబుగాఁగ. 79

—: చిత్రరేఖ యనిరుద్ధుని దెచ్చుటకై ద్వారకాపురి కేఁగుట :—

వ. అనినఁ జిత్రరేఖ నిశాంతస్నేహాయత్తచిత్తయై యుత్తరలాక్షిం గనుంగొని.

సీ. ఘనమైనకార్యంబుగావున నీమనం
బరయుటకై యిటు లంటినమ్మ!
యెంతదవ్వైనను నేమి నేఁ గావలె
నన నిమిషంబునఁ జనఁగలేన
యెట్టికార్యంబైన నేనుండఁగా నీకు
సరసీరుహాక్షి! విచారమేల?
క్షణములో నిదె ద్వారకాపురంబును జేరి
యనిరుద్ధుఁ దెచ్చెద నతిజవమున

గీ. ననుచు నయ్యుషాకన్యను హర్షజలధి
నోలలాడించి నిజకళాలీలమెఱయ
నితరు లెఱుఁగకయుండ నదృశ్యయగుచు
గగనమార్గంబుఁ జెంది శీఘ్రమునఁ జనియె. 80

వ. ఇట్లు చనిచని,

సీ. శ్రీకరగోపురప్రాకారరుచిరంబు
        బహురత్నమయహర్మ్యభాసురంబు
కేతనదీవ్యన్నికేతననికరంబు
        సౌరిరూపప్రమదాకరంబు
భూరితురంగమవారణప్రకరంబు
        భవ్యతూర్యనినాదభాస్వరంబు
సమరసముద్భటసద్భటవిసరంబు
        సురుచిరాలంకారసుందరంబు

గీ. చారునిజపరిఘాయితసాగరంబు
మహితసంపత్పరాజితామరపురంబు
నూత్నమణిగణధారణీనూపురంబు
కాంచె నాచంద్రముఖి ద్వారకాపురంబు. 81

వ. ఇట్లు గాంచి యనిరుద్ధుం డొక్కనిపోవునదిగాఁ దదీయభవన సమీపంబున నూత్సౌకారంబున నిలిచి తాను కైతవంబునఁ బ్రద్యుమ్నసూనుఁ డొక్కని చనిన వనజలోచనుఁడు కోపించి తన్ను శపించు ననుతలంపున నొక్కింతఁ జింతింపుచుఁ దత్ప్రాంతంబున,

—: చిత్రరేఖ నారదమునీంద్రుని గాంచి యతనికి సకలవృత్తాంతముల నెఱింగించి తదనుమతిని బడయుట :—

క. అరవిందముకుళవిగళ
ద్ద్విరేఫఝుంకృతివినిద్రవిహగోత్కరముల్
పరిసరవిసృమరకేసర
పరిఫుల్లేందీవరమును బద్మాకరమున్. 82

వ. కని తత్తటాకమధ్యంబునందు,

శా. ఫుల్లాంభోరుహమిత్రు సుస్మితముఖాంభోజాతు నిందీవరో
ద్యల్లీలాకరగాత్రుఁ గౌస్తుభలసద్వక్షుఁ సువర్ణాంబరుఁ
ముల్లోకంబులు నేలు నా హరి హృదంభోజంబునం భక్తిసం
ధిల్లం ధ్యానముసేయు నారదముని న్వీక్షించి హర్షంబునన్, 83

వ. చేరవచ్చి తదీయచరణసరసీరుహాయుగళంబు సేవించి వినయా వనతవదనయై కరంబులు మొగిచి యున్న యయ్యంగనం గనుం గొని సకలతత్త్వకలనవిశారదుండగు నారదుం డాశీర్వదించి యో భామిని! నీవిటకు వచ్చిన కార్యం బేమని యడిగిన నయ్యింతి సంతసంబున నతని విలోకించి యోమునీంద్రా! శోణితపురా ధీశ్వరుండైన బాణాసురునిపుత్రి యుషాకన్య కాత్యాయనీవర ప్రభావంబున ననిరుద్ధు(నియందు) నత్యంతానురక్తయై యయ్యని రుద్ధుఁ దనవద్దికిం దోడితెమ్మనిన నప్పనిఁబూని యిచ్చటికి వచ్చితి నట్లన యనిరుద్ధుం దోడ్కొని యరిగెద,నికార్యంబు శ్రీకృష్ణుండు విని తనపయిఁ గోపించకుండునట్లుగాఁ గటాక్షింపు, మదియునుం గాక బాణుండు బాహుగర్వంబునం జేసి యనవరతంబు సంగ రంబుఁ గోరుచున్నవాఁడు గావునఁ గన్యాంతఃపురంబున నున్న యనిరుద్ధు నెఱింగి యావశ్యంబు యుద్ధసన్నద్ధుండై యతనిం గదియువచ్చు, నయ్యనిరుద్ధుండు బాలుండు గావున నతని జయిం చుటకు సమర్థుండు గాఁ డటుగనుక రేపకడ నీవృత్తాంతంబంతయు శౌరికిఁ దేటపడం బలుకవలయు ననిన నారదుం డెంతయు సంత సించి చిత్రరేఖం జూచి యిట్లనియె.

సీ. మానిని! యట్లన కానిమ్ము వెఱవకు
మనిరుద్ధుఁ దోడ్కొని యరుగు మిపుడు
కలహావలోకనకౌతూహలంబును
జనియించె నెంతయు మనసులోన

నాహవం బచట దైవాధీనమై కల్గె
నేని మమ్ముఁ దలంపు మేమఱకుము
క్షణములో నట వచ్చి రణకేళి వీక్షించి
మగుడి యెఱింగింతు మాధవునకు

గీ. దనుజమదభంగకరచక్రధారి శౌరి
శోణితపురంబుఁ గదిసినచోఁ ద్రినేత్రుఁ
డైన నెదిరించి యనిమొన నానఁగలఁడె
బాణుఁడును గీఁడన నేల? భయము నీకు. 84

చ. అనుటయుఁ జిత్రరేఖ మది నంతయు నట్లన కాఁదలంచి సం
జనితఘనప్రహర్షుఁడగు సంయమివర్యునిచే ననుజ్ఞఁ గై
కొని మఱియుఁ బ్రణామములుఁ గోర్కులుమీర నొనర్చి వేగమే
చని యల శౌరిమందిరముచాయ నభంబున నిల్చి వేడుకన్. 85

సీ. పంచరత్నంబులపనిహర్మ్యాలను జాల
బాగుమీరిన యొకపడకయింటఁ
గోమలైన యపరంజికోళ్ళమంచంబున
మేరువుపై నున్న మేఘ మనఁగ
శృంగారములకెల్ల శృంగారమై మించు
శ్రీరాజగోపాలశౌరి నపుడు
రుక్మిణిమొదలుగా రూఢికెక్కినయట్టి
కులసతుల్ పెక్కండ్రు కొలువుసేయఁ

గీ. జూచి సేవించి యెంతయు సోద్యమంది
జగతిఁగల మాయలెల్ల నీస్వామి యెఱుఁగు
నితని వంచించి యనిరుద్ధు నెత్తికొనుచు
నేఁ బురముఁ జేరఁగ నుపాయ మెద్ది? యనుచు. 86

క. తడవాయు వచ్చి యిట కా
పడఁతుక నన్నెట్లు దూఱివలుకునొ! యనుచున్
జడధారిణి మదిఁ దలఁపుచుఁ
దడయక యనిరుద్ధు దెచ్చుతలఁపున నరిగెన్ 87

—: చిత్రరేఖ యనిరుద్ధుని దోడ్కొని చనుట :—

వ. ఇట్లరుగు సమయంబున.

సీ. మణిసౌధరుచిజాలమహిమచే మిక్కిలి
నందమౌ బలభద్రుమందిరంబు
భద్రేభజవనాశ్వభటసమూహంబుల
దనరారుచున్న సాత్యకిగృహంబు
తతనృత్తగీతవాద్యవిశేషములచేత
భాసిల్లు ప్రద్యుమ్నభవనసీమ
లక్షణాన్వితమయి లక్ష్మిచే నెంతయు
డంబుమీరినయట్టి సాంబునగరు

గీ. చారుదేష్ణను దేష్ణసుచారుభాను
భద్రచారుసంగ్రామజిద్భానువింద
ముఖ్యహరిసూనువరగేహములను వేడ్కఁ
జెలఁగఁ గనుఁగొంచు వచ్చి యాచిత్రరేఖ. 88

సీ. గమకంబులైన బంగారుకంబంబులు
గొప్పలౌ విద్రుమకుట్టిమములు
మగరాలనిగరాల మలచినతిన్నెలుఁ
దులలేని వైడూర్యతోరణములు

మరకతమాణిక్యమయములౌ మేడలు
నుప్పరం బంటిన చప్పరములు
నెమ్మిగుంపులసొంపు నెలవైన వలభులు
హాతువులుమీఱు గవాక్షములును

గీ. గలిగి మల్లెడ సౌరభకలితసుమమ
మాలికాలంకృతంబును మహితగంధ
గంధసారసిక్తంబునై ఘనతగాంచు
నట్టి యనిరుద్ధుకేళీగృహంబుఁ గాంచి. 89

వ. అందు.

సీ. పడఁతి యొక్కతె హాడపంబు బాగుగఁ బూని
మక్కువమీఱంగ మణుపు లొసఁగఁ
గలికి యొక్కతె కరకంకణక్వణనముల్
పరిఢవిల్లఁగ జీవిసురఁటి విసరఁ
గమలాక్షి యొక్కతె గంధోదకంబులు
నించిన గిండి ధరించి నిలువ
రమణి యొక్కతె బహురాగభేదంబుల
నింపుగా వీణె వాయింపుచుండ

గీ. మఱియు గొందఱువనితలు మమతతోడఁ
దనదుచుట్టును గొల్వంగ ఘనతమీఱి
సరససల్లాపములఁ బొద్దు జరపుచుండు
నట్టి యానిరుద్ధుఁ గనుఁగొని యాత్మలోన. 90

క. వనితాజనపరివృతు నీ
యనిరుద్ధుని నెవ్విధమున ? నటఁ దోడ్కొనిపో
ననువగు నని చింతింపుచుఁ
దనతామసవిద్యపేర్మి తనరఁగ మిగులన్. 91

క. ముచ్చువగమీఱ నచ్చెలి
యచ్చటిసతు లెఱుఁగకుండునట్లుగ వేగన్
బచ్చవిలుకాని తనయుని
వచ్చెదవుగఁ దోడితెచ్చు నాసమయమునన్. 92

—: అనిరుద్ధుని దోడ్కొనివచ్చుటకై చనిన చిత్రరేఖ
రాకయున్నందులకు నుష చింతించుట :—

క. అనిరుద్ధునిఁ దోడ్కొని యిదె
వనితామణి చిత్రరేఖ వచ్చు నటంచున్
దనరెడు చెలిమిని బాణుని
తనుజన్ గై సేయునట్టి తలఁపమరంగన్. 93

* సీ. పన్నీటిచేతను బాగుమీఱఁగ నంత
జలకంబు లాడించె సకియ యొకతె
పోసఁగంగ నవరత్నభూషణావళులచే
నెలమి శృంగారించెఁ జెలియ యొకతె

గీ. విదియచందురుమించిన వెలఁదినుదుటఁ
దిలక మొప్పఁగఁ దీర్చెను గలికి యొకతె
తీరుమీఱఁగఁ బాపటఁ దీర్చి చెలికిఁ
గొప్పు సవరించె నొప్పుగఁ గొమ్మ యొకతె.* 94

వ. అంత.

సీ. ప్రతిలేని పసిఁడిచప్పరవుమంచంబునఁ
బరఁగు కుంకుమపూలపఱపుఁ బఱచి
కళుకునూర్యపటంబుతలగడ లమరించి
బాగైన సకినలబటువు లుంచి

* ఈ పద్యమున సీసపాదములు రెండు మాత్రమే యున్నవి.

కలువడంబులుగల కలువడంబులు గట్టి
 రాణించు బుర్నాకురాడ మునిచి
సామ్రాణిధూపవాసనలను నెరయించి
 రమణీయరత్నదీపములు నిల్పి

గీ. పొసఁగఁ దెలనాకు కవిరెలు పోఁకముల్లు.
పచ్చకపురంబు జవ్వాది మెచ్చువిరులు
మీరిపలికెడు బకదారిపారువములు
నందముగ నించి రాక కేళిమందిరమున. 95

క. చెలు లిటువలెఁ గైసేయఁగఁ
బొలఁతుక నవశయ్య నుండి పురుషుని మదిలోఁ
దలఁచుచు మదనునిగాసికి
నులుకుచు నిట్లనుచుఁ బలికె నువిదలతోడన్. 96

సీ. తనచెల్మి నెంచి యిత్తరి ద్వారకాపురిఁ
 జేరునో! చేరదో! చిత్రరేఖ
పౌరి నలంగముచుట్టుఁ దిరుగుయామికులచేఁ
 గూడునో! కూడదో! కోటఁ జొరఁగ
నవరంగజాల లింతకు బీగముద్రలు
 సేతురో! మఱపున సేయకుంద్రొ!
నెమ్మది నాప్తులు నిదురించుసమయంబు
 కలుగునో! కలుగదో! కమలముఖికి

గీ. సకలమర్మంబు లెఱిఁగిన స్వామిగాన
తనమనుమనిఁ దోడ్కొనిపోవు తలఁపెఱింగి
ద్వారకాపురి నెవ్వరుఁ జేరకుండ
భద్రపఱచిన భామ యేపగిదిఁ దెచ్చు? 97

క. అని పలుకి నుషాకన్యక జూచి నెచ్చెలు లిట్లనిరి.

సీ. ఆచిత్రరేఖ దా నఖిలలోకంబులఁ
బొలుపుమీఱుచు నున్న పురుషవరుల
భావంబులెల్లను బటమున వ్రాసిన
[1]మహిమ నెఱుంగవా మగువ! నీవు
మహిలోనఁ గల్గిన మాయావిశేషముల్
దంద్రించి నేర్చె నాతలిరుఁబోఁణి
మన్ననమీఱ నీమగనిఁ దోడ్కొనివచ్చుఁ
గలకంఠిరో! నీవు కలఁగకమ్మ!

గీ. ముజ్జగంబులఁ గల్గిన ముగిత లెల్లఁ
జిత్రరేఖకు నెనరె విచిత్రమహిమ
నేవిధంబుననైన నాయిందువదన
వేడుకలుమీఱ ననిరుద్ధుఁ దోడితెచ్చు. 98

—: చిత్రరేఖ యనిరుద్ధుని నుషవద్దికి జేర్చుట :—

వ. అని యూఱడించు సమయంబున

సీ. వాయుతనూజుండు వాయువేగంబున
సంజీవనిం దెచ్చుచందమునను
వినతాతనూజుండు వేడుకమీఱంగ
నమృతంబు దెచ్చినయందమునను
నల్ల భగీరథుం డాత్మ నుప్పొంగుచు
నమరనదిం దెచ్చునట్టిలీలఁ
జెలువఁబువెలయంగ శ్రీరాజమన్నారు
పారిజాతముఁ దెచ్చుభావమునను

1. మయిమెఱుంగవా.

గీ. సత్యవతిని భీష్ముఁడు దెచ్చుసరవి మెఱయఁ
గుండలము లుదంకుఁడు దెచ్చుకూర్మి నెరయ
సమరసౌగంధికంబుల ననిలజుండు
దెచ్చుకైవడి ననిరుద్ధుఁ దెచ్చె వేగ. 99

క. ఈకైవడి ననిరుద్ధునిఁ
బ్రాకటముగఁ దెచ్చి నిల్పి పానుపుమీఁదన్
రాకేందుముఖులు మెచ్చఁగ
నాకలికిన్ జూచి పలికె హర్షముతోడన్. 100

క. వనజాతనేత్ర ! కనుఁగొను
మనిరుద్ధు మహాప్రసిద్ధు నంబుజనేత్రున్
గనకనిభగాత్రు మురభిం
జనపౌత్రుని మదనపుత్రు సద్గుణపాత్రున్. 101

క. చెలువునిఁ దెచ్చితి నీతోఁ
బలికిన యటువంటి నాదుపంతము జెల్లన్
నెలయును రోహిణియుం బలె
నలివేణీ ! విభునిఁ గూడి సులరుము వేడ్కన్. 102

వ. అనిన నచ్చెలిం జూచి యచ్చిగురుఁబోఁడి యిట్లనియె.

సీ. నిఖిలలోకంబుల నీవంటి నేర్పరిఁ
గని విని యెఱుఁగనే కంబుకంఠి !
కలలోనఁ గలసిన కాంతునిఁ దెమ్మన్న
క్షణములోఁ దెచ్చితి చంద్రవదన !
కందర్పుచేతను గాసిఁజెందిననాఁడు
ప్రాణంబు నిలిపితే పద్మగంధి !
ధర నెంతవారికిఁ దలఁచఁ గూడనియట్టి
తలఁపు లీడేర్చితే తలిరుఁబోఁడి !

గీ. కలికి ! నీవు చేసిన యుపకారమునకు
నిపుడు ప్రత్యుపకారంబు లేమి సేతు ?
ననుచు సొమ్ములుఁ గోకలు నతివ కొసఁగి
కదిసి కౌఁగిటఁ జేర్చెను గారవమున. 103

క. శ్రీరఘునాథసుధాంబుధి
కైరవిణీమిత్ర ! సకలకవినుతపాత్రా !
భూరిభుజాబలనిర్జిత
వైరిజనస్తోమ ! విపులవైభవధామా ! 104

క. చెంగమలేశపదాంబుజ
[1]సంగస్ఫురితాంతరంగ ! సదయాపాంగా !
సంగీతసాహితీప్రియ !
సంగరకౌంతేయ ! సకలసజ్జనగేయా ! 105

—: ద్రుతవిళంబితవృత్తం :—

సుజనరక్షణశోభనవీక్షణా !
విజయకారణవిశ్రుతవారణా !
విజయ శాత్రవవీరమహాహవా !
విజయరాఘవ ! విక్రమభార్గవా ! 106

గద్య. ఇది శ్రీమద్రాజగోపాలకరుణాకటాక్షవీక్షణానుక్షణప్రవర్ధమాన సారసారస్వతధురీణయు విచిత్రతరపత్రికాశతలిఖితవాచికార్థావగాహనప్రవీణయు తత్ప్రతిపత్రికాశతస్వహస్తలేఖనప్రశస్తకీర్తియు శృంగారరసతరంగితపదకవిత్వమహనీయమతిస్ఫూర్తియు అతులితాష్టభాషాకవితాసర్వంకషమనీషావిశేషశారదయు రాజనీతి

1. సంగి.

విద్యావిశారదయు విజయరాఘవమహీపాలవిరచితకనకాభిషేకయు విద్వత్కవిజనస్తవనీయవివేకయు మన్నారుదాసవిలాసనామకమహాప్రబంధనిబంధనకృతలక్షణయు మహనీయరామాయణభాగవతభారతకథాసంగ్రహణవిచక్షణయు పసుపులేటి వెంకటాద్రిబహుజన్మతపఃఫలంబును మంగమాంబాగర్భశుక్తి ముక్తాఫలంబును రంగద్గుణకదంబయు నగు రంగాజమ్మ వచనరచనాచమత్కృతిం జెన్నుమీఱు ఉషాపరిణయంబను మహాప్రబంధంబునందుఁ ద్వితీయాశ్వాసము.

—: శ్రీరాజగోపాలాయనమః :—

శ్రీ రాజగోపాలాయనమః

ఉషాపరిణయము

(పద్యకావ్యము)

తృతీయాశ్వాసము

క. శ్రీరాజ[1]గోపహరిచర
ణారాధనసావధాన ! యర్థినిధానా !
వీరారిమదవిజృంభణ
వారణ ! శ్రీవిజయరాఘవక్ష్మారమణా ! 1

వ. అవధరింపుము.

—: చిత్రరేఖ యనిరుద్ధుని వర్ణించుట :—

క. ఇవ్విధమున లాలించిన
జవ్వని గనుఁగొనుచు మిగులసంభ్రమ మొప్పన్
నివ్వాటిలు ప్రేమతోడను
బువ్విలుతుని సుతునిఁ జూపి పొలఁతుక యనియెన్. 2

సీ. ఇందుబింబముతోడ నెనవచ్చు నీతని
నెమ్మోముఁ జూడు మిందీవరాక్షి !
భానుసమానుఁడై భాసిల్లు నీతని
తేజంబుఁ జూడు మంభోజనేత్ర !

1. గోపాల

చక్కెర లొల్కెడు చక్కని యాతని
కెమ్మోవిఁ జూడుము కీరవాణి !
పండువెన్నెలచాయ భాసిల్లు నీతని
కెలునవ్వుఁ జూడు చకోరనయన !

గీ. యరులపై బాణవర్షముల్ కురియుకతన
జ్యాకిణాంకితమించు బాహాయుగంబుఁ
బరులతల మెట్టు మృదు[1]పాదపంకజముల
భామ ! వీక్షింపు కన్నులపండువుగను. 3

వ. అని పల్కుచున్న సమయంబున.

—: అనిరుద్ధుఁడు కలఁగని మేల్కని యాశ్చర్యపడుట :—

సీ. అందంబుమీరంగ నలివేణి యొక్కతె
యెలమిఁ దోడ్కొనివచ్చి యింపుమీరు
బంగారుమేడలో బాగుగా పావనించు
పువ్వులపాన్పుపైఁ బొసఁగ నుంచ
మెఱుఁగుదీఁగెనుబోలు మృగనేత్ర యొక్కతె
శయ్యపైఁ గూర్చుండి నెయ్యమమరఁ
జక్కెర మోవాని సరసంబు మీరఁగాఁ
బుక్కిటివిడె మిచ్చి బుజ్జగించి

గీ. తలిరువిలుకాని కేళిని దనివిదీరఁ
గలసినట్లుండఁ గలఁ గని కాంతతోడ
బాళి నయ్యనిరుద్ధుండు మేలుకాంచి
యెదుట నిలుచున్న చక్కనియింతిఁ జూచె. 4

1. బార

వ. మఱియును.

చ. చెలువగు హేమసౌధమున చిత్రపటంబుల నెమ్మిగుంపులన్
చిలుకలపంజరంబులను జెల్వుగఁ బల్కెడు పావురంబులన్
బలుమరు వ్రాయ నందియలు ప్రాంతమునన్ జెరియించునంచలన్
గలయఁగఁ జూచె నచ్చెరువు గ్రమ్మఁగ సారెకు నెమ్మనంబునన్.

సీ. త్రిజగంబునను గల్గు తేజోనిధుల నెల్ల
బాగుగా వ్రాసిన పటమునందు
భలభద్రుఁడును శౌరి ప్రద్యుమ్నుఁడును దాను
మహినిఁ బ్రసిద్ధులౌ మనుజపతులు
మఱియొక్క పటమున మందరగిరిలీల
మిక్కిలిఁ బొడవైన మేనుఁగల్గి
వేయికరంబుల వివిధాస్త్రములుఁ బూని
సురులు గెల్వఁగనున్న శూరుఁడొకఁడు

గీ. చెలఁగుచుండఁగఁ జూచి యచ్చెరువుఁజెంది
మనుజవర్యుల దనుజుల మహిమమీరు
సురల నీక్రియ వ్రాయుంగ సోద్య మయ్యె
నెవ్వనిదొకాని యీసౌధ మెంతవింత! 6

వ. అని వితర్కింపుచు.

ఉ. ద్వారకలోన నానగరతామరసాక్షులు కొల్వఁ జుట్టులన్
గోరిక నున్న నేనవుర! గోప్యముగా నిట కెట్లు వచ్చితిన్
వీరలఁ జూడ నామదికి వింతయి తోఁచె నిదేమి చోద్యమో!
యారయ స్వప్నమో! నిజమొ! యక్కట! భ్రాంతియొ!
యంచు నెంచుచున్, 7

క. కలఁ గనెడువారు లేరా
కల యెవ్వరికైన నిజముగా నీకరణిన్
దెలియన్ ముందఱఁ దోఁచు నని
పలుకఁగ యిది వింత యనుచు భావములోనన్. 8

క. ఎవ్వరితోడం బలుకుదు ?
నెవ్వరు ? తను నెఱుఁగువార లిందఱిలోనన్
జవ్వనులఁ జేరఁబిల్చిన
నవ్వుచుఁ దొలఁగుదురా ! లేక నను జేదురో ! 9

క. నెయ్యముఁ జేసి ప్రసంగము
దియ్యుచు నీకార్యమెల్ల దెలియుద మని తా
నొయ్యారమమర నప్పుడు
కయ్యను గూర్చుండి మిగుల సరసంబమరన్. 10

—: ఉషానిరుద్ధులు పరస్పర సౌందర్యము గని పరవశులగుట :—

సీ. చెలులు చుట్టును గొల్వఁ జిరురాకువిల్కాని
 మోహనాస్త్రంబన మురువుమీరి
సిగ్గుచేఁ దల వంచి చిరునవ్వు నవ్వుచుఁ
 గ్రేగంటఁ దనుజూచు కీరవాణిఁ
బసిఁడిసలాకతోఁ బ్రతివచ్చు నెమ్మేని
 కాంతులు దిక్కులఁ గలయఁబర్వ
మిక్కిలిప్రేమచే మేను చెమర్పంగఁ
 దనలోన రతిఁగూడఁ దలఁచుదాని

గీ. బాణసుతఁ జూచి యెంతయు భావమలర
నడుగవచ్చిన కార్యంబు నపుడు మఱచి
మరుని మాయలచేఁ జిక్కి మదనసూనుఁ
డెలమిఁ దలయూఁచి సొక్కుచు నింపుమీర. 11

సీ. నెరివెంట్రుకలకప్పు దొరయు నీచెలికొప్పు
నీలమేఘముతీరు లీలఁ గేరు
కాంతుల వాటంబు కాంతలలాటంబు
విదియచందురుకొవ్వు వేగ నవ్వు
నమృతంబునకు దీవియైన యీసకిమోవి
పగడంబులను బొల్చు బాగు గెల్చు
కలువరేకులనేలు కలికికన్నులడాలు
నిడువాలుగలసంచు నీట ముంచు

గీ. వెలఁదికనుబొమ లతనుని విండ్లకొమలు
చంపకశ్రీల వెన్నాస చాననాస
చెనకుఁ జిందంబులకులంబుఁ జెలిగళంబు
పంచదారలుఁ గుల్కు నీభామపల్కు. 12

సీ. తామరతూడులఁ దరమిడి నిరసించు
కొమ్మభుజంబులకొమరు భళిర!
బంగారుకుండల బాగెంత లేదను
కువలయలోచనకుచము లవుర!
కేసరిమధ్యంబు గేలిసేయుఁగఁ జాలు
గజరాజగామినికౌనుమేలు
కందర్పునసిధారఁ గడకుఁ ద్రోయఁగ నెంచు
మెలఁతనూఁగారును మెచ్చవచ్చు

గీ. సైకతంబుల గెల్చును జానజఘన
మరఁటికంబంబుల నదల్చు నతివతొడలు
కమలగర్భంబులను గెల్చుఁ గలికిజంఘ
లబ్జముల నవ్వు నీయింతియడుగు లెంచ. 13

క. కుందకయుండఁగఁ గరముల
నిందుముఖీ బ్రహ్మయెట్లు సృజియించె నొకో!
యందంబు వొగడఁ దరమా!
కందర్పుని రాజ్యలక్ష్మికై వడి సమరీ. 14

సీ. రెప్పవేయక నేను దప్పక చూచితే
తరుణిమోమున దృష్టి తాఁకు నొక్కొ!
ముచ్చటదీరనే మొనపంట నొక్కితే
కమలాక్షికెమ్మోవి కందు నొక్కొ!
కోరికమీర నేఁ గొనగోట మీటితే
పణఁతిగుబ్బ లపుడె పగులు నొక్కొ!
పచ్చవిల్తునికేళి బాళి నేఁ గూడితే
బాలికనెమ్మేను బడలు నొక్కొ!

గీ. అట్లుగావునఁ బూర్ణశశాంకవదన
బాగుమీరినయట్టి యీపల్లవోష్ఠి
కాంతులును జాలఁ జెలువొందు కలికికుచకు
నీలతాంగినిఁ గూడుట యెట్టు లొక్కొ! 15

సీ. శౌరిని సేవింప జంభారి యేతేరఁ
గనుఁగొంటి రంభాదికామినులను
శ్రీకృష్ణు సేవింపఁ జిత్రరథుండు రాఁ
గనుఁగొంటి గంధర్వకన్యకలను
జలజాక్షుఁ బూజింప నలకుబేరుఁడు రాఁగఁ
గనుఁగొంటిఁ గిన్నరవనజముఖుల
హరిఁ జూడ సకలదేశాధీశ్వరులు రాఁగఁ
గనుఁగొంటి మనుజశృంగారవతులఁ

గీ. గలదె దీనియొయ్యార మేకాంతలకును
జూడ మిటువంటిచెలువ మేసుదతులందు
బ్రహ్మ యెట్లు నిర్మించె నీపద్మముఖిని
నెంత యని సన్నుతింతు నీయింతిసొగను. 16

వ. అని యనిరుద్ధుఁడు తనమనంబున వితర్కించు సమయంబున

క. అనిరుద్ధుని సౌందర్యము
వనితామణి చూచి మిగుల వాంఛలుమీరన్
మనమున నోద్యం బందుచు
వినుతించెను వానిసొగసు వేడుకమీరన్. 17

సీ. సకలంకమైనట్టి చంద్రబింబము వీని
వదనంబుతో సాటివచ్చు టెట్లు ?
కేదొల్ల ముకుళించు తోయజంబులు వీని
కన్నులసామ్యంబుఁ గాంచు టెట్లు ?
పగతురఁ గని పారు ఫణిరాజములు వీని
భుజములపోలికఁ బొందు టెట్లు ?
అమితటంకవిభేద్య మగుకవాటము వీని
వక్షంబునకు సరివచ్చు టెట్లు ?

గీ. యింతచక్కనివాని నే నెందుఁ జూడ
వీనిఁ జూడంగఁ జూడంగ వేడుకయ్యె
వేయికన్నులు గలిగిన వీనిసొగసుఁ
గలయ వీక్షింతు నామదికాంక్షదీర. 18

ఉ. నిద్దుర లేచియు న్మిగులనేర్పున రమ్మని నన్ను వీఁడు తా
నొద్దికఁ జేరఁదీయక నె యూరక యుండుట కేమి హేతువో !
తద్దయు ద్వారకాపురము తామరసాక్షులఁ జూచు వీని కా
నిద్దపురూపులున్ మిగులనేర్పులు లేవి తెలంగ ! నామొదన్. 19

—: మన్మథుఁ డుషానిరుద్ధుల మోహపరవశులఁ జేయుట :—

వ. అని తలంచు నయ్యవసరంబున

చ. ఉదుటగు చిల్క తేజిపయి నుద్ధతిమీఱఁగ వచ్చి నిల్చి తా
నెదురుగఁ దేఁటినారి మొరయింపుచుఁ బువ్వులవింటి వారలన్
గదిసి ప్రసూనవర్షములు గాఢముగా వరుషించె నెంచఁగా
మదనుఁడు బంచబాణుఁ డనుమాట నిజంబగునే తలంపఁగన్.

క. తనయునిమీఁదనే దాడిగ
జనకుండట వచ్చెనన్న సమ్మతి యగునే
యని గలదు బాణుతో నని
తనబలములఁ గూడి వచ్చెఁ దథ్యం బరయన్. 21

చ. అల విరివింటిశాయలు సహాయత వచ్చిన వచ్చుఁగాని తా
బలువిడి వారిపైఁ గుసుమబాణము లేయుట యేమి యంటివా
యలరఁగఁ దద్వివాహసమయంబున కచ్చుగ వచ్చి పూలచేఁ
జెలువుగ వారికిద్దఱికి సేసలుఁబెట్టుట యే నిజంబగున్. 22

వ. ఇవ్విధంబున.

సీ. పచ్చవిల్తుఁడు వాఁడిబాణంబు లేయఁగా
నాయుష యిట్లను నాత్మలోనఁ
గలలోనఁ గలయు నీకందర్పతనయునిఁ
దోడితెమ్మని చాల వేఁడుకోనఁగ
ద్వారకాపురిఁ జేరి తరలాక్షి నామీఁది
నెనరున నిటుదెచ్చె నేర్పు మెఱసి
యేమిసేయుదు నీతఁ డింతి రమ్మని పిల్చి
గారవించడు మదిశాఁకదీరఁ

గీ. ప్రియుఁడె తను జేర రమ్మని ప్రేమమీర
గారవించిన మిక్కిలి ఘనతగాని
బలిమిచేఁ జేరఁబోయినఁ జులుకగాదె!
వలపు దాఁచెద నంటినా వశముగాదు. 23

—: అనిరుద్ధుఁడు చిత్రరేఖను వివరముల నడుగుట, చిత్రరేఖ యనిరుద్ధునికి సకలము చెప్పుట :—

వ. అని వితర్కించు సమయంబున.

క. ననవింటివానిగాసికి
మనమునఁ దాళంగలేక మమతలు హెచ్చన్
వనజాక్షి నొకతెఁ గనుఁగొని
యనిరుద్ధుం డిట్టు లనియె నందముగాఁగన్. 24

క. ఎవ్వతె యీబాలామణి?
యెవ్వరి దీకనకసౌధ? మిది యేనగరం?
బెవ్వరివారలు మీరలు?
జవ్వని! తెలుపంగవలయు సత్యముగాఁగన్. 25

వ. అనిపల్కిన యనిరుద్ధుం జేరవచ్చి చిత్రరేఖ యిట్లనియె.

సీ. ఇది శోణపురమందు రిందుకు నాథుండు
ప్రహ్లాదవంశుండు బాణుఁ డరయ
నల బాణుపుత్త్రి యీయువతిలమేల్బంతి
"ఉష" యనువిఖ్యాతి నొప్పుమీరు
నిచట నుండెడువార మిందఱ మీయింతి
చెలులము నాపేరు చిత్రరేఖ
కలలోన నిను గూడి కాముని గాసిచే
నీకాంత నను వేఁడ నెలమితోడ

గీ. ముజ్జగంబులఁ గలవారి మూర్తు లెల్లఁ
బటమునను వ్రాసి చూప నీభామ ప్రేమ
నీదురూపంబు రేఖయు నెమ్మిఁ జూచి
నిన్ను దోడ్కొనిరమ్మన్న నేర్పుమీర. 26

ఉ. ద్వారక కేగి యాపురమువారలు నన్ గనకుండునట్లుగా
సారెకు మాయఁగప్పి యల శౌరినివాసమునున్నగాఁగ మీ
వారినగళ్లలో వెదకి వైణికవరానియనుగ్రహంబున
స్వైరము తోడి తెచ్చితిని నిన్నిటకున్ మకరాంకనందనా! 27

మ. చెలిమిన్ లక్ష్మిని జోడుఁగూడి హరి డాఁజెన్నొందు చందంబునన్
బలుకుం దొయ్యలిఁ గూడి బ్రహ్మ కడుఁబ్రేమన్ మీఱు ఖా
గొప్పఁగా
నల పౌలోమినిఁగూడి వాసవుఁడు నెయ్యంబొప్ప వర్ధిల్లు న
ట్లెలమిన్ భామిని నీవు గూడి పదివేలేండ్లుండుమీ యిద్ధరన్. 28

కం. అని పల్కిన చెలిమాటలు
విని యావలరాజసుతుఁడు వేడుకమీఱన్
దనమనసు డాఁచ కప్పుడు
ననఁబోఁడిమొగంబుఁ జూచి నవ్వుచుఁ బల్కెన్. 29

సీ. బాణనందనకును బ్రాణపదంబైన
సకియవుగావున సరవిమీర
భావింప మాకును బ్రాణపదంబైన
దానవు నీకును దాఁచనేల
కలలోనఁ గూడిన కాంతయే నీకును
నిల్లా లగు నటంచు నెలమి మున్ను
ముక్కంటిసతి పల్కె ముదమున ననుఁజూచి
నెలఁత! నే నిప్పుడు నిదురబోవ

గీ. నిచ్చటికి నీవు నను దోడి తెచ్చినట్లు
వేడుకను నన్ను నీయువ గూడినట్లు
మేలుగలయట్టి కలఁ గని మేలుకనుచు
నిజముగా నిన్నుఁ జూచితి నీరజాక్షి ! 30

వ. అనిన ననిరుద్ధునిఁ జూచి చిత్రరేఖ యిట్లనియె.

క. రమణుల నెందఱినైనను
రమణీయత నేలుకొన్న రసికుఁడవుగదా !
తమితోడుత మాచెలి నిపు
డమరఁగ రతి నేలుకోర యతనుకుమారా ! 31

క. అని యొకపని నెపమున న
[1]య్యనుఁగు చెలియ చెలులతోడ నావలి కేగన్
వినమితముఖియా నుషఁ గని
యనిరుద్ధుం డపుడు మందహాసము మీఱన్. 32

—: అనిరుద్ధుఁ డుషను గాంధర్వమున వివాహమాడుట :—
సంభోగశృంగారము

క. మనకోరిక లీడేరెను
వనితామణి ! రమ్మటంచు వాంఛలు మీఱన్
దనరెడు గాంధర్వంబునఁ
దనకరమున నింతికరముఁ దడయక పట్టెన్. 33

సీ. చేరంగ రమ్మని చేపట్టి తీసినఁ
జిరునవ్వు నవ్వుచుఁ జే విడల్చుఁ
బయ్యెదఁ దొలఁగించి బటువుగుబ్బలఁ [2]బట్టు
మాటికిఁ జనుదోయి మఱుఁగు సేయు

1. య్యనుఁగు చెలిచెలులతోడ నావలికేఁగన్
2. పట్టి

మోము మోమునఁ జేర్చి ముద్దుపెట్టఁగ రాఁగ
మురిపెంపు సిగ్గుతో మోముఁ ద్రిప్పఁ
బ్రేమంబుమీరఁగ బిగువుగౌఁగిటఁ జేర్ప
లజ్జచేఁ బతికేలు లలినిఁ ద్రోయుఁ

గీ. కోఁకముడి వదలింపఁగఁ గొంకముగను
ముడి సడల్పంగనీయక ముదిత పెనఁగుఁ
గాముకేళికిఁ దమితోడఁ గలయరాఁగ
గోల నలుదిక్కులను జూచుఁ గొంకుమిగుల. 34

వ. అయ్యవసరంబున.

సీ. ముచ్చటదీరఁగ ముద్దుబెట్టవె చేరి
మోమేల త్రిప్పెద ముద్దుగుమ్మ!
వీనుల నమృతంబు వెదచల్లునట్లుగా
మాటలాడ వదేమి మచ్చకంటి!
మరుకాఁకదీరంగ మమతలు హెచ్చంగఁ
[1]గౌఁగిలింపవె నన్ను కలువకంటి!
యక్కునఁ గదియించి యారిదంపుచుఁ బ్రేమఁ
బుక్కిటివిడె మీవె పువ్వుఁబోణి!

గీ. భామ! మొక్కెద నే నీదు పదములకును
మనవు లాలించి యేలవే మందగమన!
చాలదయఁ జూడవే నన్ను నన్నుతాంగి!
రతుల నన్నేలవే లీల రాజవదన! 35

---

1. కౌఁగిలింపఁగ

క. అని లాలింపుచు నయ్యుష
ననిరుద్ధుఁడు చేరఁదీసి యందముగాఁగన్
దనతొడలమీఁద నుంచుక
వనితామణిమేను నిమిరి వలపమరంగన్. 36

సీ. కుంకుమఁ బూసెదఁ బొంకంబుగా నని
కులుకుసిబ్బపుగబ్బిగుబ్బ లంటి
తీరుగాఁ గస్తూరి దిద్దెద ననుచును
దీటైన చెక్కిలి గోట జీరి
వుక్కిటిపీడెంబుఁ బొసఁగ నిచ్చెద నని
ముచ్చటదీరఁగ మోవి యాని
నీటుగాఁ గుచ్చెలనెఱిక దిద్దెద నని
మురువుమీరిన పోఁకముడి వదల్చి

గీ. మేను నిమిరెడుకై వడి మించువేడ్కఁ
గదిసి కళలంటి సొక్కించి గారవించి
కాఁకదీరఁగఁ గౌఁగిటఁ గదియ జేర్చి
సిగ్గుఁదొలగించె నప్పు డాచెలువ కతఁడు. 37

క. గిలిగింత లిడుచు మిగులన్
గలరవములు మించునట్టి గళరవములఁ దా
వలపులుగులుకఁగఁ బలుకుచు
జలజాక్షిని రతులఁ గూడి సంతసమమరన్. 38

సీ. బాలిక బడలిన భావంబుఁ గనుఁగొని
ముదముతో విభుఁ డిచ్చె మోవితేనె
శీతాంశుముఖమేనఁ జిరుజెమటలుఁ జూచి
చెలువుండు దుప్పటిచేత నొత్తె

మదిరాక్షి ముంగురుల్ చెదరిన వీక్షించి
పతి గోరులను దువ్వె బాగుమీఱ
జలజాక్షి నుదుటను జాఱిన తిలకంబు
రాణించఁగా దిద్దెఁ బ్రాణవిభుఁడు

గీ. మొలఁత యుపరతులను జాల నలసియున్నఁ
దొయ్యలిపదంబు లప్పుడు తొడల నుంచి
నెయ్య మమరంగ నొత్తుచు నెనరుమీఱ
నచ్యుతునిమన్మఁ డీలీల నాదరించె. 39

వ. అంత.

చ. మనసిజకేళిఁ దాను పతి మక్కువమీఱఁగఁ గూడియుండుటల్
ఘనమగునట్టి మానికపుకంబమునన్ గనుపట్టుచుండఁగాఁ
దనచెలువుండు వేరె యొకతామరసాక్షినిఁ గూడె నంచు వే
కనుఁగొనుచున్ బరాఙ్ముఖతఁ గాంచెను ముగ్ధలుగారె మానినుల్.

—: విప్రలంభశృంగారము :—

వ. అంత.

క. జవ్వని నేరము లేకనె
యివ్విగ నలుగంగ హేతువేమీ? యనుచున్
నివ్వెఱగందుచు మదిలో
నవ్వలిమోమయ్యె నప్పు డనిరుద్ధుండున్. 41

క. ఇరువురు నీక్రియ నుండఁగ
మరుఁ డప్పుడు చేరి మిగుల మమతలు హెచ్చన్
దురుసైన తుంటవింటను
విరి గోల(ను) నేసి యార్చె వేగముగాఁగన్. 42

వ. ఇవ్విధంబున బాణపరంపరలు నించు మించువిల్కాని వేఁడికిఁ
దాళఁజాలక యాబాణపుత్రిక తనలోఁ దా నిట్లనియె.

సీ. కలలోనఁ గూడిన కాంతునిఁ దెమ్మని
చిత్రరేఖను వేఁడ (చిత్ర)గతిని
నీతనిఁ దోడ్తెచ్చి యెలమితో నను గూర్పఁ
గంతుని కేళినిఁ గలసి మెలసి
సంతసంబమరంగ సౌఖ్యాబ్ధిఁ దేలుచుఁ
గంబంబులో నీడఁ గాంచి యపుడు
భ్రమసి యిదేమని పల్కరించక యారా!
యిట్లేల? యలిగితి నితనితోడ

గీ. నేనె ముందుగ నితనితో నిపుడు పల్క
నలిగియున్నది తానె మాటాడె ననుచు
నాథుఁ డెంతయు నను జూచి నవ్వునొక్కొ!
యేమి సేయుదు? నీయల్క యెట్లు తీరు? 43

సీ. కదిసి ప్రేమను వీనిఁ గౌఁగిలించకయున్న
నతనుతాపము చల్లనౌట యెట్లు?
ముచ్చటతో వీనిమోవి యానకయున్నఁ
బచ్చవిల్తునిబారిఁ బాయు టెట్లు?
సారెకు వీనితో సరసమాడకయున్నఁ
గంతునిహుంకృతి గడచు టెట్లు?
తొడరు వేడుక వీనితొడల నుండకయున్న
దలిరువిల్తునిదాడిఁ దప్పు టెట్లు?

గీ. చేరి చెక్కిలి నొక్కుచుఁ జెలిమి మిగుల
గళరవంబులుఁ బల్కుచు వలపు హెచ్చఁ
దనివి దీరంగ వీనితోఁ బెనఁగకున్న
నించువిల్తుని నిపుడు జయించు టెట్లు? 44

సీ. ముదిత! రమ్మని వీఁడు ముందుగాఁ బల్కితే!
చెఱకువిల్కానికి జెఱవుసేతుఁ
గాంత! రమ్మని వీఁడు కౌఁగిటఁ జేర్చితే
పువ్వులవిల్తునిఁ బూజసేతుఁ
జాన! రమ్మని వీఁడు సరసంబు లాడితే
చిగురువిల్కానికి సేవఁజేతు
రమణి! రమ్మని వీఁడు రతికేళిఁ గూడితే
పచ్చవిల్కానిని బ్రస్తుతింతు

గీ. నిరువురము యేము రేబగ లెనసియున్న
నల వసంతునిఁ జంద్రుని మలయపవనుఁ
బ్రాణబంధువు లనుచును భావమునను
గోర్కిమీరఁగ నేవేళఁ గొలుతు నేను. 45

సీ. పంచదార నొసంగి బాగుగాఁ బెంచిన
చిలుకైన నితనితోఁ దెలుపదాయె
బాళిసే సాఁకిన పారువంబైనను
బతికిని దమిబుట్టఁ బలుకదాయె
నెనరుతో నడుపులు నేర్పిన యంచైన
నాథునిదూత్యంబు నడపదాయెఁ
బ్రాణపదంబైన బట్టిగాఁడైనను
జెలువునికిని బుద్ధిఁ జెప్పదాయెఁ

గీ. గోర్కెమీరఁగఁ గలలోనఁ గూడి యిగుల
మారుఁబేరును నెఱుఁగకయున్న విభుని
నెనరుతో నన్నుఁ గూర్చిన నేర్పుఁగలుగు
చిత్రరేఖైన నీవేళఁ జేరదాయె, 46

క. అని మనమున నుష యీగతి
ఘనమగు విరహాంబుచేతఁ గలఁగంగా న
య్యనిరుద్ధుం డావేళ ని
తనమనమున నిట్టులనుచుఁ దలఁచెను బ్రేమన్. 47

సీ. ఇంతి! నీవలిగిన హేతు వెయ్యది? యని
యడుగక నే నేల? యలిగి తకట!
కలికి! నీయలుకకుఁ గారణం బేమని
యిపుడు నే నడిగితే యింతతడవు
పలుకక యిప్పుడు పల్కవచ్చె నటంచుఁ
బలుకునో! పలకదో! పద్మగంధి
మోడి యేమిటి? కని మ్రొక్కి నే వేఁడినఁ
జూచునో! చూడదో! శోభనాంగి

గీ. యీ విరహసాగరము దాఁట నేది? తేప
యేమిసేయుదు? నీకోప మెట్లుదీరు?
నిమిష మేఁడయి తోఁచెను నెనరుమీర
వెలఁదిఁ గూర్పంగ నెవ్వరి? వేఁడుకొందు. 48

సీ. కదియుచీఁకటిఁ జంద్రుఁ డుదయించు బాగదా!
తెఱవ యిప్పుడు మోముఁ ద్రిప్పెనేని
యాకలిఁగొన్నచో నమృత మబ్బుటగదా!
యింతి కెమ్మోవాన నిచ్చెనేని
పేదకు బంగారుబిందె లబ్బుటగదా!
చెలువ కుచము లంటఁ జేర్చెనేని
యెండ నుండఁగ నీడ యెదురువచ్చుటగదా!
సుదతి చల్లనిచూపుఁ జూచెనేని

గీ. యనుచు మనమున యోజింపు చతఁడు మిగులఁ
గలయ నలుదిక్కులును జూచి కాఁక హెచ్చ
భామఁ గూడుటకు నుపాయ మేమి యనుచు
భావమున మకరాంకుని భజనసేయ. 49

సీ. పొలయల్క చేతను బొలఁతి యుండఁగఁ జేరి
పతి మ్రొక్కుచున్నట్టి భావములును
నవ్వుటాలకును నాథుం డల్గినం జూచి
సతి వేఁడుకొనుచున్న చందములును
నా పడకింటిలో నందంబు మీరిన
చిత్రపటంబునఁ జెలఁగఁ జూచి
ఘనత నీచిత్ర రేఖాదర్శనంబున
మరుకాఁక యొకకొంత మట్టుపడియె

గీ. ననుచుఁ బతి పల్క విని తనయాత్మలోనఁ
జిత్రరేఖను గనుఁగొను చెల్మి మీర
బాణనందన మగుడినఁ బతియు వేడ్కఁ
దాను నభిముఖుఁ డగుచును దరుణిఁ గూడె. 50

—: ప్రభాతమున నుషానిరుద్ధులఁ జూచి చెలులు సంతసించుట :—

వ. అంత.

క. మదమున సహస్రకరుఁ డనఁ
గదనంబున మించు బాణుకరములు ద్రుంచన్
గదియు హరిఁ జూతు మనుక్రియ
నుదయాచలమందు భానుఁ డుదయంబయ్యెన్. 51

వ. ఆసమయంబున.

సీ. ఒయ్యారమునఁ దనయురమున నొరగిన
నతివమోవానెడు నందగానిఁ
జెలువుమీరఁగఁ దనచెక్కిలి నొక్కిన
కొమ్మగుబ్బలు జీరు కోడెకానిఁ
దీరుగా నుదుటను దిలకంబు దిద్దెడు
వనితకొప్పును దువ్వ వన్నెకానిఁ
గలపంబుఁ దనమేన గలయంగ నలఁదెడు
నువిదనీవి వదల్చు హాయిలుకాని

గీ. నారి! రమ్మని ప్రేమ బింబోష్ఠి పిల్వ
భామ! యీడిగ మేమని? పలుకువాని
నల్ల యనిరుద్ధుఁ జూచిరి హర్ష మొదవఁ
జిత్రరేఖయు మొదలైన చెలువలెల్ల. 52

వ. అందు,

సీ. సుదతి! వీరలచెల్వుఁ జూచితె కన్నులు
చల్లనాయె ననియె సకియ యొకతె
భళి! వీరి నిర్వురఁ గలయఁగూర్చితి వని
చిత్రరేఖను మెచ్చెఁ జెలువ యొకతె
రతిమన్మథులలీల రాణించి రనుచును
వన్నెమీరఁగఁ బల్కె వనితె యొకతె
యింతచెల్వమువారి నెలమితో సృజియించు
బ్రహ్మ నేర్పరి యనె పడఁతి యొకతె

గీ. చక్కదనమున సరసత జవ్వనమున
సమవురనుఁ దగు నని యెంచె నింతి యొకతె
యెంత చక్కనిహారం లీయిరువు రనిన
దృష్టిదాఁకెనె యని పల్కెఁ జెలువ యొకతె. 53

వ. అని నీనెచ్చెలులు ముచ్చటనున్న యా సమయంబున.

—: అంతఃపురపు కావలివారు ఉషానిరుద్ధులుండు విధము గని
యచ్చెరువంది బాణుని కెఱుకపఱచుట :—

సీ. గండశైలమురీతి గనుపట్టు శిరముల
నిరసి తూలెడు పల్లవెంట్రుకలును
బండికండ్లను గేరు బటువులౌ మిడిగ్రుడ్ల
వేఁడిమి వెదచల్లు వీక్షణములు
కను విశాలములైన కడుపులపైఁ బడి
జానుల జాఱెడు చన్నుగవలు
వంకలై కనుపట్టు వాఁడికోరలుఁ గల్గి
చాకిబానల మించు జాకినోళ్లుఁ

గీ. బ్రాఁతచేటల కెనయైన పాదములును
గటికిచీఁకటిఁ గమ్మెడు కారుమేను
లమర గుదియలబోలు బెత్తములుఁ బూని
అన్నగారులు తమ వెంట నంటినడవ. 54

చ. కనకమయాంబరంబులును గస్తూరివీణియలున్ జవాదియున్
బునుఁగును గుంకుమంబు ముడిపువ్వులు తావులుగుల్కు చందనం
బును దెలనాకుకట్టలను బోఁకలముల్లెను బాణపుత్రికిన్
దినమును దెచ్చికట్టడగఁ దెచ్చిరి హెగ్గడికత్తె లత్తరిన్. 55

సీ. పగడంపుఛాయల జిగిమించు మోవుల
సొంపుమీరిన పలుగెంపుగములఁ
జెక్కుటద్దంబుల చెలువుమీరుచు నున్న
గోటిజీరల పలుసేటువగల

జాలుగొప్పున మీఁదఁ దీరుగాఁ గనుపించు
వాడిన నునువిరవాది సరుల
రాత్రెల్ల వేగింప రతిఁ జెందుబడలిక
వసివాళ్లువాడిన వదనములను

గీ. వింతసొగను వహింపుచు వేడ్క మదిని
వెలయు నొండొరుల్ తమతమవలువ లవుడు
మారువడఁ గట్టి యుల రతిమన్మథు లన
నేకశయ్యా వారిర్వురు నెసఁగఁ జూచి. 56

క. అచ్చెరువందుచు వారలు
హెచ్చఁగ మదిలోనఁ గినుక యిరువురమీఁదన్
జెచ్చెరఁ జేతులఁ జఱచుచు
వచ్చెనుగద! దూరటంచు వనరుచుఁ దమలోన్. 57

సీ. దివిజులకైనను దేరిచూడఁగరాని
శోణితపుర మెట్లు! చొచ్చివచ్చెఁ
గావలివారలు కనకుండ నేరీతి?
నంతఃపురముఁ జేరె నందముగను
బాణనందనకు నీపార్థివసుతునకు
వియ్యమెట్టులు! గలిగె నెయ్యమమర
వీరున్నచందంబు వేడుకతోఁ జూడ
సంతోషమెట్లయ్యె? సకియలకును

గీ. నేమి మాయలుఁ బన్నెనో! యిందఱికిని
చొక్కుపొడిఁ జల్లెనో! నీనుదతిమీఁద
బాణునంతఃపురంబను భయము లేక
వీఁడు తానెట్లు? వచ్చెనే వెలఁదులార! 58

వ. అని మఱియును.

క. తలయూఁపుచుఁ దత్తఱపడి
తలఁపున నొకయింతయైనఁ దాలిమి లేకే
చెలియున్న తెఱంగెల్లను
బలిపుత్రునితోడఁ దెలియఁ బలుకుద మనుచున్. 59

వ. గ్రక్కున బాణుసమ్ముఖంబునకు వచ్చి హెగ్గడికత్తియలు
మ్రొక్కి యిట్లనిరి.

సీ. అసురేంద్ర! నీకన్యయంతఃపురంబున
నింత యొక్కటి బుట్టె వినుము నేఁడు
చిగురువిల్తునికన్న మిగులఁ జక్కనివాఁడు
వీరాధివీరుఁడై వెలయువాఁడు
బంగారుచాయల బాగుమీరినవాఁడు
సింహావలోకనశ్రీలవాఁడు
చెన్నుమీరుచునున్న చిన్నిపాయమువాఁడు
జ్యాకిణాంకోరుభుజములవాఁడు

గీ. తమ్మిరేకుల గెల్చు నేత్రములవాఁడు
సోముని హసింపజాలు నెమ్మోమువాఁడు
వలమురినిఁ బోల్పఁజాలిన గళమువాఁడు
కొమరుమీరినయట్టి కొమరుఁడొకఁడు. 60

క. ఏపున మెమిందజనుచున్
గాఁపుగ వాకిటనె యుండఁ గనకుండఁగఁ దా
నేపగిది? వచ్చినాఁడో
నీపుత్రినిఁ గూడినాఁడు నేర్పమరంగన్. 61

—: కోపావిష్టుండగు బాణాసుని యాజ్ఞచే దైత్యు లనిరుద్ధుని బంధింప నేగుట :—

సీ. అనవుడు గోపించి యసురేంద్రుఁ డవ్వేళ
నద్దిరా! బలిపుత్రు నంతవాని
నగరుఁ బ్రవేశించి నడుమేడలోపలఁ
దగు నుషాకన్యకఁ దాను గూడి
తనకులంబునకు నెంతయు నిందఁగావించె
నదిగాక భయలేశమైన లేక
నను గడ్డసేయ కింతయు నున్నచెల్వొంచ
నింత సాహసవంతు లేరి జగతి

గీ. ననుచుఁ బల్కుచుఁ గంటఁ గెంపతిశయిల్లఁ
బజ్జ మోలగెడు దనుజులఁ బారఁ జూచి
మీరు మీసాధనంబులు మెఱయఁ బూని
యమ్మహాబలుఁ బట్టితెం డనుచుఁ బల్కె. 62

క. దనుజాధీశుని పంపున
దనుజులు వివిధాయుధములుఁ దాలిచి వెస నీ
మనుజుని బట్టుఁడు పొడువుం
డనుచుఁ హరిపౌత్రుఁ జేర నరిగిరి కినుకన్. 63

—: దైత్యబలములఁ జూచి యుష కలఁగఁగా ననిరుద్ధుఁడు ధైర్యము చెప్పుట :—

వ. అంత.

చ. ఘనముగ నార్పు లుప్పతిలఁ గైదువలున్ ఝళిపించి వచ్చునా
దనుజులఁ జూచి డెందమునఁ దద్దయు భీతిలి యీదురాత్మకుల్
తనపతి నేమిసేతురో! యుదగ్రత నంచును జింతఁ జెందు జ
వ్వనిఁ గని మందహాసమున వారిజనాభుని పౌత్రుఁ [1]డిట్లనెన్. 64

ఉ. ఇంత చలింపనేల? యిపుడేఁ గలుగంగ సమస్తదైత్యులున్
బంతము లాడుచున్ నడవ బాణుఁడు వచ్చిన సంగరంబునన్
ద్రుంతు జయంబుఁ జేకొనుదు దోర్బల మొప్పఁగ నీవు నిప్పుడే
సంతసమొప్పఁ జేయుదును సారసలోచన! నీవె చూడఁగన్. 65

గీ. అనుచుఁ దగఁ బల్కి యంకుశాహతినిఁ గినియు
గంధకరిలీల వెస లేచి కంతుసుతుఁడు
భయముచేతను వారించు పడఁతిమీఱి
వీఁక దైత్యుల మార్కొనె విక్రమమున. 66

వ. ఆసమయంబున బాణపుత్త్రియగు నుషాకన్య మనంబున ఘనం
బుగా భయంబుఁ జెంది తనసమీపంబుననున్న చిత్రరేఖంజూచి
వజ్రపాణికైనం జేరిచూడఁగూడని యీబాణాసురుని బలంబుల
కెదిరి యీయనిరుద్ధుం డెట్లు? జయంబుఁ జేకొను నని యడిగిన
నుషకుఁ జిత్రరేఖ యిట్లనియె.

క. అనిరుద్ధుని లావెఱుఁగక
వనితా! మదిలోన నిట్లు వగవఁగ నేలా?
దనుజుల నందఱ నిప్పుడె
యనిమొన నిదె గెల్చివచ్చు నసహాయుండై. 67

వ. అని పల్కి.

1. డిట్లనున్.

ఉ. అత్తరిఁ జిత్రరేఖ సమరాభినివేశభటాళిఁ జూచి తాఁ
జిత్తములో నిలింపమునిశేఖరునిన్ దలఁపంగ నామునీం
ద్రోత్తముఁ డంతరిక్షమున నొయ్యన నచ్చటికేగి నిల్చి యో
చిత్తజపుత్ర ! నీకు జయసిద్ధి ఘటించు నటంచుఁ బల్కెనన్. 68

వ. తద్వాక్యంబు లాకర్ణించి చాల సంతోషించి యాయనిరుద్ధుండు నవ్వుచు దానవులఁ గని రోషభీషణుండగుచు సింహనాదంబు గావించి సౌధంబు డిగి రాఁగాఁ జూచి కొందఱు దైత్యులు కకావికలై చని రయ్యవసరంబున,

—: అనిరుద్ధుని పరాక్రమమునకుఁ దాళలేక దైత్యులు బాణాసురునికడకుఁ జేరుట :—

క. కరియూథంబులఁ గనుఁగొని
హరి యుద్ధతిమీర వచ్చు నాగ్రహ సమరన్
హరిపౌత్రుం డావేళన
యరులన్ గని సింహనాద మలరన్ జేసెన్. 69

సీ. అమరాంతకపౌత్రుఁ డంతఃపురద్వార
పరిఘంబుఁ గైకొని బలముమీర
రాకాసిమూఁకల ఢీకతో నొప్పింప
దానవుల్ మగుడ నుద్ధతివహించి
పరశుముద్గరగదాప్రాసపట్టిసముఖ్య
వివిధాయుధంబులు వేగఁ బరపి
తన్ను నొప్పించినఁ దగ సర్వభూతాత్ముఁ
డగుటను జెలియింప కవుడు సౌదిఁ

సీ. ప్రళయజలదంబు గర్జించుపగిది సార్చి
పగటిమార్తాండబింబంబుభాతి మిగుల
వేడిఁ జూపుచుఁ బరిఘుంబు విసరి విసరి
దనుజబలములఁ జెక్కాండ్ర ధరణిఁ గూల్చె. 70

మ. ఘనసంఘుంబు ప్రచండవాతమున వేగ న్వీచ్చు చందంబునన్
ఘనదంభోళికఠోరఘోరపరిఘాఘాతంబునన్ నొంచ్చి యా
దనుజానీకము బార వెంటఁ జని యుత్సాహంబు రెట్టింప న
య్యనిరుద్ధుం డటఁ బోకు పోకుఁడు నిలుండంచున్ వెసన్
బల్కుచున్. 71

క. అలఘుపరాక్రమనిధియగు
వలరాయని సుతునిఁ జూచి పలుమరు వేడ్కన్
భళిభళి! యనుచును బొగడుచుఁ
గలహాశనమౌని యపుడు గంతులు వైచెన్. 72

క. హతశేషులైన దానవు
లతినిష్ఠురతేజుఁడైన యనిరుద్ధుసము
ద్ధతిఁ జూచి నిల్వనోపక
యతిరయమున బాణుకడకు నరిగిరి భీతిన్. 73

వ. అంత.

—: బాణుఁ డంతర్హితుఁడై పన్నగాస్త్రములచే ననిరుద్ధుని
బంధించుట :—

సీ. ప్రజ్వరిల్లెడు హోమపావకుకైవడి
బాణుఁడు కోపసంభరితుఁ డగుచుఁ
దనమంత్రి యెదుట నుంచిన తేరిపై నెక్కి
ఖడ్గంబుఁ ద్రిప్పుచు గగనవీథిఁ

బరశువట్టిసశూలపాశముద్గరకుంత
చక్రకార్ముకముఖ్యసాధనములఁ
గరముల వేయిని గరముఁ జెన్నువహించి
శక్రధ్వజంబులసాటిఁ బూన

గీ. విలుగుణధ్వనిఁ గావించి విక్రమించి
యట్టహాసంబు సేయుచు నతికఠోర
బాణవర్షంబుఁ గురియుచు భావభవుని
తనయు మార్కొని భుజబలోదగ్రుఁ డగుచు. 74

క. నిలునిలు మనుచును గన్నుల
బలుకెంపొదవంగ వాఁడిపలుకులఁ బలుకన్
దెలియఁగ విని యనిరుద్ధుఁడు
కలఁగక బలిసుతుని మోముఁ గనుఁగొని నవ్వెన్. 75

చ. బలువగకిన్కచే వెలయ భానునికైవడి మీరి తేరిపై
విలసిలు బాణుఁ జూచి భయవిహ్వలయై యుష మేడలోపలన్
జెలువునిఁ జూచుచుండె నిక సేయుదు నేమని మూఢచిత్తయై
తలఁకుచుఁ జిత్రరేఖయును దద్దయుఁ జింతిలుచుండె నత్తరిన్.76

సీ. కింకిణీరవములపొంకమై రత్నంపు
బిరుదుటెక్కెంబులమురువుఁ బూని
వివిధశస్త్రాస్త్రముల్ వెలయ నొప్పువహించు
నరదంబుపై నెక్కి యనికిఁ బేర్చి
కరసహస్రంబుచేఁ గడుఁ దేజరిల్లుచు
నటవచ్చి నిల్చి బాణాసురుండు
నెలవంకగురుతుల నీటుఁ గాంచినవానిఁ
గలితాంగరాగుఁడై చెలఁగువాని

గీ. వాలుఁ బలకయు ధరియించి వఱలువానిఁ
బాదసంచారమున నుర్విఁ బ్రబలువాని
నఖిలభువనైకవీరు నయ్యదుకుమారుఁ
గాంచి కోపించి బాణసుఁడిట్లనియె నపుడు. 77

క. వివిధాయుధరహితుండును
గవచవిహీనుండు [1]వీనిఁ గంటిరె మీరల్
జవమలరఁ బట్టితెండని
యవిరళగతి దనుజభటుల నాజ్ఞాపించెన్. 78

సీ. ప్రళయకాలమునాటి పటుమేఘబృందంబు
లాదిత్యుఁ గప్పిన యందమలర
ఖరదూషణాదిరాక్షసనాథయూథంబు
లారాముపై వచ్చు హారువుదోఁప
రహికెక్కు చైద్యజరాసంధముఖ్యులు
శ్రీకృష్ణుఁ బొదివిన చెలువుమెఱయ
గోగ్రహణంబునఁ గురుబలంబెల్లను
గాండీవిఁ గప్పిన క్రమముమీఱ

గీ. నపుడు దైతేయులాగ్రహవ్యగ్రులగుచు
బహువిధాయుధహస్తులై ప్రబలి మిగులఁ
గారుచిచ్చును మిడుతలు గవిసినట్లు
శౌరిఁజూ నరిరుద్ధునిఁ జుట్టుకొనిరి. 79

మ. అనిరుద్ధుండును రోషభీషణతరాహంకారహుంకారుఁడై
దనుజానీకముఁ జేరిచూచి నగుచున్ దర్పంబుమీఱన్ గడున్
దునియల్గాఁ బడ వ్రేయ నద్దనుజులన్ దుర్వారఖడ్గంబుచే
ననికిన్ జాలక పారి రందఱును హాహాకారముల్ మీఱఁగన్. 80

1. వీఁడు.

వ. ఇవ్విధంబున వెఱపునం బారి మఱియుఁ జొచ్చిన నిశాచరుల
నూఱడించి బాణుండు తనయరదంబు సమ్ముఖంబు సేయించి.

క. తన వేయికరంబులచే
వినుతిగ ధరియించినట్టి వివిధాయుధముల్
గనుఁగొనలఁ గెంపు నింపుచు
ననిరుద్ధునిమీఁద వైచె నాగ్రహ మొదవన్. 81

క. ఈరీతి బాణుఁ డేసిన
భూరిశరంబులను గెడెమున నేర్పొదవన్
వారింపుచు ననిమొన నా
శూరుఁడు విలసిల్లె నుదయసూర్యనిభంగిన్. 82

గీ. గంధగజమును బరికించి కాననమున
నరకుగొనవట్టి సింహంబుకరణి మఱియు
శేశమైనను దైత్యేంద్రు లెక్కగొనక
సమరముఖమునఁ బొల్చె నాశౌర్యధనుఁడు. 83

వ. ఇట్లు నిలిచిన.

సీ. బాణుఁ డంత నిశాతబాణజాలంబుల
గరులంటగా నేసి గాత్రసీమ
మర్మముల్ నొప్పింప మగటిమి చెడక యా
యనిరుద్ధుఁ డాగ్రహ వ్యగ్రుఁ డగుచు
నిఖిలాంగకంబులు నెత్తుట జొత్తిల్లఁ
గావించి విశిఖసంఘముల కోర్చి
యసురేంద్రు తేరుపై కనుగ నారణకోవి
దుండు ఖడ్గంబులఁ దోమరముల

గీ. సునిశితములైన ముద్గరశూలచక్ర
పరశుపట్టిసముఖఘనప్రహరణముల
నిఖలజగములు కంపింప నిగుడఁజేసి
మించి ప్రద్యుమ్నతనయుని ముంచె మఱియు. 84

గీ. బాణుఁ డీరీతి నొప్పింప బాణతతులఁ
గలఁగ కాతఁడు తనచేతిఖడ్గమునను
వానిరథకూబరముఁ ద్రుంచి పూనికలర
హయములను ద్రుంచి బెట్టార్చె నతిశయమున. 85

క. ఈరీతి విక్రమంబున
మీరిన యనిరుద్ధుఁ జూచి మేల్మే లనుచుం
భూరిముదంబునఁ బొగడుచు
నారదుఁ డట నిల్చి నింగి నాట్యముఁ జేసెన్. 86

క. ఎంతయుఁ గినుకను బాణుఁడు
పంతముమీఱంగ వివిధబాణంబులచేఁ
గంతునికొడుకును ననిలో
నంతర్హితుఁజేయ దనుజు లార్చిరి పెలుచన్. 87

సీ. అనిరుద్ధుఁ డవియెల్ల నడిదంబుచేఁ ద్రుంచి
కోపించి తన్ను మార్కొన్న వాఁడు
కాలదండమురీతిఁ గాలాగ్నికైవడి
మిక్కిలిఁ దీవ్రమౌ నొక్కశక్తి
జగములు కలఁగంగ జ్వాలలు నిం[1]డంగ
ఘంటలు మ్రోయంగఁ గాంతి చెలఁగఁ
బ్రద్యుమ్ననందనుపైఁ బ్రయోగించిన
నలశక్తియే పూని యాఘనుండు

1. నిడుంగ.

గీ. బలితమాఘవుమీఁదను భయదముగను
వడిఁ బ్రయోగింప నది వచ్చి వానిరొమ్ము
భూరిజవమున భేదించి భూమిఁ జొచ్చె
నవుడు దేవత లార్చిరి యంబరమున. 88

వ. అయ్యవసరంబున రణంబున మూర్ఛాగతుండైనతరి బాణునిఁ జూచి కుంభాండిట్లనియె.

ఉ. ఓ యసురేంద్ర! వీని నని నోర్వఁగ నీకు నశక్య మీజగ
ద్గేయపరాక్రముండు రణకేళివిశారదుఁ డట్లుగావునన్
ధీయుతమూర్తివై యిపుడు తీవ్రరణంబటు గట్టిపెట్టి నీ
మాయను నొంచి వీని నిట మమ్మును నిన్నును గావఁగాఁ దగున్.

గీ. అనుచుఁ గుంభాండుఁ డాడిన నసురవిభుఁడు
తెలివిఁగైకొని ఘనకోపదీప్తుఁ డగుచు
మించి గరుడుండు పామును ద్రుంచుకరణి
వీని ఖండింతు ననుచును బూని పలికె 90

క. హరులును కేతువు సారథి
యరదంబునుగూడ బాణుఁ డంత హృతుఁడై
యరిగిన యాహరిమనుమఁడు
వెరవక నలుదిశల వాని వెదకుచు నుండెన్. 91

సీ. బలిపుత్రుఁ డప్పుడు బలుమాయచేతను
దను గానరాకుండ ధరణి నిల్చి
యనిరుద్ధు నయ్యెడ నతిఘోరతరములౌ
పన్నగాస్త్రంబుల బద్ధుఁ జేసి

తనకేతుదండంబుఁ దనర నానుకనిల్పి
పరుషవాక్యంబులుఁ బలికి మిగుల
మనమునఁ గోపంబు (మలయుచు నుండం)గఁ
గుంభాండుఁ జూచి యాకులవిదూరుఁ

గీ. [1]గాదవ యెన్నఁడు లేని యీ కులమునకును
నిందఁ దెచ్చిన వీనిని నీవు వేగ
యింపుమీరంగ నిపుడె హింసింపు మనిన
నసురవిభుఁ జూచి మంత్రి యిట్లనియె మగుడ. ౪౨

—: బాణాసురుఁ డనిరుద్ధుని జంప నాజ్ఞాపింపఁగాఁ గుంభాం
డుండు వారించుట :—

ఉ. ఓరజనీచరేంద్ర! హిత మొక్కటిఁ జెప్పెదఁ జిత్తగింపు మే
తీరున? వచ్చె వీఁ డిటకుఁ దేఁకువ నెవ్వరు? తోడితెచ్చిరే
యూరు? కులంబు? వీని కని యోర్వ మరంగ వివేకశాలివై
యానసి పిమ్మటన్ దగు నుదగ్రతరంబుగఁ దెంపుసేయఁగన్. ౪౩

సీ. శుక్రున కెనయైన శౌర్యంబుఁగలవాఁడు
ఘనభుజాబలముచేఁ దనరువాఁడు
నిఖిలాస్త్రములయందు నేర్పుఁగల్గినవాఁడు
భానుతేజంబుచేఁ బరఁగువాఁడు
కమనీయశృంగారగరిమఁ జెన్నగువాఁడు
నలరువిల్తునిరీతి నలరువాఁడు
రాజలక్షణములరమణఁ గాంచినవాఁడు
చిన్నిప్రాయంబునఁ జెలఁగువాఁడు

1. గాదవ యెన్నడును లేని కులమునకును,

గీ. బవరమునఁ జేరి దేవదానవులకైన
గెలువరానట్టి మగటిమిఁ గలుగువాఁడు
కరసహస్రంబుగల నిన్ను కలన నోర్చి
వరబలోన్నతిఁ జెలువొందువాఁడు వీఁడు. 94

వ. ఏవంవిధగుణగరిష్ఠుండైన యీపురుషశ్రేష్ఠుండు మాన్య యగు నీకన్య గంధర్వవివాహంబున వరియించెఁ గావునఁ బూజార్హుండు గాని వధార్హుండుగాఁడని వినయంబు నయంబు ప్రియంబు మీఱఁగాఁ బల్కు కుంభాండు వాక్యంబు లంగీకరించి(పాశ) సమేతునిగా ననిరుద్ధుఁ గావలిబెట్టించి మంత్రియుం దానును బాణుఁడు నిజనివాసంబునకుం జనియె నంత.

—: అనిరుద్ధుఁడు దుఃఖితయగు నుషాకన్యను సమాశ్వాసపఱచి దుర్గాస్తవమున గతబంధనుండగుట :—

క. నారదచోదితుఁ డగుచును
వారిజనయనుండు వచ్చు వాలాయము నీ
క్రూరుని ద్రుంచు నటంచు ను
దారతఁ బ్రద్యుమ్నసుతుఁడు తలఁచుచు నుండెన్. 95

ఉ. పన్నగపాశబద్ధుఁడగు ప్రాణవిభుః బరికించి గాటమా
విన్నదనంబునన్ మొగము వేఁకువచంద్రునిరీతి నొప్పఁగాఁ
గన్నులబాష్పపూరములు గబ్బిచనుంగవమీఁద జాఱఁగాఁ
గన్నియ నెమ్మనంబు కలఁగన్ గడుఁ జింత వహించె నత్తరిన్. 96

వ. ఇట్లు దుఃఖితయగు నుషఁ జూచి యనిరుద్ధుం డిట్లనియె.

ఉ. కన్నియ! దైన్య మొందకుము క్రమ్మఱ రాంచితశంఖచక్రుఁ డా
వెన్నుఁడు వచ్చు నాతొలఁకు వేగమె దైత్యులఁ ద్రుంచు నాజిలో
నిన్నును నన్ను దోడ్కొనుచు నెమ్మిని ద్వారకఁజేరుఁ గమ్మరన్
జెన్నువహింపగా మనకుఁ జేకుఱు భాగ్యము లెల్లకాలమున్. 97

క. అని వనిత నూఱడింపుచు
ఘనమగు దుర్గాస్తవమున గతపన్నగబం
ధనుఁ డగుచు నతిముదంబున
ననిరుద్ధుం డుండె దనుజునంతిపురమునన్. 98

క. నారదుఁ డావృత్తాంతము
వారిజనాభునకుఁ దెల్పువాఁడై నింగిన్
భూరిజవంబున మీఱుచు
ద్వారవతీపురికి నేగె వాంఛ దలిర్పన్. 99

—: ద్వారకాపురమున - స్త్రీలనిరుద్ధుని మేల్కొల్పఁజనుట ;
అంతఃపుర స్త్రీ లనిరుద్ధుని గాన కెల్లెడల వెదకి తుదకు
శ్రీకృష్ణున కెఱుకపఱచుట :—

వ. అంత.

సీ. అరుణోదయంబున హరిపౌత్రు మేల్కొల్ప
నెప్పటిక్రమమున నిందుముఖులు
పడకయింటికి వచ్చి బాగుగా నెంతయుఁ
దంబురల్ సుతిఁగూర్చి తనరు వేడ్క
దేవగాంధారియు దేశాక్షి మలహరి
గుండక్రియ లలిత గుజ్జరియును
మొదలుగాఁ గలయట్టి యుదయరాగంబులు
వినుతింపఁ గొందఱు వింతవగల

గీ. సద్దమును క్షీరకుంభంబు లలరుసరులు
కామధేనువు మున్నుగాఁ గల్గుభవ్య
వస్తువులతోడ శోభనవాద్యములును
బూని కాచిరి కొంద అంభోదముఖులు 100

సీ. పడకింటిలోపలఁ బవళించి యున్నట్టి
కాంతలు మేల్కాంచి కంతుతనయుఁ
డీరేయి యిక్కడ చెలిమితోఁ గ్రీడించి
మనల వంచించి యేమగువకడకొ
చని దానితోఁ గూడి సంతోషమమరంగ
బడలిక నెమ్మేనఁ బొడమ నిపుడు
నౌరౌర! యుదయమైనదియును నెఱుఁగక
యూరక నిదురింపుచున్నవాఁడొ!

గీ. పురిని గల వారయువతులపొందుఁ గోరి
మదనకేళికి నలయుచు నిదురఁబోయి
తెల్లవారినకతమున నుల్లమునను
సిగ్గుపడి రాకయున్నాఁడొ! చెలువలార! 101

క. ఇచ్చకములాడి మిక్కిలి
విచ్చలవిడి గొల్లచెలుల వేడుకమీరన్
దచ్చనలఁ గూడి జాణిగెడు
నచ్చుటునకు నునుపుఁ డనిన నడుగఁగ నేలా. 102

క. అని యనిరుద్ధుని నింతులు
మనమున నెన్నుచును మిగుల మమతలు హెచ్చన్
వనితలయిండ్లను వెదకఁగ
ననఁబోఁడులఁ బంపి రపుడు నవ్వుచు నంతన్. 103

క. ఇల్లిల్లు వెదకి యప్పుడె
తెల్లమిగాఁ దెలిసివచ్చి తెఱవలు తెలపన్
గొల్లల నెగ్గడికత్తెల
వల్లభుఁ డెచ్చోట నున్నవాఁడని తెలియన్. 104

వ. దిగ్గన వచ్చి యెగ్గడికత్తియలు బద్ధాంజలులై యయ్యనిరుద్ధుని కులసతులతో నిట్లనిరి.

ఉ. ఇంతులు గొల్లఁ జుట్ల దొర యిక్కడనే కొలువుండఁ గంటి మే
మంతిపురంబు దాఁటి విభుఁ డవ్వలి కేగఁగఁ గాన మేమియున్
వింతగు చిక్కుబీగములు వేసినయట్లనె యున్న విప్పుడున్
గంతునిపట్టి యిట్లరుగఁ గారణమేమియొ! సోద్య మయ్యెడిన్.

వ. అని మందలించిన నయ్యిందువదనలు తమలోఁ దా మిట్లనిరి.

సీ. జాళితో రమణుండు భామ! రమ్మని పిల్చి
విరులఁ గొప్పునఁ జుట్టె వింతగాఁగఁ
దమితోడ నాథుండు తరుణి! రమ్మని పిల్చి
పుక్కిటివిడె మిచ్చె బుజ్జగించి
యెలమిమీరఁగఁ బతి యెలనాగ! రమ్మని
తిలకంబు దిద్దెను దీరుగాఁగఁ
బ్రేమతోఁ జెలువుండు బిత్తరి! రమ్మని
కౌఁగిటఁ జేర్చెను గారవించి

గీ. యోరి! రమ్మని నేఁ బిల్వ నొఱపుమీరఁ
బలికె నేజా ననుచు మెచ్చి బాగుమీర
సమరతుల నన్ను దేలించి సరసమమర
సురఁటిచేతను విసరెను సుదతులార! 106

క. నవ్వులకును మనతోడను
బువ్వులవిలుకాని సుతుఁడు పొంకముగాఁగన్
దవ్వుల డాఁగఁగఁబోలును
జవ్వనిరో! వెదుకుదాము సరసత ననుచున్ 107

సీ. మేలుగాఁ గనుపట్టు కేళీగృహంబులు
గొప్పలై మించిన యుప్పరిగెలుఁ
జెలువంబు మీరిన శృంగారవనముల
నింపైన పూఁబొదరిండ్లయందు
నవరత్నవిరచితనాటకశాలల
సౌవర్ణమయములౌ సజ్జలందు
నెలమిఁ గ్రీడించు నింతుల యిండ్ల(యందు)ను
మెచ్చంగఁదగు మేలుమిద్దెలందు

గీ. వెలఁదు లందఱు గుంపులై వెదకి వెదకి
కంతు తనయుని గానక కళవళమున
నచ్చెరువుఁ జెందుచును జాల నాత్మలోనఁ
బలికి రిట్లని యెంతయు భావమలర. 108

చ. మునుపును శంబరాసురుఁడు ముచ్చుతనంబునఁ బంచబాణునిన్
గొని తనయింటి కేగె నని క్రొత్తలుగా వినుచుందు మిట్టిచో
నని మొన నోర్వఁజాలమిని యచ్చెరువొందఁగ నెవ్వఁడేనియున్
మనసిజసూను నెత్తుకొని మాధవునిన్ గనకుండ డాఁగెనో! 109

వ. అని యింతులెల్ల యోజనసేయుచు దగ్గఱనున్న హెగ్గడి కత్తియలతో నిట్లనిరి.

క. హరితోడుత నీకార్యము
సరగున నిందఱును దెల్పి సంతసమమరన్
వరుని న్దోడ్కొని రమ్మని
గరితలకును మ్రొక్కి వారు కదలిరి వేగన్. 110

వ. అంత.

క. కమలంబులు వికసించెను
గమలాప్తుం డుదయమయ్యె గౌరవమొప్పన్
గమలాక్ష! మేలుకొను మని
కమలముఖులు మేలుకొలుపఁ గడువేడుకతోన్. 111

సీ. హరి యప్డు మేల్కాంచి యద్దంబుఁ బువ్వులు
కపిలధేనువు క్షీరకలశములను
విప్రయుగ్మంబును వేడుక వీక్షించి
నిత్యకృత్యముఁ దీర్చి నేమమమరఁ
బసిఁడికంబంబుల భాసిల్లుచున్నట్టి
కొలువుకూటంబునఁ గొమరుమీరఁ
జెలఁగెడు నవరత్నసింహాసనంబునఁ
గొలువున్నసమయంబుఁ జెలులు దెలిసి

గీ. విన్నవింపఁగఁ బదియాఱువేలు సతులు
నల్ల రుక్మిణిమొదలైన యష్టమహిషు
లెలమిమీరఁగ శ్రీకృష్ణుఁ గొలువ నపుడు
వచ్చి రచటికిఁ దమతమ వైభవముల. 112

వ. అంత.

సీ. అలరుక్మిణీదేవి యందంబు కనుపట్ట
నిలువుటద్దముఁ బట్టె నేర్పు మెఱయ
భామినీమణి సత్యభామ సిగ నమర్చి
బురు(సారు)మాల్ గట్టెఁ బొంకముగను
జాంబవతీసతి జాతికస్తూరిచేతఁ
దిలకంబు దిద్దెను దీరుగాఁగ
మిత్రవిందాకాంత మేలైనచౌకట్లు
వీనులఁ గీలించె వింతగాఁగఁ

గీ. గంఠమున భద్ర నిలిపెను గంఠసరులు
నురమున సుదంత కౌస్తుభ మొప్పనుంచెఁ
జనవునఁ గళిందకన్య చేసరు లమర్చె
బిరుదుపెండెంబు లక్షణ పేర్మిఁ బెట్టె. 113

వ. మఱియును.

సీ. పొలుపుమీరినయట్టి బురుసాహిజారును
దొయ్యలి యొక్కతె తొడగనిచ్చెఁ
బసిఁడివ్రాఁత చెఱంగు మిసిమిగల్గిన దట్టిఁ
దరుణి యొక్కతమర్చె హరువుగాఁగ
రంగుమీరినయట్టి బంగారుదుప్పటిఁ
బడఁతి యొక్కతె కట్టె బాగు మెఱయఁ
బంచరత్నంబుల భాసురంబగు వంకి
సుదతి యొక్కతె చెక్కె సొగసుమీరఁ

గీ. జేరి యడపంబుఁ గట్టెను జెలువ యొకతె
కడఁగి కాళంజిఁ బూనెను గాంత యొకతె
నురఁటిచేతను విసరెను సుదతి యొకతె
తెలియ వింజామరముఁ బూనె వెలఁది యొకతె. 114

క. చెలు లంత జిట్టు గొల్వఁగ
మలయు కరేణువులనడిమి మత్తేభ మనన్
జెలువొందెడు గోపాలకు
నెలమిన్ వీక్షించి మ్రొక్కి హెగ్గడికత్తెల్. 115

క. చనవరులగు గరితలతో
ననిరుద్ధుని గాన మనుచు నక్కజమీరన్
వినయంబుతోడఁ దెల్పిన
వనజాక్షున కెఱుకసేయ వారలు నంతన్. 116

వ. మందస్మితసుందరవదనారవిందుండై గోవిందుండును.

క. ఏలా మీకీయోజన
వాలాయముగాఁగఁ బంచబాణునిసుతు నే
నేలీలనైనఁ దెచ్చెద
బాలికలకుఁ దెలుపుఁ డనుచుఁ బనిచెన్ వారిన్. 117

—: శ్రీకృష్ణుఁ డాస్థానమును జేసి సకల పరివారములను రప్పించి యనిరుద్ధుఁడు కానరాకుండుటను దెల్పుట :—

వ. ఇవ్విధంబున హెగ్గడికత్తియలకు నానతిచ్చి యగ్గజరాజవరదుండు దగ్గఱను నున్న యన్నగారులన్ జూచి దారుకునిఁ దేరుఁ దెమ్మనుండని పనిచిన యనంతరంబ,

ఉ. సారథి తేరుఁ దెచ్చె నని సారసనేత్రులు విన్నవింప నా
నీరజనాభుఁ డొద్దితరుణీతతి హెచ్చరికంచుఁ దెల్పఁగా
మేరువుకై వడిన్ దిశల మిక్కిలిఁ గాంతులు నించి మించు న
త్తేరవు డెక్కివచ్చె నతితీవ్రగతిన్ సభఁ జేర వేడుకన్. 118

వ. ఇవ్విధంబున సుధర్మాస్థానంబునకున్ వచ్చి యచ్యుతుండు అచ్చటన్ గొలు విచ్చి కూర్చుండి దండనుండు నవసరంబుల బంధుపరిజనంబుల మంత్రివరుల గుఱిదొరల రప్పించుండని యానతిచ్చిన.

క. అవసరమువార లప్పుడె
జవమునఁ జని దొరలకెల్ల సరగునఁ దెల్పన్
సవరణలు మెఱయ వచ్చిరి
నవిరళగతి నుగ్రసేనుఁడాదిగ సభకున్. 119

వ. మఱియును,

సీ. తనయుఁ డేకార్యంబుఁ దలఁచినాఁడో! యని
వసుదేవుఁ డటవచ్చె వాంఛమీర
ననుజుఁ డెవ్వని గెల్వ నాత్మ నెంచెనో! యని
నీలాంబరుఁడు వచ్చె నెమ్మి మెఱయ
నని గల్గెనో! తమయన్నకు నని యెంచి
సాత్యకి వచ్చెను సరభసముగ
నయ్య పిల్పించిన యవసరంబేమని?
ప్రద్యుమ్నుఁడును వచ్చె బలము గొలువ

గీ. మఱియు నుద్ధవముఖులైన మంత్రివరులు
పరఁగఁ గృతవర్మమొదలైన బంధువులును
నల్లయక్రూరుఁడాదిగా నాప్తజనులు
వచ్చి రాశౌరిసభఁ జేర వరుసగాఁగ. 120

వ. తదనంతరంబ,

క. వచ్చినవారికి నప్పుడు
యచ్యుతుఁ డెదురేగి మిగుల నందముగాఁగన్
మచ్చికఁ దండ్రికి నన్నకు
ముచ్చట మీరంగ మ్రొక్కి మోదము వెలయన్. 121

క. వసుదేవప్రముఖుల నల
బిసరుహలోచనుఁడు హేమపీఠంబులపైఁ
బొసఁగఁగ నిల్పుచు మది కిం
పెసఁగంగా వారిఁ జూచి యిట్లని పల్కెన్. 122

సీ. వింత యొకటి నేఁడు వినరయ్య దొరలార!
యరయ నిన్నటిరేయి యంతిపురము
బీగముద్రలునైన పిదపను నిదురించు
ననిరుద్ధుఁ గానమం చతివ లనిరి
యిది యేమి హేతువో? యిందఱు యోజించి
తెలియఁబల్కుఁడటన్నఁ దేటగాఁగ
విని వారు మిక్కిలి విస్మయంబందుచు
ముందుఁ దోఁచక శౌరిమోముఁ జూచి

గీ. జగతి సర్వంబుఁ దెలిసిన స్వామివీవ
నీకుఁ దెలియనిదేమి? యీ జోకములను
మమ్ము నడుగంగ నేలయ్య? మదన జనక!
తెలియ మీరలె యిపు డానతీయవలయు. 123

వ. అనిన విని కపటనాటకసూత్రధారుండైన శౌరి సర్వంబునుం దెలిసియుఁ దెలియనివానిచందంబున షెండంబున యోజన సేయుచున్న సమయంబున,

—: నారదుఁడు శ్రీకృష్ణునికి ననిరుద్ధుని వృత్తాంతమును బాణా
సురుని బలమును దెలుపుట :—

ఉ. తెల్లనిమేనిపై నలరుతేజము దిక్కులఁ బిక్కటిల్లఁగా
గొల్లలయేలికైన హరిఁ గోరికఁ బాడుచు వీణె మీటుచున్
బల్లిదుఁడై చరించు నల బాణుని గర్వ మణంచ నెంచి తా
మెల్లనె నారదుం డపుడు మేదినికిన్ దిగివచ్చె వేడుకన్. 124

క. ఇల కిటువలె దిగివచ్చిన
కలహాశనమౌనిపాదకమలంబులకున్
వలగొని మ్రొక్కుచు శౌరియుఁ
జెలువగుసద్భక్తిఁ బూజసేయుచు మిగులన్. 125

సీ. మౌనీంద్రుఁ దోడ్తెచ్చి మణిపీఠమున నుంచి
యతని యనుజ్ఞచే నపుడు హరియు
సింహాసనంబునఁ జెలఁగుచుఁ గూర్చుండి
కుశలంబు లడిగినఁ గోర్కిమీర
ధర మీ రవతరించి ధర్మంబుఁ బోషింప
సర్వంబు కుశలంబె స్వామి! యనినఁ
దాపసోత్తమునకుఁ దనర నంజలిసేసి
యనిరుద్ధువృత్తాంత మడుగ నితఁడు

గీ. పరఁగు బ్రహ్మాండముల నెల్ల బాగుమీర
గర్భమున నుంచుకొన్నట్టి ఘనుఁడ వౌర!
యిట్టి వృత్తాంత మేమియు నెఱుఁగనట్టు
లడిగెదవు నీ వెఱుంగని యదియుఁ గలదె! 126

సీ. బలితనూభవుఁడగు బాణాసురునిపుత్త్రి
కలలోన యనిరుద్ధుఁ గలసి వేడ్కఁ
జిత్రరేఖను జూచి చెలువునిఁ దెమ్మన్న
నళినాక్షి మాయచే నగరుఁ జొచ్చి
యనిరుద్ధుఁ దోడ్కొని యప్పురంబున కేగి
యల యుషతోఁ గూర్చినట్టి వార్త
బాణాసురుఁడు విని బలములతో వచ్చి
పన్నగాస్త్రంబులఁ బదిలముగను

గీ. బంచబాణునితనయుని బద్ధుఁ జేసి
బయలు బేఱకయుండఁగఁ బ్రబలులైన
యట్టి దనుజులఁ గావలిఁ బెట్టినాఁడు
మనుమ నిటు దోడితెమ్ము నీమహిమ మెఱయ. 127

వ. అని పల్కిన.

సీ. బలభద్రుఁ డప్పుడు పంతంబు లాడుచు
ముసలంబుఁ ద్రిప్పెను మొక్కలమున
సమరంబులో దైత్యు సమయఁజేయుదు నంచు
సాత్యకి లేచెను సంభ్రమమునఁ
బట్టిఁ జెఱపట్టు ప్రబలుఁడౌ దానవుఁ
బట్టితెచ్చెద ననెఁ బంచశరుఁడు
బాణునిఁగూల్చెద బాణాగ్నిచే నని
సాంబుండు పలికెను సాహసమున

గీ. మఱియుఁ గృతవర్మ మొదలైన మనుజపతులు
శోణితపురంబునను గల్గు శూరవరులఁ
జెండుబెండాడి మిక్కిలిఁ జేవ మెఱయ
నల్ల యనిరుద్ధుఁ దోడ్తెత్తు మనుచుఁ బల్క. 128

క. వీరలాపము లాడెడు
వారల వారించి యపుడు వసుదేవసుతున్
జేరఁగ రమ్మని ప్రేమను
నారదుఁ డిట్లనుచుఁ బల్కె నైపుణిమీరన్. 129

సీ. ముల్లోకములు మెచ్చ ముక్కంటిచేతను
వరములుఁ గైకొన్న వరబలుండు
వేయికరంబుల వివిధాయుధంబులు
ధరియించి యనిసేయు ధైర్యశాలి
దేవేంద్రముఖులైన దిక్పాలకుల నెల్ల
క్షణమాత్రమున గెల్చు సాహసికుఁడు
మాయాబలంబున మగటిమిచేతను
జగతుల సాధించు బల్లిదుండు

గీ. ప్రమథగణములతోఁ గూడ భర్గునంత
వాఁడు వాకిటిగొల్లయై వచ్చికొలువ
నల్ల శోణితపుర మేలునట్టి మేటి
యమితతేజోధికుండు బాణాసురుండు. 130

గీ. జగములన్నియు సృజియింప సాకెఁ బ్రోవఁ
జతురుఁడవు నీకు నిందు నసాధ్యమేమి?
వీరుల కసాధ్యుఁ డగునె యవ్వీరవరుఁడు
నీవె గెలువంగవలయును నేర్పుమీర. 131

వ. అని విజయప్రయాణంబునకు శుభముహూర్తంబు నిర్ణయించిన.

క. అరుణాబ్జనాయికాంబా
చరణాంబుజసాధుభజనసంభృతహృదయా!
నిరతాన్నదానపోషిత
ధరణీసురవర్య! శాశ్వతశ్రీధుర్యా! 132

క. సాక్షాత్కృతకనకవనా
ధ్యక్షా! విపక్షావనీంద్రదారణదక్షా!
అక్షయకరుణావీక్షణ
రక్షితకవిరాజ! దినకరప్రియతేజా! 133

రథోద్ధతవృత్తం.

అంగనాహృదయహారిసత్కృపా
పాంగవీక్షణ! కృతార్థసద్గుణా!
సంగరాపహృతశాత్రవౌఘమా
తంగబృందభరితశ్రితాంగణా! 134

గద్య. ఇది శ్రీమద్రాజగోపాలకరుణాకటాక్షవీక్షణానుక్షణప్రవర్ధమానసారసారస్వతధురీణయు విచిత్రతరపత్రికాశతలిఖితవాచికార్థావగాహనప్రవీణయు తత్ప్రతిపత్రికాశతస్వహస్తలేఖనప్రశస్తకీర్తియు శృంగారరసతరంగితపదకవిత్వమహనీయమతిస్ఫూర్తియు అతులితాష్టభాషాకవితాసర్వంకషమనీషావిశేషశారదయు రాజనీతివిద్యావిశారదయు విజయరాఘవమహీపాలవిరచితకనకాభిషేకయు విద్వత్కవిజనస్తవనీయవివేకయు మన్నారుదాసవిలాసనామమహాప్రబంధనిబంధనకృతలక్షణయు మహనీయరామాయణభాగవతభారతకథాసంగ్రహణవిచక్షణయు పసపులేటి వెంకటాద్రిబహుజన్మతపఃఫలంబును మంగమాంబాగర్భశుక్తిముక్తాఫలంబును రంగద్గుణకదంబయు నగు రంగాజమ్మ వచనరచనాచమత్కృతిం జెన్నుమీరు ఉషాపరిణయంబను మహాప్రబంధంబునందుఁ ద్వితీయాశ్వాసము.

—: శ్రీరాజగోపాలాయనమః :—

శ్రీ రాజగోపాలాయనమః

ఉషాపరిణయము

(పద్యకావ్యము)

చతుర్థాశ్వాసము

—:శ్రీకృష్ణుఁడు సపరివారముగా బాణునితో యుద్ధమునకుఁ జనుట:—

క. శ్రీమహితరాజగోపకృ
పామహిమప్రాప్తపుత్రపౌత్ర! జయశ్రీ
ధామ! సుగుణాభిరామా!
రామాసుమచాప! విజయరాఘవభూపా! 1

వ. అవధరింపుము,

గీ. అపుడు కృష్ణుండు విప్రపుణ్యాహఘోష
పూర్వకముగాఁగఁ గదలుచోఁ బురయువతులు
చల్లతావులుఁగల విరుల్ జల్లి రెలమి
మ్రోసె వాద్యము లాశౌరి ముదముఁ జెంద. 2

గీ. ఇట్లు బాణజయార్థమై యేగునట్టి
హరిని గనుఁగొని నారదుం డనియె నిట్లు
ఓయదూద్వహా! వేగ తార్క్ష్యని దలంపు
తత్పుర మతఁడు నొకముహూర్తమునఁ జేర్చు. 3

క. ఖగకులనాథుఁడు దక్కఁగ
నొగి నేకాదశసహస్రయోజనములుఁ దా
మగటిమిఁ జని యతిదుర్గమ
మగు శోణపురంబుఁ జేర్చె నన్యుల కగునే. 4

చ. అన విని కంసమర్దనుఁడు నట్లన నెమ్మదిలోఁ దలంచునం
తన వినతాతనూభవుఁ డుదారగతిం జనుదెంచి యచ్యుతుం
గని వినయావనమ్రుఁడయి గ్రక్కునఁ బార్శ్వమునందు నిల్చి య
య్యనఘునకుం బ్రమోదముగ నంజలిబంధముఁ జేసి యిట్లనెన్. 5

సీ. దనుజభంజన! నన్ను దలఁచిన పనియేమి?
యానతీయుము నెయ్యంబు మీఱ
భవదీయబలగుప్తపక్షవిక్షేపంబు
చే నెవ్వనిపురంబు ? వో నడంతు
మీఱ చేపట్టిన మేలిమిచేఁ బాంచ
జన్య చక్రంబులు శార్ఙ్గగదలు
మొదలైన యాయుధంబుల దర్పమునకు నా
దర్పోద్ధతికి నసాధ్యంబు గలదె!

గీ. యనుటయును శౌరి యాదరాయత్తదృష్టి
నతని వీక్షించి వినుము ఖగాధినాథ!
బలితనూభవుఁడగు బాణుఁ డలఘుశక్తి
గర్వదుర్వారపిశునతాఖర్వుఁ డగుచు. 6

గీ. కదనమునఁ గిట్టి తనబలమదము నెల్ల
మాయఁ జేసిన యనిరుద్ధు మాయఁ జేసి
నాగపాశబద్ధునిగా నొనర్చినాఁడు
తెలియఁడో! కాక భవదీయతీవ్రశక్తి. 7

క. అటు గనుక దూరమగు త
త్పుటభేదన మిపుడ చేరఁబోవలయుట ని
న్నిటుదలఁచితి మఱియు సము
ద్భటుఁడగు నీవలనఁ గాక పఱచే నగునే. 8

వ. అది యెట్లంటేని.

మ. పటుజంఘాలభవద్గరున్మరుదురుభ్రామ్యన్మహారోధమున్
జటులాదిత్యగణంబు వే గెలిచి తత్సంపాదితంబౌ యశః
పటలింబోలు సుధన్ హరించి యతులప్రఖ్యాతిచేఁ దల్లి యు
త్కటదాస్యంబును బాయఁజేసిన మహాధన్యుండ వీవెంచఁగన్. 9

వ. అదియునుంగాక.

క. కడఁకమయి సురల వీఁపున
నిడికొని యసురుల జయించి హెచ్చగు జయముల్
బడిబడి నొసఁగు ఘనుండవు
సుడివడరే రిపులు నిన్ను జూచినయంతన్. 10

ఉ. నీవు మహానుభావుఁడవు నిత్యము మద్రథకేతనాకృతిన్
దీవి వహించినాఁడవు గణింపఁగ యాదవులెల్ల నిన్ను సం
భావన చేయుచుందురు రపారపరాక్రమధుర్య! యెప్పుడున్
గావున నిట్టికార్యముఁ దగన్ నెరవేర్పుము నేర్పెంపునన్. 11

క. అని మధుసూదనుఁ డాడిన
విని భుజగాశనుఁడు హర్షవిస్మయములు నె
మ్మనమునఁ బెనఁగొన హరిఁ జే
ర్కొని యిట్లని విన్నవించె గురుతరభక్తిన్. 12

మ. ఇటు లాడఁ దగునయ్య! మీరు కృపచే నెందే వసింపన్ జయం
బటఁ గల్గున్ మది నెంచిచూడఁగ ధ్రువం బాశ్చర్య మా యిప్పుడ
క్కటా! లోకైకశరణ్య! నీవిటు ననుం గారుణ్యదృష్టిన్ నుతిం
చుట నాభాగ్యముగాదె పద్మజముఖస్తుత్య ప్రభావాశ్రయా! 13

సీ. కర్తవు సకలలోకములకు నాద్యుఁడ
వఖిలకామప్రదాయకుఁడ వీవ
బ్రాహ్మణప్రియుఁడవు బహుయోగిమానసాం
భోజరాజత్పాదాంబుజుఁడ వీవ
కల్యాణగుణుఁడవు కరధృతచక్రగ
దాశంఖశార్ఙ్గనందకుఁడ వీవ
భక్తవత్సలుఁడవు భవ్యనాభిసరోజ
జనితసరోరుహాసనుఁడ వీవ

గీ. యిట్టి మిమ్ము నుతింప నే నెంతవాఁడ
నిపుడె తనమీఁద వేంచేసి రిపుజయంబుఁ
గను మటన్న జయార్థమ్ము ఖ్యం బొసంగె
స్వామి యతనికి జయజయధ్వనులు చెలఁగ. 14

గీ. అంత సాత్యకి మొదలైన యాదవులను
ద్వారకను నుంచి శౌరి యుదారలీలఁ
బన్నగాశనుపై బలభద్రముకర
కేతనులతోడ నెక్కె సంప్రీతుఁ డగుచు. 15

—: ఖగవాహనారూఢుండై గగనమార్గమున నేగు శ్రీకృష్ణుని
చారణులు స్తుతించుట :—

ఉ. మాగధసూతవందిజనమానినివరుల వినుతింప నేగుచో
వే గగనంబునందు జయవిశ్రుతభాషణులైన చారణుల్

నాగవిరోధిపై నతిబలస్ఫురణంబున నున్న శౌరికిఁ
సాగిలిమ్రొక్కి యిట్లనుచు సంస్తుతిచేసిరి భవ్యసూక్తులన్. 16

సీ. జయ శంఖచక్రాసిశార్ఙ్గగదాధర !
కౌస్తుభశ్రీవత్సకలితవక్ష !
జయ నాభిపంకజసంభూతచతురాస్య !
అంబుధికన్యావిహారలోల !
జయ భువనత్రయాశ్రయచరణాంభోజ !
జగదుద్భవస్థితివిగమకరణ !
జయ దుష్టదైత్యకుం(జరసూ) దనమృగేంద్ర !
కమనీయనారదగానలోల !

గీ. అఖలదేవేశ ! కోటిసూర్యప్రకాశ !
జలధరశ్యామ ! కామితఫలదనామ !
అమితగుణహార ! భవ్యదివ్యావతార !
ఘనమ[హీధరవ]రధారి ! కంసవైరి !. 17

వ. అని మఱియును.

క. దురమున నెదరిన బాణా
సురు గెలుతువు సిద్ధమనుచు సొంపమరఁ బొరిన్
బొరిఁ బొగడువారి పలుకులు
సొరిది వినుచు నధికహర్షశోభితుఁ డగుచున్. 18

—: శ్రీకృష్ణుఁడు బలదేవాదులతో శోణపురి సమీపమునకుఁ జేరుట :—

ఉ. దానవభంజనుం డహీనమధానుసుధాకరపాకభేదిపై
శ్యానరుదుర్నిరీక్షతరసర్వదిగంతవిసారిభూరితే
జోనుగుణాత్మదేహుఁడయి యష్టభుజంబులుఁ దాల్చె నప్పుడా
దానవసూదనాగ్రజుఁడు దానును బాహుసహస్రభాసియై. 19

క. అతిభాస్వరమగు రూపము
నతిమానుషదివ్యతేజ మమరఁగఁ దాల్చెన్
రతిపతియు సత్ప్రభావో
చితమైన సనత్కుమారుదేహముఁ దాల్చెన్. 20

గీ. వినుము శాకేంద్ర! యటువలె వెలసె విహగ
వాహనారూఢుఁడైన యావాసుదేవు
నిపుడును దలఁచితలఁచి మాహృదయపంక
జంబు లానందరసభరితంబు లయ్యె. 21

గీ. అపుడు మధువైరి దక్షిణహస్తములను
జక్రకౌమోదకీఖడ్గశరము లలరె
సవ్యకరముల నాల్గిట సరవితోడ
శంఖశార్ఙ్గకఫలకపాశములు నమరె. 22

చ. అట గరుడుండు పక్షజనితామితభీషణఘోషణానిల
స్ఫుటదచలేంద్రకూటతటచూర్ణమహావిటపావనీజుఁడై
తటిదయుతప్రభాజటిలతారతనుద్యుతి నిండ దిక్కులన్
బటుజవయుక్తిచేఁ బఱచె భాసురలీల నభోంతరంబునన్. 23

వ. ఇట్లు గరుడుండు గగనమార్గంబునం జనుచుండఁ గృష్ణుఁ జూచి బలభద్రుం డిట్లనియె.

క. హరిహారిద్రావర్ణము
లీరూపము లొందవె మనకు నేమిట నిపు డా
మేరుశిఖరిచేరువ ను
న్నారమె యిదియేమి చెవుము నలినదళాక్షా! 24

క. అనుటయు నతనికి హరి యి
ట్లనియెను బలదేవ! యిచట నాహవనీయం
బనువహ్నిదివ్యతేజము
ఘనమై పొదువంగ నిట్టికాంతులు గలిగెన్. 25

చ. అనవుడు రేవతీరమణుఁ డాయదునందనుతోడ దైత్యభం
జన! యటులైన శోణపురిచాయకె వచ్చితి మార! యిప్పు డీ
యనలము శాంతిఁ జెందఁగ నుపాయము నొక్కటి చూడు మన్నఁ దా
ర్క్ష్యునకు మురారి యెంతయును సొంపు జనింపఁగఁ బల్కె నీక్రియన్.

గీ. అమృతహరణప్రవీణ! యీయనల మిపుడు
కడచి చనఁగ నుపాయంబుఁ గనఁగవలయు
ననిన గరుడుండు సురసరిదంబువులను
దెచ్చి నించిన నగ్ని యదృశ్యమయ్యె. 27

వ. అంత.

—: శ్రీకృష్ణుఁడు శంభుబలములగు పావకులతోఁ బోరుట :—

మహాస్రగ్ధర

జలజాక్షానంగసంకర్షణులు ముగురు నిస్తంద్రశక్తిన్ ద్రిలోకం
బులు గెల్వంజాలు శూరుల్ భుజగరిపుజవస్ఫూర్తిచే నిట్టుల(త్యు)
జ్జ్వలకీలాజాలఘోరజ్వలనమును వ(డిన్)శాంతిఁ బొందించి యంతే
బలదర్పప్రాభవంబుల్ బలియుఁ జనిరి తత్పట్టణాభ్యర్ణసీమన్. 28

క. అది గని శంభు(నిరో)గము
న దివానిశమును ద(దీయనగరావన) కో
విదులగు ననేకపావకు
లదరి బెదరి గుంపుగూడి యందఱుఁ దమలోన్ 29

ఉ. భూరిబలాఢ్యుఁ డీవిహగపుంగవుఁ డీతనిమీఁద నెవ్వరో!
వీ(రులు శూరులో) ముగురు వీర లవ(క్రపరా(క్రమాఢ్యులై
కారు లుదారబాహుపరిఘస్ఫురదాయుధు లంచు నెంచి యే
(వారలు)గాఁగ నేమి? యని వారలఁ (జంపఁగ) నిశ్చితాత్ములై.

క. కోపాటోపనితాంతో
ద్దీపితులై వారిఁ జేరి తీక్ష్ణశరంబుల్
పైపై దళముగఁ గురియు(చు)ఁ
జూపిరి తమశక్తియుక్తిఁ జూప(రి) మెచ్చన్. 81

వ. అట్టి సమయంబున.

క. విని బాణుం డాకలకల
మును దనవేగరులలోన ముఖ్యుం(డగు) నొ
క్కనిఁ బిలిచి తెలిసి రమ్మని
ఘనసైన్యము లేర్పఱించెఁ గదనాపేక్షన్. 82

ఉ. వాఁడును వచ్చి యవ్విహగవాహనముఖ్యులతోడఁ బావకుల్
వాఁడిమిఁ బోరఁ గన్గొని జవంబున నేగి సుపర్వవైరితో
నేఁ డిపు డెవ్వరో ముగురు నిస్తులదీప్తి మదుత్సుఖాళితో
వేఁడిమిమైఁ బెనంగెదరు వీరవరేణ్య! యటంచుఁ బల్కినన్. 83

వ. బాణాసురుండును నది నరకుగొనక యకంపితధైర్యుండై యుండె, అంత నిక్కడ కల్మాషుండును, కుసుముండును, దహనుండును, (తి)ష్మనుండును, తపనుండును, పటులుండును, పతంగుండును, స్వర్ణుండును, (భ్రాజుండును, జ్యోతిష్టోముండును, హవిర్భాగుండును, అంగిరుండును మొదలగు ననేక పావకులు నిజానీకపరివృతులై వచ్చి (ప్రద్యుమ్నవాసుదేవసంకర్షణులతో యుద్ధంబు

సేయునెడ వాసుదేవుండు రథారూఢుండై మునుగలఁ బ్రకా
శించు నంగిరుం జూచి యిట్లనియె.

క. నీవును మఱియును గల యీ
పావకులును రణమునందు భయకంపితులై
పోవక నిలిచిన మఱి నా
లావుం గనియెదరు మీదులావును దెలియన్. 34

గీ. అనినఁ గోపము రెట్టింప నంగిరుండు
కృష్ణుపైనిఁ ద్రిశూలంబుఁ ద్రిప్పి వైవ
నంతలోననె శౌరియు నర్ధచంద్ర
విశిఖముల నేసి కావించె విశిఖముగను. 35

వ. మఱియును.

క. స్థూణాకర్ణాస్త్రము హరి
తూణంబునఁ దిగిచి రొమ్ముఁదూఱఁగ నేయన్
శోణితము లొలుక నతఁడున్
బ్రాణంబులు తల్లడిల్ల బ్రాలె న్నేలన్. 36

—: అంగిరుని గూల్చి శ్రీకృష్ణుఁడు బాణపురమును బ్రవేశించుట :—

వ. ఇట్లుగ్రచరుండైన యంగిరుండు మూర్ఛాపరవశుండై పడిన
శేషించిన పావకు లతని రథమున నుంచుకొని బాణపురంబుఁ
బ్రవేశించి రంత.

గీ. అంబుజాక్షుండు సింహనాదంబుఁ జేసి
భవ్యతరలీలఁ బూరించెఁ బాంచజన్య
మప్పు డాశౌరి గనుపట్టె నమృతకరుని
వెడలఁ గ్రాయు నభంబన విను నరేంద్ర ! 37

క. బలదేవప్రద్యుమ్నులు
నలఘుతరస్ఫూర్తి మెఱయ నట్లన శంఖం
బులుఁ బూరింపఁగ నల హరి
బలిమిఁ బ్రవేశించె వేగ బాణునిపురమున్. 38

వ. అప్పుడు శోణితపురంబునందు.

స్రగ్ధర.

ప్రద్యుమ్నోపేతసంకర్షణముఖకమలప్రస్ఫురద్దివ్యశంఖ
ప్రోద్యద్భూరిప్రణాదంబులు బహుపటహవ్యూహభేరీరవంబుల్
సద్యస్సన్నద్ధయోధాలఘురచితమహాసాహసక్ష్వేళనంబుల్
మాద్యత్పక్షీంద్రపత్త్రోల్లసితమహితఘంటాధ్వనుల్ గూడి నిండెన్.

గీ. పట్టణము నాల్గుదిక్కులఁ బ్రబలి యిట్లు
భీషణంబగునట్టి యాఘోష మనరె
వననిధులు నాల్గు నొక్కదిక్కునను గూడి
భాసురంబుగ నొక్కట మ్రోసె ననఁగ. 40

—: శంభుబలములు శ్రీకృష్ణాదుల నెదుర్కొనుట :—

ఉ. శోణపురంబు వారలును జొచ్చుతఱిన్ బహుయక్షపూర్వగీ
ర్వాణమహోద్భటప్రమథరాక్షసకోటులు విస్ఫురద్గదా
బాణమహోగ్రతోమరకృపాణములన్ ధరియించి యంబుద
శ్రేణులలీల గర్జనము సేయుచు నెంతయు భీషణాకృతిన్. 41

క. ఒక్కుమ్మడి వడి నడచుచు
నక్కజముగ నార్చి పేర్చి యతితీక్ష్ణములౌ
పెక్కమ్ముల నానలుగురి
వెక్కసముగఁ బొదవి రెల్లవీరులు మెచ్చన్. 42

వ. మఱియు నప్పుడు సమరనిశ్శంకంబులగు ననేకకింకరసైన్యంబులు జంగమనీలశైలంబులకైవడిఁ జనుదెంచి ప్రద్యుమ్నబలభద్రవాసుదేవనైనతేయులమీఁదఁ బ్రళయానలదారుణంబులైన బాణంబులుఁ బ్రయోగించి తదీయాంగంబులం దొరగు రక్తపూరంబులఁ దుర్మదంబునం ద్రావి రౌద్రంబుగా నార్చుచు విజృంభించుసమయంబున బలభద్రుండు వాసుదేవునిఁ జూచి యిట్లనియె.

ఉ. అంబుజనాభ! యింక సముదగ్రత వీరల భూరిబాహుద
ర్పం బెడఁబాప కిట్టిసమయంబున నూరకయుండరాదు వే
గంబున నీదు తీక్ష్ణశరకాండములన్ విగుడంగఁ జేసి నీ
లాంబుదశైలదేహుల మహాసురలం బొలియింపఁగాఁ దగున్.

చ. అనవుఁడు నట్లకాక యని యామురవైరియు నంతకోపమం
బును నతిభీషణంబు[1]నయి పొల్చు మహోజ్జ్వలనాస్త్రమున్ రయం
బెనయఁగ నేసి తద్బలము నెల్లను గూలఁగఁ జేసి ముందఱం
జని మఱియున్ గనుంగొనియె సైన్యముఁ గాంక్షితఘోరజన్యమున్.

వ. అంత.

మ. పరశుప్రాసకుఠారతోమరగదాపాశాంకుశేష్వాసము
ద్గరశక్త్యృష్టిముఖాయుధంబుల మహోగ్రప్రక్రియన్ దాల్చి భీ
కరభేతాళపిశాచభూతగణరక్షస్సంఘముల్ భూరి సం
గరకౌతూహలయుక్తినార్చెఁ బెలుచన్ గ్రౌర్యంబవార్యంబుగన్.

ఉ. వారలఁ జూచి యిట్లనియె వారిజనేత్రునకున్ బ్రలంబసం
హారి యుపేంద్ర! యిచ్చటియుదారబలంబుల నేనుఁ గిట్టి దు

1. భీషణంబునసై.

ర్వారత గెల్చెదర్ విహగరాజును నియ్యెడ డిగ్గి నావుడున్
శౌరియు నట్లకాక కదనంబును సేయుద మంద ఱ్ఱొకటన్. 46

—: యుద్ధముఁ జేయ బలభద్రాదుల వేర్వేఱుచోట్ల శ్రీకృష్ణుఁడు నియోగించుట :—

వ. అని పల్కి సుపర్ణుని డిగ్గె నప్పుడు బలభద్రప్రద్యుమ్నులును తోడన డిగ్గి రప్పు డప్పంకజాక్షుండు పన్నగాశనప్రద్యుమ్నబల దేవులఁ బేర్వేరం బేర్కొని యిట్లనియె.

సీ. పన్నగాశన! నీవు పెన్నాసగా నిల్చి
యటవచ్చు నహితుల నడఁచవలయు
రేవతీప్రియ! నీవు నావలపలిదిక్క
నను నిల్చి రిపులతోఁ బెనఁగవలయుఁ
బ్రద్యుమ్న! నీవు డాపలిదెసకై నిల్చి
యరిసంఘముల నెల్ల నుఱుమవలయు
బలములఁ జెదిరి విచ్చలవిడి వడి నేను
దోశ్శక్తిఁ దునిమెదఁ దునుమవలయు

గీ. నసురనివహము నెల్ల నటంచుఁబలుకు
నంతలోనన తద్బలమంత నింతఁ
గదియవచ్చిన శౌరియుఁ గదిమె నంత
గురుతరంబుగ నల పోరు ఘోరమయ్యె. 47

—: ఘోరయుద్ధమున శంభుసైన్యము పరాజయమునొందుట :—

క. హలధరుఁడు నుగ్రుఁడై లాం
[1]గలమున దానవగణంబుఁ గదియుచుఁ బెనుఁగు
ప్పలుఁగాఁ బడఁజేయుచుఁ దన
బలస్ఫురణ రణమునందుఁ బ్రబలఁగఁజేసెన్. 48

1. గలమున దానవగణంబు గదిసిన

వ. మఱియును.

చ. ప్రళయహుతాశనప్రకరభానురుఁడై యెదిరించు వీరులన్ వ్రేచున్
హాలమున నీడ్చియీడ్చి ముసలాగ్రమునన్ బడఁ గ్రుమ్మి చిమ్ము
బలుమఱు నిట్లు రౌద్రనిజభావముఁ జూపుచునుండఁ గోట్లు కొం
[1]డలుగఁ బడం దొణంగి రచటన్ బ్రమథప్రబలారిసైనికుల్. 49

క. ప్రద్యుమ్నుం డరితిమిర
ప్రద్యోతనుఁ డగుచు నిశితబాణవితతిచే
విద్యున్నిభదంష్ట్రిల సమ
రోద్యుక్తులఁ ద్రుంచె దనుజయూథాధిపులన్. 50

గీ. శంఖచక్రగదాఖడ్గశార్ఙ్గధారి
కంసవైరియు నిజకరకౌశలంబు
మెఱయ రయమున శరములు నెరయఁ జేసి
రక్కసుల భూరిదర్పంబు నుక్కడంచె. 51

క. పక్షికులాద్యక్షుఁడు సం
ధుక్షితనిజపక్షతీక్ష్ణతుండాగ్రములన్
రక్షోనివహంబుల ముఖ
వక్షంబుల నడఁచి వ్రచ్చి వందఱలాడెన్. 52

క. ఈపగిది నలుగురు భుజా
టోపంబులఁ జూపు నప్పుడు సురారిభటుల్
చాపంబులు దిగవిడిచి క
కావికలై చనిరి (మి)గులఁ గలఁగంబడుచున్. 53

1. దలుగఁబడందొణంగిరచటన్ ప్రమథప్రముఖ ప్రబలారి సైనికుల్.

గీ. అంత బలదేవమదనవిహంగనాథు
లెంతయుం జేర్చి యార్చిరి సంతసమున
నసురభీకరఘనరవంబయిన పాంచ
జన్యమును వేగ పూరించెఁ జక్రధరుఁడు. 54

—: మహేశ్వరశక్తిపీడితుఁడగు బలదేవుఁడు శ్రీకృష్ణునివలన తద్విముక్తిఁ జెందుట :—

వ. అంత నిట్లు కింకరసైన్యంబు దైన్యంబుఁ జెంది సంగరంబుఁ జాలించి భయంబున దిశలకు సంభ్రమించు నవసరంబున మహేశ్వరప్రేరితంబైన మహాజ్వరంబు భయంకరాకారంబై హస్తమస్తకచరణత్రితయంబులు గలిగి భసితప్రహరణంబై ధారాధరసహస్రంబునుంబోలె గర్జింపుచు వచ్చి వాసుదేవాగ్రజునిం గని.

మ. ఎటు వోవంగలవాఁడ వింక నిదె యుద్వృత్తిఁ నినుం గిట్టి మ
త్పటుబాహాబలయుక్తిఁ జూపెద మదాంధత్వంబు ప్రాపించి న
న్నిటు లేలా యెఱుఁగంగఁజాల విటమీఁ దెట్లయ్యెడో యంచు ను
త్కటహాసంబు నొనర్చి పైఁబడియె సుద్యన్ముష్టిబంధోగ్రమై. 55

గీ. రౌహిణేయుఁడు నెదిరించి బాహుయుద్ధ
కౌశలముఁ జూపి మండలాకారముగను
దిరిగెఁ దీఱగ మహేశ్వరజ్వరము నొంచి
యతని యతిఘోరముష్టిప్రహారములను. 56

వ. మఱియు నమ్మహేశ్వరజ్వరంబు.

క. తన సవ్యకరమునందలి
ఘనభసితము బలునిరొమ్ముఁ గదియఁగ వ్రేయన్
జని యదియు నతనివక్షం
బునఁ బడ్డ నొకకొండభంగి భూరిస్ఫూర్తిన్. 57

క. గ్రక్కునఁ బ్రలంబవైరియు
నక్కజముగ భసిత మెడలు(నట్లు)గఁ బ్రోయఁగా
జిక్కిన తచ్ఛేషంబును
మిక్కిలిఁ దాపంబు నతని మేనం జూపెన్. 58

సీ. బలభద్రుఁ డపుడు కన్నుల నిద్రజేరంగ
నావులింపుచు భ్రమంబావహిం(చి)
(చు)ట్టుఁ దిరుంగుచు నిట్టూర్పువుచ్చుచు
రోమాంచమిళితగాత్రుండు నగుచు
నల్లనల్లన వచ్చి యల్లజనార్దనుఁ
జేరి దేవోత్తమ! చిత్స్వరూప!
కృష్ణ! హృషీకేశ! యిప్పు డీతాపంబు
నేర్పుమై శాంతిఁ బొందింపు మనినఁ

గీ. కమలదళనేత్రుఁ డాబలుఁ గౌఁగలించి
జ్వరకృతంబైన తాపంబుఁ జనఁగఁ జేసె
నంత మొప్పటియట్ల యనంతబలుఁడు
[1]ప్రబలుచుఁ బ్రకాశించెను భవ్యలీల. 59

—: శ్రీకృష్ణుఁడు మహేశ్వరశక్తితో యుద్ధముచేసి జయించలేక ప్రతిశక్తిని నిర్మించుట — రౌద్రవైష్ణవశక్తుల యుద్ధము :—

వ. ఇవ్విధంబున నిజాగ్రజుం బ్రహృష్టాంతరంగుఁ గావించి పుండరీకాక్షుండు మహేశ్వరజ్వరంబునగ్రంబున నిలిచి యిట్లనియె.

గీ. దుర్మదము మాని తొలఁగు నీపేర్మి యింకఁ
జెల్ల దీయుడఁ గాదని చేరితేనిఁ
గఠిననిర్ఘాతసమముష్టిఘాతములను
నీదుగర్వం బణంచెద నిక్కవంబు. 60

1. ప్రబలి ప్రకాశించె భవ్యలీల.

క. అనుటయు నది కోపంబున
నవలంబును బోలె నుజ్జ్వలాకారంబై
తనసవ్యేతర బాహువు
లను ఘసితము విసరె నతఁడు లక్ష్యముగాఁగన్. 61

వ. అంత,

సీ. శౌరి మహేశ్వరజ్వరకల్పితంబగు
సంతాప మందె నొక్కింతతడవు
జ్వర మంతలోనె భుజంగమాకృతులైన
తనభూరిహస్తంబులను దదీయ
కంఠంబుఁ జఱచి తత్కఠినవక్షమునందు
ముష్టిచేఁ బొడిచిన మురహరుఁడును
శీఘ్రము(బ) యుగ్రముష్టిప్రహారంబుల
జ్వరముశిరంబు వక్షంబు నొంచె

గీ. నదియు నతనియురంబును హస్తములను
జఱచి కరచిన నాహరి సస్మితముగఁ
దన (కరగదను) దాని వక్త్రంబు నడఁచి
త్రోసె నది బల్మి మఱియును డాసె నతని. 62

వ. ఇట్లు భుజత్రయుఁబుగల మహేశ్వరజ్వరంబును నెనిమిది భుజంబులుగల గరుడధ్వజుండును బ్రకటగిరికటకనికటశటపతితనిర్ఘాతతులితధ్వానంబులైన ముష్టిఘాతంబులఁ బరస్పరంబు నురస్థలంబు నొంచుచు ధారాధరస్తనితగంభీరంబుగా నార్చుచు

ఘోరంబుగాఁ బోరుచునట్టియెడ, వియచ్చరవరు లచ్చెరుపడి మున్నెన్నఁడు నిట్టిసమరంబు గన్నవిన్నయది గాదని పొగడు వచనంబులు గగనంబున నిగుడ నంత దానవాంతకుండు నెంతయుఁ గోపాటోపంబు దీపింప నమ్మాహేశ్వరజ్వరంబును నిగ్రహింపఁ దలంచి కుపితసమవర్తి (వశవర్తి) ప్రతిఘంబ (న)ఁ దగు నిజభుజాపరిఘంబున వజ్రకఠినంబగు తద్వపుంబు గుల గులలుగా నగల్చి గర్జించి బాహువులఁ బట్టి నేలఁ బడఁద్రోచిన, తద్బాహువులవెంబడిఁ దదీయహృదయంబుఁ బ్రవేశించి మఱియు ఖేదంబుఁ బుట్టించె, నమ్మధుసూదనుఁడును మాహేశ్వరజ్వర ప్రవేశవ్యాకులితాంతరంగుండై క్షణమాత్రంబు గాత్రంబు గగుర్పడ నావులింపుచు నిద్రాపరవశత్వంబు నొంది, యిట్టి గుణంబు (లఁ గలది తజ్జ్వరమని మనంబు)న నెంచి కోపించి తజ్జ్వరంబు నిగ్రహింపఁజాలిన ప్రతిజ్వరంబుఁ గల్పించిన, నదియును నాల్గుభుజంబులును నాల్గుముఖంబులును నాల్గు విధము)లైన యాయుధంబులు ధరించి మాహేశ్వరజ్వరంబు నెదిరించి సింహనాదంబుఁ జేసి బాహుయుద్ధంబునకుం జొచ్చి (వివిధగతుల యుద్ధముఁ జేయుచునుండ గం)ధర్వగణంబు లంతరిక్షంబున నిల్చి విస్మయాయత్తచిత్తులై వీక్షింపుచుండి, రంత మాహేశ్వరజ్వరంబు.

క. పవిసమహాస్త్రమ్మున నై
ష్ణవ (బలములు మిగు)లఁ గూలఁ జఱచిన నదియుఁ
జవమున బహువిక్రుతస్వ
రవములు గావించె మిగుల రౌద్రముగాఁగన్. 63

గీ. అంతఁ గోపము రెట్టింప నంతకోప
మాకృతిని వైష్ణవజ్వరం బాజ్వరంబు
మస్తకంబులు నిజఘోరహస్తములను
బదియ మోఁదుచు మఱియు వక్షంబు నడిచె. 64

చ. అడిచిన శాంకరజ్వ.............జేసి తజ్జ్వరం
బుడుగక పైఁబడన్ సునిశితోగ్రగదంబులచే తదీయమా
వెడఁద యురంబున.......................
.......యుద్ధము నహీనబలంబునఁ జేయు నత్తరిన్. 65

ఆ. వైష్ణవజ్వరంబు వడి శాంకరజ్వరం
బును నిజోగ్ర.................
....
....................లను జాలగాసి సేసె. 66

వ. అంత.

ఉ. ఘోరతరస్వరంబునను గూయిడునట్టి జ్వరం............
...రము సేసెదం గను మటంచును బెట్టుగనార్చి శౌరియున్
గ్రూరమహేశ్వరజ్వరము గూలు...............
..............................జే నద్భుతంబుగన్. 68

గీ. కృష్ణదేవ! యదూద్వహా! యీజ్వరమును
గృపను వీక్షించి..............
....
...........ముగాఁ బల్కె నచట నాకాశవాణి. 68

క. వనజాక్షుఁడు తద్వాక్యము
విని రౌద్రజ్వర.....................
....
...............యుచు నదియు నధికహర్షముతోడన్. 69

మ. అనుతాపంబును జెంది శౌరికిని సాష్టాంగ......
.........ము.............మంబునం జేర్చియో
దనుజారాతి! త్రిలోకనాయక! సురేంద్రస్తుత్య పాదాంబుజా!
నను రక్షింపుమట.................. 70

—:o:—

పద్యానుక్రమణిక

పద్యములు	పుట
అ	
అంగనాహృదయహారి	113
అంతఁ గోపము రెట్టింప	131
అంతఃపురంబున కలికక	42
అంత బలదేవమదన	127
అంత సాత్యకి మొదలైన	117
అందంబుమీరంగ నలివేణి	69
అంబుజనాభ ! యింక	123
అంబుజాక్షుండు సింహనాదంబుఁ	122
అక్రూరా ! నీవేల	15
అఖిలజగన్మయుండైనట్టి	36
అచ్చెరువందుచు వారలు	88
అట గరుడుండు పక్షజనితా	119
అటుగనుక దూరమగు	116
అట్లుగావున నన్ను	55
అడిచిన శాంకరజ్వ	131
అతిభాస్వరమగు రూపము	119
అతివ ! దాఁగిలిముచ్చు	40
అత్తరిఁ జిత్రరేఖ	92
అది గని కంభు(నిరో)గము	120
అద్రిసముత్తుంగభద్ర	50
అన విని కంసమర్దనుఁడు	115
అనవుఁడు గోపించి	90
అనవుఁడు నట్లుకాక యని	124

పద్యములు	పుట
అనవుఁడు రేవతీరమణుఁడా	120
అనినఁ గోపము రెట్టింప	122
అని పలుకు చెలులకలుకులు	28
అని పల్కి నవ్వి రుద్రుఁడు	9
అని పల్కిన చెలిమాటలు	19
,, ,,	77
అని మదను మదనబలముల	46
అని మధుమథనుఁ జూడిన	116
అని మనమున నుప	84
అని యనిరుద్ధుని నింతులు	102
అని యొకపని నెపమున	78
అనిరుద్ధుఁ డవియొల్ల	97
అనిరుద్ధుండును రోష	95
అనిరుద్ధుని దోడ్కొని	62
అనిరుద్ధు నిటకు	55
అనిరుద్ధుని లావెఱుఁగక	91
అనిరుద్ధుని సౌందర్యము	74
అని లాలింపుచు నయ్యుష	80
అని వనిత నూఱడింపుచు	101
అనుచుఁ గుంభాండుఁ జూడిన	98
అనుచుఁ దగఁ బల్కి	91
అనుచు దనుజపుత్రి	64
అనుటయుఁ జిత్రరేఖ	59
అనుటయు నతనికి హరి	120

పద్యములు	పుట
అనుటయు నది కోపంబున	129
అనుతాపంబును జెంది	132
అపుడు కృష్ణుండు	114
అపుడు మనుప్రైరి	119
అమితకళాభోజాననను	7
అమృతహరణప్రవీణ !	120
అరవిందముకుళవిగళ	57
అరుణాబ్జజాయికాంబా	112
అరుణోదయంబున	101
అరుదగు తనసతినామము	37
అలఘుపరాక్రమనిధి	93
అల చకోరము వెన్నెల	44
అల చిత్రరేఖ మనతో	46
అల యచ్యుతభూవిభునకు	5
అల యుషఁ జూచి గౌరి	12
అల రుక్మిణీదేవి యందంబు	106
అల వసుదేవున కాత్మ	6
అల విభునామంబు	47
అల విరివింటిరాయలు	75
అల్ల కుంభాండుని	26
అవసరమువార లప్పుడె	108
అసురేంద్ర ! నీకన్య	89
ఆ	
ఆచిత్రరేఖ దా నఖిల	64
ఆసురాంతకపౌత్రుఁ	92
ఆయెడ వలరాయఁడు	38
ఆశ్వినేయకుమారుల	51
ఆసఖీమణి సప్తవాసర	49
ఇ	
ఇంత చలింపనేల	91
ఇంత చింతింపంగ నేలనే	25

పద్యములు	పుట
ఇంతి ! నీవలిగిన	84
ఇంతులు గొల్వఁ బొట్ల	103
ఇందు బింబముతోడ	68
ఇచ్చకములాడి మిక్కిలి	102
ఇటు లాడఁగా దగునయ్య !	117
ఇటు వగచిన యుష	17
ఇట్లు బాణజయార్థమై	114
ఇది శోణపురమందు రిందుకు	76
ఇరువురు నీ క్రియ నుండఁగ	81
ఇల కిటువలె దిగి వచ్చిన	110
ఇల్లిల్లు వెదకి యప్పుడె	103
ఇవ్విధమున లాలించిన	63
ఇవ్విధమున విహరించిన	34
ఈ	
ఈకైవడి ననిరుద్ధునిఁ	65
ఈతని కులమును గుణము	53
ఈఁత యిక్కడను లేదింతిరో !	33
ఈ పసిది నలుగురు భుజా	126
ఈ రీతి బాణుఁ జేసిన	96
ఈ రీతి విక్రమంబున	97
ఉ	
ఉదుటగు చిల్కతేజిపయి	75
ఉవిదరో ! వినవమ్మ	20
ఎ	
ఎంతకుఁ గినుకను	97
ఎటు బోవంగలవాఁడ వింక	127
ఎనయఁగ నాయెడఁగా	47
ఎవ్వతె యీ బాలామణి	76
ఎవ్వరితోడం బలుకదు	71
ఎవ్వరు మెత్తు రీపలుకు	54

పద్యములు	పుట
ఏ	
ఏదేవుఁ డఖిలామరేశ్వర	53
ఏనోము నోఁచెనో!	22
ఏపున నేమిందఱముక్	89
ఏలా మీకీయోజన	107
ఒ	
ఒకరొకరి చేయి	33
ఒక్కుమ్మడి వడి నడచుచు	123
ఒప్పైన కురులకు	33
ఒయ్యారమునఁ దన	86
ఓ	
ఓ యసురేంద్ర! వీని నని	98
ఓ రజనీచరేంద్ర! హిత	99
క	
కటకట! సప్తదినంబులు	21
కడఁకమయి సురల వీఁపున	116
కడు మనోవాక్కాయ	18
కదనమునఁ గిట్టి తనబలము	115
కదియు చీఁకటిఁ	84
కదిసి ప్రేమను వీని	82
కనకక్షితిధరధృతికిని	8
కనకతులాపూరుషముఖ	7
కనకమయాంబరములను	87
కనుదోయిఁ గొప్పియుక్	40
కన్నియ! దైన్య మొందకుము	101
కన్నెపాయముదాన	43
కమలంబుల్ ముకుళించె	37
కమలంబులు వికసించెను	105
కమలదళాక్షి! నీ కలలోన	19
కరియూథంబులఁ గనుఁగొని	92

పద్యములు	పుట
కరుణారసోత్తుంగ	52
కలకల నవ్వుచు	40
కలఁగకు నెమ్మదిఁ గోపల	26
కలఁగని మేలుకాంచి	15
కలఁ గనెదువారు కేరా	71
కలఁ గలసిన యల చెలువుని	39
కలఁగుచు నుండెదు వేళను	42
కలలోనఁ గూడిన	82
కలలోఁ జూచిన పురుషుని	20
కలలోఁ జేసిన చిన్నెలు	17
కర్తవు సకలలోకములకు	117
కాంతుఁడు కన్నుల	23
కింకిణీరవముల సొంకమై	94
కుంకుమఁ బూసెద	80
కుండకయుండఁగఁ గరముల	73
కుతుకముమీరఁగ	36
కులగిరికన్యక	13
కృష్ణదేవ! యదూద్వహ!	131
కృష్ణుని మనమునఁ దై	8
కోపాటోపనిటాంతో	121
క్షీరాంబుధి జనియించుచు	46
ఖ	
ఖగకులనాథుఁడు	115
గ	
గండశైలముకీతిఁ గనుపట్టు	87
గండంబు మైఁ బూసి	15
గంధగజమును బరికించి	96
గమకంబులైన బంగారు	60
గాండీవధరుఁడు సద్గుణ	51
గిలిగింత లిడుచు మిగులక్	80

పద్యములు	పుట
గౌరి యనుగ్రహంబునను	20
గ్రక్కునఁ బ్రబలంబవైరియు	128
ఘ	
ఘనముగ నార్పు లుప్పతిలఁ	91
ఘనమైన కార్యంబు	56
ఘనసంఘంబు ప్రచండ	93
ఘోరతరస్వరంబున	131
చ	
చంద్రిక నిరసించు	13
చనవరులగు గరితలతో	107
చలికరువలి వెచ్చెలివై	46
చీఁకటు లనియెడు	37
చెంగమలావరకరుణా	7
చెంగమలేశపదాంబుజ	66
చెక్కిటఁ జేయిడి	21
చెలరేఁగి యెలదేఁటి	38
చెలిమిఁగా లక్ష్మిని జోడుఁగూడి	77
చెలు లంద ఱిట్లు గొల్వఁగ	107
చెలులార! కంటిరా	24
చెలు లిటువలె గైసేయఁగ	63
చెలులు చుట్టును గొల్వ	71
చెలువగు హేమసౌధమును	70
చెలువుని దెచ్చితి నీతో	65
చెలువుమీరిన యట్టి	41
చేరంగ రమ్మని చేపట్టి	78
జ	
జగము లన్నియును సృజియింప	112
జనమేజయజనపాలుఁడు	8
జయ శంఖచక్రాసిశార్ఙ్గ	118
జలగాత్రానంగసంకర్షణులు	120

పద్యములు	పుట
జలజాక్షి! చూచితే	81
జలజాక్షి! వినుము	12
జవ్వని నేరములేకనె	81
జూటుకాఁడగు వీఁడు	43
త	
తండ్రిదగ్గఱఁ బోయి	17
తడవాయ వచ్చి యిట	60
తనచెల్మి నెంచి యుత్తరి	68
తనయుఁ జేకార్యంబుఁ	108
తనయునియాఁదనె దాడిగ	75
తనర నారఘునాథ	6
తనర నేఁ జేసిన	22
తనరెడు మన్నరుదాస	5
తన పేయికరంబులచే	96
తన సవ్యకరమునంచలి	127
తిరమిడి తనలో నవ్వుచు	25
తలయూఁపుచుఁ దత్తఱపడి	89
తామరతూడులఁ	72
తావుల నెదచల్లు తామర	32
తెల్లనిమేనిపై నలరు తేజము	110
త్రిజగంబునను గల్గు	70
ద	
దండె తంబుర స్వర	29
దనుజభంజన! నన్ను	115
దనుజాధీశుని పంపున	90
దానవభంజనుం డహిమ	118
దారుణశాత్రవ	7
దివిజులకైనను దేరిచూడఁగ	83
దురమున నెదిరిన	118
దుర్మదము మాని తొలఁగు	128

పద్యములు	పుట
ద్వారకకేఁగి యాపురము	77
ద్వారకలోన నానగర	70
ధ	
ధ్యానంబు నారాయణా	35
న	
ననవింటివాని గాసికి	76
నవ్వులతోను మనలోఁడను	104
నారదచోదితుఁ డగుచును	100
నారదుఁ డావృత్తాంతము	101
నిఖిలలోకంబుల నీకంటె	65
నిద్దురలేచియు న్మిగుల	74
నిలునిలు మనుచును	94
నిస్తులసద్గుణావళుల	7
నీపతి మన్నరదాసుఁడు	5
నీవును మఱియును గల	122
నీవు మహానుభావుఁడవు	116
నెయ్యముఁజేసి ప్రసంగము	71
నెరిపెండ్రుకలకప్పు	72
నెలకొను విరహముచేతను	24
ప	
పంచదార నొసంగి	83
పంచరత్నంబుల పనిహార్ల	59
పక్షికులాధ్యక్షుండు	126
పగడంపుచాయల	87
పచ్చవిల్తుఁడు వాఁడి బాణంబు	75
పటుజంఘాలఘవద్గరు	116
పట్టణము నాల్గుదిక్కులం	123
పడకింటిలోపల	102
పడఁతి యొక్కతె మాడుపంబు	61
పణఁతి యొక్కతె	28
పదపద్మముల చాయ	29
పన్నగపాశబద్ధుఁడగు	100
పన్నగాశన ! నీవు వెన్నాడగా	125
పన్నిటిచేతను బాగుమీరఁగ	62
పరమప్రాసకుతార	124
పరికింపు కృతనేత్ర	49
పరిమళంబులు నించు	30
పలికి మనమెల్ల	25
పలుమరు గాఁక	47
పల్లవంబుల మించు	12
పవిసమహాస్త్రమ్మున	130
పాయనిభీతిఁ బాంధులకు	38
పార్వతివరమున	10
పుక్కిటివిడె మిచ్చి	44
పుణ్యవంతుఁడు మిగుల	50
పున్నమనాఁటి చందురుని	56
పుష్పాడిని దిన్నఁ దీర్చుచు	35
పురమున నాయకాసురుఁడు	47
పెంచిన చిల్కను	23
పొలఁతి యొవ్వతె చేరి	45
పొలుపుమీరిన యుట్టి	106
పొలయుల్కచేతను బొలఁతి	85
ప్రజ్వరిల్లెడు హోమ	93
ప్రతిలేని పసిఁడిచప్పరపు	62
ప్రతిలేని రతనాల	35
ప్రద్యుమ్నుం డరితిమిర	126
ప్రద్యుమ్నోపేతసంకర్షణ	123
ప్రళయకాలమునాఁటి	95
ప్రళయహుతాశనప్రకర	126
ప్రేమతోఁ జక్కెర	45

పద్యములు	పుట
ఫ	
ఫణిరాజహారచింతా	36
ఫుల్లాంభోరుహమిత్రు	58
బ	
బంగరుమంచముమీఁదను	14
బటువగు మామిడికిందను	34
బలదేవప్రద్యుమ్నులు	123
బలభద్రుఁ డపుడు కన్నుల	128
బలభద్రుఁ డప్పుడు	111
బలితమాధవుఁడగు	111
బలిపుత్రుఁ డప్పుడు	98
బలిసుతుఁ డేలెడు నీపురి	19
బలువగకిన్కచే వెలయ	94
బల్లిదుఁడై మొల నరవిరి	32
బాణనందన కష్టు	41
బాణనందనకును	77
బాణుఁ డంత నిశాత	96
బాణుఁ డీరీతి నొప్పింప	97
బాణునకు నోడి చనిన	46
బాలిక బడలిన భావంబు	80
బాలితో రమణుండు	108
బొమ్మల పట్టుకోకలను	34
భ	
భూరిబలరూపవిద్యా	51
భూరిబలాఢ్యుఁ డి విహగ	121
మ	
మకరాంకాకృతి నాథుఁ డొక్కరుఁడు	22
మణిసౌధరుచిజాల	60
మదమున సహస్రకరుఁ డన	85
మనకోరిక లీడేరను	78

పద్యములు	పుట
మనమలరఁగ నీవల్లభు	55
మనసిజకేళిఁ దాను	81
మరుకాఁకలచే మిక్కలి	20
మరుకాఁకల భ్రమనొందుచు	40
మఱచిన కార్య మియ్యెడ	19
మలయజగంధి యెంతయును	20
మాగధసూతవందిజన	117
మానిని ! యట్లన కానిమ్ము	58
మానిని ! యీతఁడు వోసా	54
మించు మొగ్గలను	39
ముక్కంటి గౌరి	12
ముచ్చటఁ దీరఁగ ముద్దు	79
ముచ్చటమీర నాకలను	25
ముచ్చువగమీర నెచ్చెలి	62
ముదిత ! రమ్మని పిఁడు	83
మునుపును శంబరాసురుఁడు	104
ముల్లోకములు మెచ్చ	112
మేలు గాఁ గనుపట్టు	104
మొలకనవ్వులవాఁడు	16
మోముదామరమీఁద	11
మౌనీంద్రుఁ డోడైచ్చి	110
ర	
రమణుల నెందఱైనను	78
రాణించు లత్తుకరసమును	48
రామా ! రమ్మని చెలులా	30
రెప్పవేయక నేను దప్పక	74
రోహిణేయుఁడు బెదిరించి	127
వ	
వచ్చినవారికి నప్పుడె	109
వనకేళి సల్పి యీగతి	32

పద్యములు	పుట
వనజముఖి యోరా!	40
వనజాక్షి! యుద్యానవనము	18
వనజాక్షుఁడు తద్వాక్యము	132
వనజాతనేత్ర కనుఁగొను	65
వనితాజనపరివృతు	61
వరగర్వంబున బాణుఁడు	9
వసుదేవప్రముఖుల వల	109
వాఁడును వచ్చి యవ్విహగ	121
వాయుతనూజుండు వాయు	64
వారలఁ జూచి యిట్లనియె	124
వారాశిపరితప్త	27
వింత యొకటి నేఁడు	109
వినవమ్మా దనుజేంద్రపుత్రి!	17
వినవోయి కుంభాండ!	10
విని బాణుం డాకలకల	121
వినుము రాజేంద్ర!	119
వివిధాయుధరహితుండును	95
వీరల నందఱఁ గనుఁగొని	49
వీరాలాపము లాడెడు	112
వెంకటేంద్రుని పుత్రి	4
వేయిమాటలు నింకేల	56
వైష్ణవజ్వరంబు వడి	131
శ	
శంకర! దేవదానవుల	9
శంఖచక్రగదాఖడ్గశార్ఙ్గధారి	126
శుక్రున కెనయైన	99
శోణపురంబు వారలును	123
శౌరిని సేవింప జంభారి	74
శౌరిపదాబ్జసేవన	26
శౌరి మహేశ్వరజ్వర	129
శ్రీకరగోపురప్రాకార	57
శ్రీజయనిత్యనివాసా	28
శ్రీమహితరాజగోప	114
శ్రీరఘునాథసుధాంబుధి	66
శ్రీరాజగోపహరివరదా	63
శ్రీరాజగోపాలసేవామహిమ	2
శ్రీవిజయాయుధన్నతులచే	1
స	
సంతతసంపదల వసంతుని	1
సత్సంగపువ్వులు	14
సకలంక మైనట్టి చంద్రబింబము	74
సకలసంపదలచే	51
సకలసభామధ్యంబున	2
సరసిజపత్రనేత్ర	39
సలలితమైన చందనము	39
సాక్షాత్కృతకనకవనా	113
సారథి తేరుఁ దెచ్చె నని	107
సారోదారకటాక్షవీక్షణ	1
సుజనరక్షణశోభనవీక్షణా	66
సుదతి! వీరలవెల్ల	86
సురగరుడయక్షరాక్షస	13
సూణాకర్ణాస్త్రము హరి	112
హ	
హతశేషులైన దానవు	93
హరితోడుత నీకార్యము	105
హరియప్డు మేల్కాంచి	105
హరులను గేతువు సారథి	98
హలధరుఁడు నుగ్రుఁడై	125
హరిహరిద్రావర్ణము	119
హాలాసేవన సంతత	62
హృదయలక్ష్యవిభేది	52

తప్పొప్పుల పట్టిక

—:o:—

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
8	10	సంగరంగ	సంగరరంగ
5	4	కృతభర్త్రు	కృతిభర్త్రు
6	1	,,	,,
15	14	పరచుట	పఱచుట
20	19	దెచ్చుటకై	తెచ్చుటకై
25	9	ఇంతఁ జింతింపంగ	ఇంత చింతింపంగ
46	7	నెచ్చలి	నెచ్చెలి
56	10	కేఁగుట	కేగుట
75	7	మీఁదనే	మీఁదన
90	1	బాణాసుని	బాణాసురుని
91	5	ఛలింపనేల	చలింపనేల
99	22	చిన్నిప్రాయంబునఁ	చిన్నిపాయంబునఁ

SARASVATI MAHAL LIBRARY